నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 23-11-2023 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No.L1/HQ/SD/258/2021-2023 సంపుటి :30 సంచిక:89 పేజీలు:6 వెల: రూ.1/-

నమ్మలేని నిజాలు

ఓట్ల జాతర
అవినీతి గత్తర
స్వేచ్ఛకు పాతర.

చాల ముదురు
గుడ్డు పెట్టని కోడి
కోత పడాలి.

పార్టీల హామి
తీపి మాటలు తమ్మి
చెడకు నమ్మి

బడి వాకిళ్లు
పోషక నిలువలు
కండ పెరుగు.

ఆసన యోగం
ఓటర్ల ఆశీర్వాదం
ధన తంత్రాలు

– రేడియమ్
సెల్: 9291527757

శ్రీనిజాలు

ఏరులయ్యే ఎలక్షన్లో
మురికి లాంటి డబ్బు !
ముట్టకండి అంటుతుంది
నయం కాని జబ్బు !

ఎటు చూడూ వ్యూహాలే
రణతంత్రపు ఎత్తులు !
నమ్మాలో నమ్మొద్దో
అన్ని నక్క జిత్తులు !

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

జనాభా లెక్కలతోనే అభివృద్ధి సంక్షేమం

దేశ అభివృద్ధికి కావలసిన మానవ వనరులను అందించడంలో దేశ జనాభా బహుముఖ పాత్ర పోషిస్తుంది. జనగణన చట్టం ప్రకారం భారత దేశంలో ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి జనాభా లెక్కలు సేకరిస్తారు.

ప్రతి పది ఏళ్ళకు ఒక సారి లెక్కించే జనాభా లెక్కల సేకరణ వల్ల జనాభా ఎంత మేరకు పెరిగిందో తెలుసుకోవచ్చు. జన గణన ఆధారంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, అభివృద్ధి ప్రణాళిక, అభివృద్ధి పథకాలు, ప్రాజెక్టుల నిర్మాణం, విద్య వైద్య రంగాల అభివృద్ధి పథకాలు, ప్రజా సంక్షేమ పథకాల రూపకల్పన జరుగుతుంది. జనాభా లెక్కలు సకాలములో చేపట్టక పోవడం వల్ల పేదరికం, నిరుద్యోగం, ప్రాంతీయ అసమానతలు, ఆర్థిక అసమానతలు ఆదాయ అసమానతలు స్త్రీ, పురుష అసమానతలు, లింగ వివక్ష, బాల కార్మికులు, శ్రామికుల వలస వికలాంగుల సంక్షేమం మున్నగు సమస్యల పరిష్కారం పై ప్రత్యక్ష పరోక్ష ప్రభావం ఉంటుంది. జనాభా పెరిగిన దేశం (నిష్పత్తిలో) ప్రభుత్వ రంగంలో పెట్టుబడులు పెరగక పోవడం వల్ల రాజ్యాంగ లక్ష్యమైన ఆర్థిక న్యాయం పంపిణీ న్యాయం ఎండమావిగానే మారింది. జాతీయ శాంపిల్ సర్వే జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ఆర్థిక సర్వే మొదలగు కీలక అధ్యయనాలకు జనాభా లెక్కలు కీలకం అయినప్పటికీ జనాభా గణన 3 యేళ్లు ఆలస్యమైంది.

కరోనా మహమ్మారి కారణంగా జనాభా లెక్కల సేకరణ ఆలస్యమైంది. పరిస్థితులు చక్కబడినప్పటికి కేంద్ర ప్రభుత్వం జనాభా గణన పట్ల అంతగా ఆసక్తి చూపడం లేదు. ఇప్పటికీ కేంద్ర ప్రభుత్వం జనాభా గణన నిర్వహణ పట్ల స్పష్టత ఇవ్వడం లేదు. జనాభా లెక్కలను వాయిదా వేయడం మీద చూపించే శ్రద్ధ నిర్వహణ పట్ల దృష్టి పెట్టని స్థితి నెలకొనడం వల్ల ప్రజా సంక్షేమం అటకెక్కింది.

జనాభా గణన – చరిత్ర

మన దేశంలో బ్రిటిష్ వారు తొలి జన గణన 1881 సం॥లో నిర్వహించారు. బ్రిటిష్ వాళ్ళ పాలన కాలంలో దేశంలో కొన్ని విపత్తులు సంభవించినప్పటికి జనాభా గణన వాయిదా పడలేదు. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో జనాభా లెక్కలు సేకరించారు. వాయిదా వేయలేదు. దేశంలో 1918 లో దేశవ్యాప్తంగా స్పానిష్ ఫ్లూ ఏర్పడి ప్రజారోగ్యం దెబ్బతిన్న జనగణన ఆగిపోలేదు. 1921 లో రిజిస్ట్రార్ జనరల్ జనాభా లెక్కల కమిషనర్ కార్యాలయం జన గణన సకాలములో పూర్తి చేసింది. 1947 లో దేశ విభజన జరిగి పాకిస్థాన్ భారత దేశంగా విడిపోయినప్పటికీ జనాభా లెక్కలు ఆగిపోలేదు. బ్రిటిష్ వారి నుండి భారతీయులకు అధికార బదిలీ గందరగోళ పరిస్థితులు ఉన్నప్పటికీ 1951 లో జన గణన యదా విధంగా జరిగింది.

జనాభా లెక్కలు సేకరణ నిర్వహణకు ఒక సంవత్సరం ముందు నుండే ప్రణాళికలు రూపొందించి ఆ ప్రణాళిక ప్రకారం 2020 ఏప్రిల్ సెప్టెంబర్ మధ్య దేశం లోని అన్ని గృహాలకు వెళ్లి గృహాల లో నివాసం ఉంటున్న వ్యక్తుల వివరాలు సేకరించి తర్వాత సంవత్సరం ఫిబ్రవరిలో దేశము లోని మొత్తం జనాభా లెక్కిస్తారు కాని దేశంలో విజృంభించిన కరోనా మహమ్మారి వల్ల జన కదలిక మీద విధించిన నిబంధనలు అమలు వల్ల జనాభా గణన వీలు పడలేదు.

కరోనా అనంతరం జనాభా గణన వాయిదా పడుతూనే వుంది. గతంలో జనాభా గణన సరిగ్గా జరుగలేదని సేకరించిన వివరాలు కచ్చితంగా లేవని జనాభా గణన కొత్త పద్ధతిలో చేపడతామని నూతన సాంకేతిక ఎలక్ట్రానిక్ పద్ధతిలో చేపట్టనున్నట్లు దేశ కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడించారు ఈ సారి జనాభా గణనలో ఇంతకు ముందు ఎన్నడూ లేని విధంగా 35 కంటే ఎక్కువ సామాజిక ఆర్థిక కొలమానాల ఆధారంగా జనాభా లెక్కలు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. జన గణన ఆధారంగా జనాభా రిజిస్టర్ ఎలక్ట్రోరల్ రోల్ రిజిస్టర్ 'ఆధార్ కార్డు రేషన్ కార్డు 'పాస్ పోర్ట్ ' డ్రైవింగ్ లైసెన్స్ కు సంబంధించిన వివరాలను డాటాను అప్డేట్ చేసి నవీకరించడానికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పడం గమనార్హం.

దేశంలో 2024 న లోకసభకు సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయి .ఎన్నికల వల్ల జనాభా లెక్కల సేకరణ చేపట్టే అవకాశాలు లేవు. దేశంలో లోక్ సభ 'రాష్ట్ర విధాన సభల్లో మహిళా రిజర్వేషన్ బీసీ రిజర్వేషన్ జనగణనలో కుల గణన చేపట్టాలని డిమాండ్ బలంగా వున్నందున 2027 లో జరిగే జనాభా లెక్కల్లో పలు అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.

జనాభా లెక్కల ప్రకారం లోక్‌సభకు రాష్ట్ర విధాన సభలకు ఎస్సీ 'ఎస్టీ 'మహిళా' బీ'సి రిజర్వేషన్ నిర్ధారించడం లోక్‌సభ, విధాన సభ నియోజక వర్గాల పరిధిని నిర్ణయించడం జరుగుతుంది.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విడివిడిగా ప్రవేశ పెట్టే వార్షిక బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్, స్టీల బీ.సీల సంక్షేమానికి వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాలకు నిధుల కేటాయింపు జనాభా నిష్పత్తి ప్రకారం చెయ్యాలి. జన గణనతో ఆర్థిక వ్యవస్థలో వృద్ధి అభివృద్ధి స్థాయిలను అంచనా వేయవచ్చును. దేశంలో వెనుక బడిన ప్రాంతాలు పర్వత ప్రాంతాల ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి సమస్యల పరిష్కారం కోసం జనాభా గణన దిక్సూచి లాగా పనిచేస్తుంది..

ప్రభుత్వం జనాభా లెక్కలను నిర్దిష్ట కాలంలో నిర్వహించకపోవడం వల్ల అనేక నష్టాలు జరుగుతున్నాయి.

దొంగ ఓట్ల బెడద ప్రభుత్వం జనాభా లెక్కలను సకాలంలో నిర్వహించి వుంటే జనాభా జాబితాతో ఓటర్ల జాబితాను సరిచూసుకునేది. దీని వల్ల దొంగ ఓటర్ల బెడద నమోదును అడ్డుకునే అవకాశం ఉండేది. దేశవ్యాప్తంగా అనేక నియోజక వర్గాలలో ఒకే ఓటరు గ్రామీణ ప్రాంతంలో పట్టణ ప్రాంతాల నియోజక వర్గాలలో ఓటర్లుగా నమోదైన సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్ లో నకిలీ ఓటర్లు అధిక సంఖ్యలో రిజిస్టర్ అయినట్లు తెలుస్తోంది. ఇంటి నెంబర్ "నో" అనే పేరు మీద వందల ఓటర్లు నమోదు అయినట్లు తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరో వైపు నకిలీ ఆధార్ కార్డులు పెరిగి పోతున్నాయి.

ఆధార్ కార్డ్ రేషన్ కార్డ్ జన్ దన్ ఖాతాలు ఆధార్ కార్డుతో అనుసంధానించడం వల్ల అనేక ప్రభుత్వ ప్రాయోజిత పథకాల ప్రయోజనాలు అసలు లబ్ధిదారులకు అందడం లేదు.

నకిలీ వ్యక్తులు ప్రయోజనం పొందుతున్నారు. కేంద్ర ప్రభుత్వం సకాలంలో జనాభా లెక్కలు సేకరిస్తే ఇలాంటి నష్టాలను అరికట్టవచ్చును. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో అటవీ కొండ ప్రాంతాల్లో నివసించే వారికి ఆధార్ కార్డ్ ను అందుబాటులోకి తేవాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరంగా వున్న వారిని అభివృద్ధి సంక్షేమ పథకాలలో భాగస్వాములను చేయాలంటే జనాభా లెక్కలు సేకరించాలి.

ఇప్పటికీ దేశంలో 2011లో నిర్వహించిన జనాభా లెక్కల ప్రకారమే రేషన్ కార్డులు జారీ చేయడం వల్ల 10 కోట్ల మంది అసలైన లబ్దిదారులు నష్ట పోతున్నారు ఒక అధ్యయనంలో వెల్లడైంది. జనాభా గణన ఆలస్యం అయితే కోట్లాది లబ్ధి దారులు నష్టపోయే ప్రమాదం వుంది. ప్రభుత్వం త్వరితగతిన సకాలములో జనాభా లెక్కలు పూర్తి చేసేందుకు కార్యాచరణ ప్రణాళికలు చేపట్టాలి. జనగణన పైననే జన సంక్షేమం అభివృద్ధి ఆధారపడి వుంది.

–నేదునూరి కనకయ్య 9440245771

మనిషి - ప్రకృతి-కృతి

–డా॥ కత్తి పద్మారావు
9849741695

ఆ కొండ అంచుల నుండి
జారుతున్న మంచు తుంపరులు
భూమిపై
ముత్యాల పందిరి వేస్తున్నాయి.
మబ్బుల సౌందర్యంలో
రూప నైగనిగ్యం ఉంది.
ఆ పక్షుల గుంపు విశాలాకాశపు
అంచుల్ని తాకి వస్తున్నాయి.
ఆ కొండలు ఒకదాని తర్వాత ఒకటి
ఎత్తుగా ఉన్నాయి.
ఆ వడ్రంగి పిట్ట
ఒక కొండ మీద నుండి
మరొక కొండమీదికి
సులువుగా ఎగురుతుంది.
ఎవరో తమ బరువు
తామే పెంచుకొని
భూమి మీద అడుగు తర్వాత అడుగు
వేయలేకపోతున్నారు.
శ్వాస పీల్చడం వీరికి కష్టంగా ఉంది.
శ్వాస ప్రాణధాతువు.
శ్వాస మానవ జీవన స్రవంతికి
ఉత్ప్రేరణ.
శ్వాస సర్వజీవుల జీవన
బంధ వాహిక.
ఢిల్లీలో నైతే వాయువులోనే
కలుషిత విష బిందు సందోహం.
గాలి అలల్లో ఆక్సిజన్ అంతరిస్తుంది.
ఆక్సిజన్ కు మూలమైన
చెట్టు ఆకుల్లో రంధ్రాలు!
వేరు దాసంతట అదే కుళ్ళి
చెట్టు ఒరుగుతుంది.
మనిషి,
నగరం ప్రాణవాయువు కోల్పోతున్నారా?!
జీవితనీ ఒక గమన జీవనం.
గమనం – కదలిక
మనిషికి జీవ సోపానాలు.
వారెందుకు తమలోకి
వెళ్లలేకపోతున్నారు?
పరిమళభరితమైన మాటల్ని
మరచిపోయారా?
వారి మాటల్లో ఆర్ద్రత లేదు.
నిందాపూర్వకమైన పలుకులు
వారిని వేధిస్తున్నాయి.
ఏది పొందలేకపోతున్నారో
వారు తెలుసుకోలేకపోతున్నారు.
సంభాషణలో విన్నాణత లేకపోతే
భాషకున్న గుణం
వ్యర్థమవుతుంది కదా!
భాష ఓ పారుతున్న నది.
భాష ఓ పూస్తున్న చెట్టు.
భాష ఓ కూస్తున్న కోయిల.
భాష కొండ అంచుల నుండి
దూకుతున్న నీటి జల.
శృతిపేయమైన భాషను
కోల్పోయిన వారు
ఎండు కట్టె లాంటివారే కదా!
దేని నుండి వీరు పారిపోతున్నారు?
స్వీయ జీవనం నుండా?
స్వీయ దర్శనం నుండా?
ఆత్మావలోకనం నుండా ?
ఆత్మీయ స్పర్శ నుండా ?
ఆర్ద్రతనుండా?
అవలోకనం నుండా?
ఆలోచన నుండా?
ఆప్యాయత నుండా?
దేని నుండి వీరు పారిపోతున్నారు?
వారు కళ్ళతో చూస్తున్న వేటినీ
వారు మెదడులో
ముద్రించుకోలేకపోతున్నారు!
చిత్రాలు వచ్చి పోతున్నాయి.
చిత్రభ్రమణంలో ఏ రూపమూ
వీరి మనసుకు పట్టడం లేదు.
అభద్రత, భయం
వీరిని వెంటాడుతున్నాయి.
ధైర్యంగా కళ్ళలోకి చూసే తెగువలేదు.
ఏది చూస్తున్నారు దానికి
ముసుగేస్తున్నారు.
ఏది చేయలేరో అది
ఇతరులకు చెబుతున్నారు.
బోధి అసత్య ధుని అయితే
చెవులు ఆలకించవు కదా!
త్యాగం – సమర్పణ – సేవ లేని
జీవితాలకు వెలుగు లేదు.
వారు దీపాల పందిరిలోనే
జీవిస్తున్నారు.
కానీ వారు
చీకటి సంద్రంలో చిక్కుకొని ఉన్నారు.
అందుకే ఆ దీపాలు వారికి
వెలుగును అందించలేకపోతున్నాయి.
వాల్టేరు వివేచించాడు.
రూసో అనుభూతి పొందాడు.
అరిస్టాటిల్ నిర్మాణం చేశాడు.
హెగెల్ గతితర్కం చెప్పాడు.
మేధస్సును – హృదయాన్ని
వీరంతా కదిలించారు.
నూత్న జ్ఞానాన్ని అందించారు.
వారు భౌతికంగా లేరు.
వారి జ్ఞానం మాత్రం
నక్షత్ర మండలంలా ప్రజ్వలిస్తుంది.
ఎవరూ ఎక్కువా కాదు.
ఎవరూ తక్కువా కాదు.
మనిషి తనను తాను
వెలిగించుకోవడంలోనే ఉంది.
అంతర్మథనమే బుద్ధికి చేతన.
మజ్జిగ చిలికే కొలదీ వెన్న వస్తుంది.
వెన్నను కాచే కొలదీ నేతికి
సువాసన వస్తుంది.
అన్ని రంగులు – రుచులు
మీలోనే ఉన్నాయి కదా!
అవి దర్శించు.
ప్రకృతి విన్యాసం నీకు
అర్థమవుతుంది.
వారివరో ద్వేషదృశ్య
విన్యాసం చేస్తున్నారు.
మల్లెమొగ్గ చంద్రోదయం
అయ్యే కొద్దీ విచ్చుకుంటూ
పరిమళిస్తుంది కదా!
వారు సూర్యోదయాన్ని
ఎందుకు నిరాకరిస్తున్నారు?
కిరణాలపై ద్వేషమా?
అలలపై ద్వేషమా?
వాయు తరంగాలపై ద్వేషమా?
చివరకు తమ శ్వాసపై
తమకు ద్వేషం!
అందుకే వారి గుండె కొట్టుకోవటం
త్వరగా ఆగిపోతుంది.
ప్రకృతిని ప్రేమించండి!
జీవితాన్ని ప్రేమించండి!
శ్వాస ఓ జీవన మార్గం.
వాయువు స్వచ్ఛతే
సమాజానికి – మనిషికి ఊపిరి.
స్వచ్ఛమైన గాలిని పీల్చుదాం.
అనంతమైన జీవన గమనం చేద్దాం.
మనిషి – ప్రకృతి – కృతి
శృతి బద్ధమైతే
జీవితం ఒక మధురగానమౌతుంది.

మంచితనానికే విలువుంటుంది–డా॥కె.వి.రమణాచారి

మనిషి మంచితనానికి అభినందనలు వెల్లువెత్తుతాయని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డా॥కె.వి. రమణాచారి అన్నారు. సౌమిత్రి పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శుక్రవారం రవీంద్రభారతిలో 78 ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రముఖ కథారచయిత కూర చిదంబరం "అభినందన సంచిక", "జీవన చదరంగం", "అనుభవాలు– పాఠాలు" ఆవిష్కరణలో ముఖ్య అతిథిగా డా॥కె.వి. రమణాచారి పాల్గొన్నారు. జీవితంలో ఏ ఒక్క మంచి పని చేసినా ప్రజలు గర్తుంచుకుంటారని, రచయితగా మంచి కథలు రాస్తు సమాజానికి మంచి సందేశమిస్తున్న కూర చిదంబరంను అభినందించారు. ఏ ఒక్క కథ చదివిన ఆ కథ పాఠకులను ఆలోచింపజేస్తుందని, ఆలోచింపజేసే కథలే మనిషి ప్రవర్తనను మారుస్తా యని అలాంటి కథలు రాసి మంచి కథకుడుగా పేరు తెచ్చుకున్న చిదంబరం రాసిన రచనలను కొనియాడారు.

కూర చిదంబరం అభినందన సంచిక ఆవిష్కరణలో తంగిరాల చక్రవర్తి, బొగ్గారపు దయానంద్, బైస దేవదాసు, ఆవిష్కర్త డా॥కె.వి.రమణాచారి, కూర చిదంబరం, విహారి, సుధామ, కడారు సత్యమూర్తి.

సభకు అధ్యక్షత వహించిన సీనియర్ జర్నలిస్టు బైస దేవదాసు మాట్లాడుతూ సామాజిక అంశాలను తీసుకుని కథలు రాస్తున్న కూర చిదంరబం ప్రముఖ కథా రచయితగా గుర్తింపు పొందారని, మంచి సమీక్షకుడిగా వందలాది పుస్తక సమీక్షలు చేశారని అన్నారు. అన్ని పత్రికల్లో ఆయన రాసిన సమీక్షలు కనిపిస్తాయని ఒక్క నేటినిజం పత్రికకే రెండు వందలకు పైగా పుస్తక సమీక్షలు చేసి సాహిత్యకారుల మన్ననలు పొందారని తెలిపారు.

కూర చిదంబరం దంపతులను సత్కరిస్తున్న డా॥కె.వి.రమణాచారి, బైస దేవదాసు, విహారి, సుధామ, తంగిరాల చక్రవర్తి తదితరులు.

విశిష్ట అతిథిగా పాల్గొన్న యం.ఎల్.సి. బొగ్గారపు దయానంద్ కూర చిదంబరం రాసిన "అనుభవాలు–పాఠాలు" రెండవ భాగాన్ని ఆవిష్కరించారు. చిదంబరంతో తనకున్న సాన్నిహిత్యాన్ని అనుభవాలను వివరించారు.

"జీవన చదరంగం" కథల సంపుటిని ఆవిష్కరించిన ప్రముఖ కవి, సాహితీవేత్త, సమీక్షకులు విహారి మాట్లాడుతూ.. చిన్నకథలే పాఠకులు ఆదరిస్తున్నారని చిన్న కథలు రాయడంలో మెలకువలు నేర్చుకున్నారని చిదంబరంను అభినందించారు. కథలు ఎలా రాస్తే పాఠకులను ఆకట్టుకుంటాయో క్లుప్తంగా వివరించారు. సాహితీ సుధానిధి సుధామ మాట్లాడుతూ కథలు రాయడంలో చిదంబరం పట్టు సాధించారని అన్నారు.

అఖిల భారతీయ భాషా సమ్మేళన్ తెలంగాణ శాఖ అధ్యక్షులు కడారు సత్యమూర్తి, వంజారి రోహిణి, డా॥ సంకేపల్లి నాగేంద్రశర్మ, తుమ్మూరి రామ్మోహనరావు, వర్ఘుల శివకుమార్, జింబో, చీకోలు సుందరయ్య, మట్టిగుంట వెంకటర మణ తదితరులు పాల్గొన్నారు.

కూర చిదంబరం దంపతులను అతిథులు ఘనంగా సత్కరించారు. చివర కూర చిదంబరం స్పందిస్తు పిలవగానే పెద్ద సంఖ్యలో వచ్చి నన్ను అభినందించినందులకు ధన్యవాదాలు తెలిపారు. తంగిరాల చక్రవర్తి వందన సమర్పణ చేశారు.

ఘనంగా జరిగిన నిజాం వెంకటేశం స్మారక సాహిత్య పురస్కారాల ప్రదానం

నిజాం వెంకటేశం స్మారక సాహిత్య పురస్కారాల సభ సికింద్రాబాద్‌లోని పద్మారావు నగర్ బెల్వెడేర అపార్ట్‌మెంట్ ప్రాంగణంలో జరిగింది. 14 నవంబర్ నిజాం వెంకటేశం గారి 75వ జన్మదినం సందర్భంగా ఈ పురస్కారాల సభ ఏర్పాటు చేయడం జరిగింది. సాహిత్య విమర్శలో విశేష కృషి చేసిన వారు పంపిన రచనల నుంచి మూడు గ్రంథాలను ఎంపిక చేసి పురస్కారాలను అందజేయడం జరిగింది. యువకవి పురస్కారానికి ఒకరిని, ప్రోత్సాహక పురస్కారానికి మరొకరిని ఎంపిక చేయడం జరిగింది. పురస్కార గ్రహీతలకు తలా ఐదువేల రూపాయల నగదు బహుమతితో పాటు మొమెంటోతో, శాలువతో సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా బి.ఎస్. రాములు గారు రచించిన 'జీవనగమనం' రెండు సంపుటాలతో పాటు 'నాగశాల' కథల సంపుటిని, 'కథలబడి' తదితర ఎనిమిది గ్రంథాలను అవార్డు గ్రహీతలకు బహూకరించారు. ఈ సమావేశాన్ని బి.ఎస్. రాములు, ఎ. గంగారెడ్డి, ఆడెపు లక్ష్మీపతి, డా॥ వింజమూరి సూర్యప్రకాష్, ఎం. శంకరయ్య, నిజాం ప్రశాంత్ కలిసి సంయుక్తంగా నిర్వహించారు. వేదికపై వీరితోపాటు జూకంటి జగన్నాథం, సిహెచ్‌వి. ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

పురస్కారం అందుకుంటున్న డా॥ త్రివేణి, పురస్కారం అందజేస్తున్న వాడ్రేవు చినవీరభద్రుడు

పురస్కారం అందుకుంటున్న గోపగాని రవీందర్ పురస్కారం అందజేస్తున్న బి. నర్సన్

ఈ సాహిత్య సభకు విచ్చేసిన వారిలో ప్రముఖ సాహితీవేత్తలు నిజాం వెంకటేశం చిరకాల మిత్రులు ఎందరో ఉన్నారు. డెబ్బై యేళ్ల మిత్రుడు నరాల వెంకటేశం, సాహితీవేత్త రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ బి. నర్సన్, లేబర్ కమిషనర్ రిటైర్డ్ సమ్రాట్ అశోక్, అడ్వకేట్ గుండేటి గంగాధర్, సుప్రసిద్ధ సాహితీవేత్త కూర చిదంబరం, సంపత్ రెడ్డి, వాడ్రేవు చినవీరభద్రుడు, బొమ్మదేవర నాగకుమారి, ఈనాడు డిప్యూటి ఎడిటర్ శ్రీనివాస్, ప్రొఫెసర్ ఏకు తిరుపతి, డా॥ పత్తిపాక మోహన్, తులసి సంపత్ కుమార్, స్కైఫౌండేషన్ వ్యవస్థాపకులు సంజీవ్ కుమార్, పావని, ఆర్యవైశ్య సంఘం నాయకులు శ్రీనివాస్, శంకరయ్య తదితరులు హాజరైనవారిలో ఉన్నారు.

కుటుంబ సభ్యులు శ్రీమతి నిజాం మాధవి, నిజాం ప్రశాంత్, నిజాం సంధ్య, నిజాం ఆదిత్య, సమత ఈ సభ విజయవంతం కావడంలో అన్నీ తామై ఏర్పాట్లను నిర్వహించారు. ఉదయం 11:45 గం॥లకు నిజాం వెంకటేశం గారి చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించారు.

సభను ప్రారంభిస్తూ, 'అందరి ఇల్లు' ఫేం డా॥వింజమూరి సూర్య ప్రకాష్ నిజాం వెంకటేశంగారితో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేశారు. గత పదిహేను సంవత్సరా లుగా 'అందరి ఇల్లు'తో, స్ప్రెడ్డింగ్ లైట్‌తో, పుస్తకాల పరిచయం కార్యక్రమాలతో అన్నిట్లో ఎలా చురుకుగా నిజాం వెంకటేశం సహకరించేవారో పేర్కొన్నారు. నిజాం వెంకటేశంకు సాహిత్యంతో పాటు సామాజిక సేవా రంగం, రాజకీయాలు, సాంస్కృతిక సేవా రంగం తదితర అనేక విషయా ల్లో తెలియని విషయం లేదంటూ వందల మందికి నిరంతరం స్ఫూర్తిని చ్చేవారని, ఆయా గ్రూపులతో నిమిత్తం లేకుండా, అందరితో స్నేహం, సహ కారం చేయూత కొనసాగిం చేవారని పేర్కొన్నారు.

రిటైర్డ్ ఇంజినీర్ ఎ. గంగారెడ్డి 60 సంవత్సరాలుగా నిజాం వెంకటేశంతో తమకున్న అనుబంధాన్ని, ఆత్మీయతను గుర్తుచేసి కన్నీరు పెట్టుకున్నారు. నిజాం వెంకటేశం పలు రంగాల్లో కృషి చేశారని పేర్కొన్నారు.

1980లో జూకంటి జగన్నాథం సహకారంతో 'దిక్సూచి' అనే వచన కవిత్వం బులెటిన్‌ని 12 సంచికలు వెలువరించారని పేర్కొన్నారు. 1982లో బి.ఎస్. రాములు, జూకంటి జగన్నాథం, అల్లం రాజయ్య, ఆర్.కె., ఎ. గంగారెడ్డి గార్లతో కలిసి 'భూమి' కథల సంపుటిని, 'బతుకుపోరు' నవలను, 'బొగ్గుపొరల్లో', 'అడవిలో వెన్నెల' కథా సంకలనాలను ప్రచురించారు. జగిత్యాల, కరీంనగర్, సిరిసిల్ల, ఫిలిం సొసైటీ నిర్మాణంలో పాల్గొని ఉత్తమ చిత్రాల ప్రదర్శన ఏర్పాటు చేసి, ఉత్తమ అభిరుచులను పెంపొందించడానికి కృషి చేశారు.

నిజాం వెంకటేశం పుట్టినరోజు 14 నవంబర్ 1948. 1963లో హెచ్.ఎస్.సి. పాసయ్యారు. 1966లో పాలిటెక్నిక్ పూర్తి చేశారు. నవంబర్ 1968లో ఉద్యోగంలో జాయినయ్యారు. పెద్దపల్లి, జగిత్యాల, పోడూరు, మెట్‌పల్లి, సిరిసిల్ల ప్రాంతాల్లో ఉద్యోగం చేసి 1997లో రిటైరయ్యారు. 1966లో మాధవితో పెళ్లి జరిగింది అని పేర్కొన్నారు. నిజాం వెంకటేశం స్మారక పురస్కారానికి వచ్చిన రచనల నుంచి ఎంపిక చేసిన విధానాన్ని ఆడెపు లక్ష్మీపతి వివరించారు. ఈ ఎంపికలో బి.ఎస్. రాములు, ఆడెపు లక్ష్మీపతి, ఎ. గంగారెడ్డి, కోడం పవన్ కుమార్, సిహెచ్‌వి. ప్రభాకర్‌రావు పాల్గొన్నారు. అనేక వడపోతల తర్వాత వీటిని ఎన్నిక చేయడం జరిగిందని పేర్కొన్నారు. అన్ని ప్రక్రియలమీద సాహితీ విమర్శ చేసిన గ్రంథాలు తమ పరిశీలనకు రాలేదని పేర్కొన్నారు. అందువల్ల ప్రక్రియల వారీగా ఎన్నిక చేయడం జరిగింది. అందుకుగాను పురస్కారా లను ఒకటికి బదులుగా మూడు ప్రక్రియలకు ఇవ్వడం జరిగింది. కవితా విమర్శకు ఒకటి, కథా విమర్శకు ఒకటి, స్త్రీల సాహిత్యం విమర్శకు ఒకటి ఎంపిక చేసి తలా ఐదు వేల రూపాయలు పురస్కారం నిర్ణయించడం జరిగింది. అలా పదివేల రూపాయల పురస్కారంకు బదులుగా ముగ్గురికి కలిపి పదిహేను వేల రూపాయల పురస్కారం అందించడం జరిగింది.

దీనికి తోడుగా ఇంటర్ విద్యార్థి కవితా పుస్తకం వేయడం ఆసక్తి కలిగించి ప్రోత్సాహక బహుమతిగా ఎంపిక చేయడం జరిగింది అని పేర్కొన్నారు.

డా॥ ఎం. దేవేంద్రకు పురస్కారం అందేజేస్తున్న కోడం పవన్

గజ్జెల రామకృష్ణకు పురస్కారం అందజేస్తున్న సమ్రాట్ అశోక్

శీర్పి చంద్ర శేఖర్‌కు పురస్కారం అందజేస్తున్న అతిథులు.

ఈ సందర్భంగా 'భరిణ' స్త్రీల సాహిత్యం పై వచ్చిన సాహిత్య విమర్శ గ్రంథానికిగాను ప్రొఫెసర్ డా॥ వి. త్రివేణి గారికి, 'తెలంగాణ కథావర్తనం' గ్రంథానికిగాను డా॥ ఎం. దేవేంద్ర గారికి , 'శతారం' కవిత్వ విమర్శనా వ్యాసాల సంపుటికి గోపగాని రవీందర్‌గారికి, 'చంద్రుడు లేని ఆకాశం' కవితా సంపుటికి గజ్జెల రామకృష్ణ గారికి ఐదు వేల రూపాయల చొప్పున నగదు, మొమెంటో, శాలువాతో సాహితీ వేత్తలు పలువురు సత్కరించారు.

ఇంటర్మీడియట్‌లోనే కవితా పుస్తకం వెలువరించిన శీర్పి చంద్ర శేఖర్‌కు 'కాలుతున్న వెన్నెల' కవితా సంపుటికి ప్రశంశాత్మక బహుమతి అందజేయడం జరిగింది. పురస్కార గ్రహీతలు తమ స్పందనని తెలియజేశారు. ఈ పురస్కారం మాకు ఎంతో స్ఫూర్తి అని, మా కర్తవ్యాన్ని పెంచిందని అవార్డు గ్రహీతలు పేర్కొన్నారు.

శుక్రవారం వెంకయ్యనాయుడుగారి క్యాంపు కార్యాలయంలో ఆచార్య కొలకలూరి మధు జ్యోతి రచించిన "నాన్న" ఆచార్య కొలకలూరి ఇనాక్ జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పూర్వ భారత ఉపరాష్ట్రపతి యం. వెంకయ్యనాయుడు. వేదికపై ఉప్పల శ్రీనివాస్‌గుప్త, కళా వి.యస్. జనార్ధనమూర్తి, ఆచార్య కొలకలూరి ఇనాక్, పబ్బా వైకుంఠం.

నేటి కందం– నేటికి అందం

కామను వెల్తు సదస్సును
కామనతో మొదటిసారి కమ్మని గతిలో
ధీమతులు భారతీయులు
ప్రేముడితో జరిపినారు ప్రీతి దలిర్పన్ ?

(23-11-1983భారత దేశంలో
మొదటి సారి కామన్ వెల్త్ సదస్సు జరిగిన రోజు)

–రాధశ్రీ
సెల్:9494481210

నేటినిజం
సాహితీ కెరటాలు
website:www.netinijam.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 23-11-2023

బంజారా నానీ

గుడ్లనిండా కన్నీళ్ళతో
వీడుకోలు
ఆమె పయనం
పూనా, బొంబాయి వైపు

-డా॥ సూర్యాధనంజయ్
సెల్:9849104187

ఘంటారావం

అవని
అవకాశాల గని
ఆనందాల్ని
అందించే జనని.

ఓదార్పు కరువైతే
వైరాగ్యమే
అపసవ్య ఆలోచనకు
అంకురార్పణమే.

కాలంతో కలిసి
కదలడం నేర్చుకో
నిన్ను నీవు నిరంతరం
నూతనంగ మలుచుకో.

పలకరింపులు
ప్రవహించనీ
పులకరింపులు
పరవశించని

-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

పుస్తక సమీక్ష

కథల 'జెండా'కు జై జై జై

మహాకవి శ్రీశ్రీ అన్నారు కదా, 'ఆకాశంలో హరివిల్లు విరిస్తే' అది తమ కోసమనే చిన్నారి బాలలు మురిసిపోతారని. నేను కూడా నా బాల గీతాల సంపుటి 'రంగుల సింగిడి'లో ఇంద్రధనస్సు గురించి రాస్తూ- 'మొగులు మీద పూసిన రంగుల పువ్వు / చిన్నపాప ముఖం లోన బంగరు నవ్వు' అని రాసుకున్నాను. నేనే కాదు బాలల కోసం పరితపిస్తూ రాస్తున్న వాళ్ళంతా దేశ, కాల, భాషలకు అతీతంగా బాలల కోసం ఇంద్రధనస్సును తమ రచనల్లో ఎక్కడో ఒకచోట పూయించినవారే!

అవును మరి, చిన్నారి పొన్నారి బాలల లోకాన్ని, వాళ్ళ ఆలోచనలను, వారివారి ఆశలు, ఆకాంక్షలను, వాళ్ళ ఊహా లోకాల్లోని రాజకుమారుడు, రాకుమార్తెలతో పాటు ఊయలలూగించే వస్తువులను మనం చూసినప్పుడు. కనిపించే అద్భుతమైన వస్తువుల్లో 'ఇంద్రధనస్సు' ఒకటి. ఈ పుస్తకం కూడా అటువంటిదే మరి... సప్తవర్ణాల ఇంద్రధనస్సును ఆకాశపు లోకంలోంచి తీసుకొచ్చి రచయిత్రి 'ఏడు రంగుల జెండా'గా పేరుతో తన పుస్తకానికి పేరు పెట్టింది. అవును కదా! హరివిల్లు ఎక్కడైనా బాలబాలికల షాన్... పెహచాన్ కూడా! అందుకే రచయిత్రి ఈ కథల సంపుటిని బాలల చేతిలో జెండాగా తయారు చేసి చిత్రంగా వారి చేతికే దీనిని అందిస్తోంది. ఇదే... ఔచిత్యమంటే. డాక్టర్ అమరవాది నీరజ మాంటిసోరి శిక్షణ సమయంలో బాలల మనస్తత్వశాస్త్రాన్ని చదువుకున్న 'అమ్మ' కదా, ఈ ఔచిత్యం ఆ స్ఫూర్తే మరి!

ఒకరు ఒక రంగంలో ప్రతిభావంతులై నిలవడం, ఆ రంగంలో అంచులు ముట్టడం చూస్తాం. మరి కొందరు వివిధ రంగాల్లో తమదైన ఆసక్తితో వెలగడమేగాక, అన్నింటిని సమానంగా చేపట్టి రాణిస్తారు. ఈ కోవలోనే మనకు రచయిత్రి, కవయిత్రి, విమర్శకురాలు, బాల సాహితీవేత్త డాక్టర్ అమరవాది నీరజ కనిపిస్తుంది. బాల్యమంతా చిక్కడపల్లిలోని హైదరాబాద్ నగర కేంద్ర గ్రంథాలయం సమీపంలో గడపడం వల్ల అది ఆమెకు మరో అమ్మ ఒడిగా నిలిచింది. అక్కడి పుస్తకాలతో సాన్నిహిత్యం ఒకవైపు, ఒళ్ళో కూర్చోబెట్టుకుని అమ్మ చెప్పిన కమ్మని కథలు మరోవైపు బాల్యం నుండే నీరజలో సాహిత్యం పట్ల ఆసక్తిని కలిగించాయి.

డా. నీరజ బాల సాహిత్యాన్ని ఎంత నిబద్ధతతో రాస్తుందో సాహిత్య విమర్శ, ఇతర సాహిత్య ప్రక్రియలను, రూపాలను అంతే ప్రేమతో చేపట్టి రచయిత్రిగా సఫలమైంది. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి చేసిన నీరజ సంప్రదాయ, ఆధునిక సాహిత్యాల్ని అధ్యయనం చేసింది. పొన్నగంటి తెలగన అచ్చ తెలుగు కృతి 'యయాతి చరిత్రలో తత్త్వమము, తద్భవాలు' నీరజ ఎం.ఫిల్ పరిశోధన. 'ప్రతిభ-ఇమాజినేషన్, తులనాత్మక పరిశీలన' పిహెచ్.డి పరిశోధనలు. చందాల కేశవరావు, బాపు రమణలు, చలం, శ్రీశ్రీలకు 'నేను శిష్యురాలిని' అంటూ గర్వంగా చెప్పుకునే ఈ విస్తృత చదువరి తన చిన్నారి కూతురు కోసం అనేక సంఘటనలను కథలుగా బాల్యం నుండి వినిపిస్తూ వచ్చింది. ఇప్పుడు వేలాది మంది బాలబాలికల కోసం రాస్తోంది.

ఈ కథల జెండా రెపరెపలను చూసే ముందు ఇంకో విషయం మాట్లాడుకోవాలి. బాలల విద్యా బోధనా విషయంలో ప్రపంచమంతా అంగీకరించి ఆచరిస్తున్న వాటిలో మాంటిసోరి విద్యా విధానం ఒకటి. బాల సాహిత్యం పట్ల ఆసక్తి, బాలల పట్ల అపారమైన ప్రేమతో నీరజ 'మాంటిసోరి ట్రైనింగ్' పూర్తిచేసింది. తాను అమెరికాలో నివాసమున్న కాలంలో అక్కడి తెలుగు పిల్లలు, ఇతరులకు మాంటిసోరి ఫిలాసఫీ నేపథ్యంగా కథలు చెప్పి, తరువాత తెలుగు కథలను పుస్తకంగా తెచ్చింది. 'తేనె చినుకులు' రచయిత్రి నీరజ పిల్లల కోసం అందించిన తొలి కానుక. ఇవి బాలల మనస్తత్వానికి, ఆలోచనలకు దగ్గరగా ఉండి, హాయిగా చదువుకునేందుకు రాసిన కథలు. పిల్లలకు నీరజ అందించిన రెండవ కానుక 'చిరుకానుక' ఇందులోని కథలన్నీ పిల్లలకు అచ్చమైన కానుకలే. ఈ 'చిరుకాను' ను 2014లో అంతర్జాతీయ బాలికల సంవత్సరం సందర్భంగా తీసుకు రావడం విశేషం. ఇదే సంవత్సరం పాకిస్థానీ బాలిక మలాలాకు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు పనిచేస్తున్న భారతీయుడు కైలాస్ సత్యార్థిలకు నోబెల్ శాంతి బహుమతి కూడా లభించింది. వీటన్నిటి సందర్భంగా 'బాలలకు అక్షరాభ్యాస కానుక... తన చిరుకానుక' అని చెప్పిన నీరజ బాలలకు కథా సాహిత్యాన్ని అందుబాటులో ఉంచితే భాష నేర్చుకుంటారని నమ్ముతుంది.



ప్రతులకు:డా॥ నీరజ అమరవాది
1203, శ్రీల టవర్స్, హైదర్‌నగర్
జెఎన్‌టియు, హైదరాబాద్-500 085
సెల్: 98491 60055

కథల జెండా...

బాలల ఆనందం కోసమే బాల సాహిత్య ప్రధాన లక్ష్యమని నమ్మిన వాళ్ళలో నీరజ ఒకరు. ఆమె కథలు ఆ కోవలోనే నడుస్తాయి. ఒక రకంగా 'సృజన కార్యం భాషా సేవ' అంటారు నీరజ. అవును, బాలల కోసం రాసినప్పుడు, బాలల కోసం పనిచేసినప్పుడు, బాలల గురించి ఆలోచించించినప్పుడు మనసు, శరీరం మిక్కిలి ఉత్తేజవంతమౌతుంది. మరింత ఉత్సాహాన్నిస్తుంది. కూడా!

కథల విషయానికి వస్తే నీరజ ఎంచుకున్న వస్తువులు, అంశాలు బాలలకు కొత్తలోకాలను, పరిచయాలను అందించడమేకాక విలక్షణ అనుభూతులను కలిగిస్తాయి. ఈ సంపుటికి పేరుగా ఉంచిన 'ఏడు రంగుల జెండా' కథ మామూలుగా చూసినప్పుడు పిల్లలకు ఇంద్రధనస్సును పరిచయం చేసే నేపథ్యంలో రాసిందేమో అనుకుంటాం. కానీ అతి సున్నితంగా వాతావరణలోని మార్పుల విధానాన్ని, బడికి, ఇంటికి, అలవాట్లకు అన్వయించి చెప్పడం రచయిత్రి ఏర్పరచుకున్న కొత్త సంవిధానం తప్ప మరోటి కాదు. ఇది బడిని, బడి పట్ల పిల్లలకున్న అనేకానేక సంశయాలను సున్నితంగా చర్చించడమేకాక, తల్లితండ్రులుగా, గురువులుగా మనం మనకు తెలియకుండానేవాళ్ళ నుండి ఏమేం ఆశిస్తున్నామో తెలియజేస్తుంది. నీరజ, రెండు విభిన్న ప్రాంతాలు, నేపథ్యాలు, సంస్కృతులు, దేశాలు.... ఇంకా చెప్పాలంటే, జాతులను సన్నిహితంగా చూసింది. అధ్యయనం చేసింది. ఉద్యోగరీత్యా కుటుంబంతో విదేశాల్లో ఉండాల్సిన అవసం రావడం, దానికి తోడు ఆమెలోని ఆసక్తి వంటివి నీరజను అమెరికా మొదలైన దేశాల బాలలను, అక్కడి విద్యా విధానాన్ని, బాలల సాహిత్యాన్ని సునిశితంగా పరిశీలించి, చదివే అవకాశాలు కల్పించాయి.

బాల్యం నుండి ఆ నేపథ్యం, అమ్మానాన్నల నుండి వచ్చిన ఆ సంస్కారం, రచయిత్రిగా వున్న అవగాహన కూడా కొంత నీరజను విభిన్నంగా ఆలోచించేలా చేశాయనిపిస్తుంది. లేదా చూసిన పరిస్థితులు అందుకు అవకాశాన్ని కల్పించి ఉండవచ్చు. ఆ నేపథ్యాన్ని, అక్కడి కథలలోని సాంకేతికాంశాలు వంటివి తెలుగు పిల్లలకు అందించాలన్న సంకల్పంతో 'జామచెట్టు' కథను రాయించి ఉండొచ్చు. ఈ కథను ఒక రకంగా సాంకేతికత పరిచయం, పర్యావరణ అవగాహన, భవిష్యత్తు బాధ్యత వంటివిగా చూడవచ్చు. కథలోకి వస్తే, భూగ్రహం నుండి తప్పిపోయి, అంగారక గ్రహానికి వెళ్ళిన బాలుని నేపథ్యంగా భవిష్యత్తు చిత్రాన్ని చక్కగా చూపిస్తారు రచయిత్రి. ఇందులో రచయిత్రి ఉపయోగించిన సాంకేతి విజ్ఞానం గురించి, వాటి వాటి ఉపయోగాల వంటి వాటి గురించి నాకంటే పిల్లలూ... మీకే ఎక్కువగా తెలుసు. పర్యావరణం పట్ల సోయి, వాతవరణ మార్పుల పట్ల అవగాహన, భవిష్యత్తు పట్ల శ్రద్ధ లేకపోతే ఏం జరుగుతుందో బహుశః ఇంతకంటే చక్కగా చెప్పలేమేమో!

మనం చదివిన, విన్న అనుభవాలు భవిష్యత్తంతా మనల్ని వెన్నంటే జ్ఞాపకాల్లా ఉంటాయి. అన్ని వేళల్లో అవి మనల్ని గైడ్ చేస్తూ లేదా దారి చూపిస్తూ ఉంటాయి. మనకు సింహం కథ తెలుసు, బావిలో తన ప్రతిబింబాన్ని చూసుకుని అది ఎలా మోసపోయిందో చిన్నప్పుడే విన్నాం, పుస్తకాలలో చదువుకున్నాం. నీరజ ఈ నేపథ్యంలో 'కుందేలు పంజా' పేరుతో అద్భుతమైన కథ రాసింది. దీనిని అద్భుతమని ఎందుకన్నానంటే... రచయిత్రిగా నీరజకు ఈ కథ రాయాలన్న ఊహే అలాంటిదిమరి. క్రూర జంతువులను ఎదుర్కోవడానికి అడవిలోని కుందేలు వంటి చిన్నప్రాణులకు శిక్షణ ఇవ్వడం కథలోని అంశం. అలా ఒక కుందేలు శిక్షణ పొంది తన పంజాతో సింహాన్ని కూల్చివేశానని చెబుతుంది. దానికి నిజంగానే భయపడ్డ సింహాలు సాక్ష్యం చూపించమని అడగగా, సింహాల్ని స్వయంగా నీళ్ళున్న బావి వద్దకు తీసుకెళ్ళి 'యిందులో నేను నా పంజా దెబ్బతో పడవేసిన సింహాలు ఉన్నాయి, చూడండి' అని చెబుతుంది. తమ ప్రతిబింభాల్ని అందులో చూసుకున్న సింహాలు నిజంగానే భయపడడం ముగింపు. మనకు ఈ కథ తెలుసు, పిల్లలకూ తెలుసూ... కానీ కొత్తగా ఈ ఆలోచనే ఎంత బాగుంది. పిల్లలకు కావాల్సింది ఇలాంటి ఆలోచనను పెంచే, ధైర్యాన్ని నూరిపోసే రచనలే.

'గెలుపు చప్పట్లు' కథ అందరు తల్లితండ్రులకు సంబంధించిన ముచ్చటే. ఐ.ఐ.టిలు, ఎంసెట్లు, ఇతర ర్యాంకుల విన్నర్లుగా పిల్లలను చూడాలని, తాను సాధించనివి తమ పిల్లల ద్వారా సాధించాలని అనేకమంది ఆశించడం మనకు తెలుసు. అటువంటి ఒక తండ్రికి కనువిప్పును ఎలా కలిగించిందో చెబుతుందీ కథ. విషయం చిన్నదే కావచ్చు. కానీ ఆలోచిస్తే మనం మన బదులు, మన విద్యారంగం గురించి ఎక్కడ ఎలా ఆలోచిస్తున్నామో తెలుస్తుంది. 'కబురుల కాకి' కత మరో మంచి కథ. కేవలం యిది కథ కాదు, పిల్లలకు చక్కని నడవడికను, సేవా స్ఫూర్తిని, పరోపకార పరాయణతను మిక్కిలి సులభంగా చెప్పడమేకాక ఆలోచనను కలిగిస్తుంది. యిదే విషయాన్ని మాటల ద్వారా, ప్రవచనాల ద్వారా చెప్పొచ్చు. కానీ కాకి నేపథ్యంగా రచయిత్రి చెప్పడం కథకు, వస్తువుకు అందాన్నిచ్చింది.

ఇలా నీరజ రాసిన ఒక్కొక్క కథను చర్చించుకుంటూ పోతే ప్రతి కథలో ఒక కొత్త అంశం, అంతకు మించిన మరో కొత్త విషయం మనకు కనిపిస్తాయి. అందుకు ఉదాహరణగా 'చలాకీ చేతన్', 'సమభావం', 'నేర్పు', 'చిట్టి రాజు', 'నలుపు-తెలుపు', 'ప్రతిభా పురస్కారాలు', 'సమయానికి తగు సాయం' వంటివి పేర్కొనవచ్చు.

నా ఉద్దేశ్యం నీరజ కథల్లో వస్తువును గురించో లేదా ఆమె ఎంచుకున్న విషయాన్ని గురించి మాట్లాడడమో కాదు. నేను ప్రారంభంలోనే చెప్పాను కవయిత్రి, పరిశోధకురాలు అయిన నీరజ మాంటిసోరి నేపథ్యంలో బాలల రచయిత్రిగా పరిణతి చెందింది. బాలల కోసం ఆ దిశగా ఆలోచించి రాస్తోంది. అందుకే ఈ కథలన్నింటిలో అంతస్సూత్రంగా బాలల మనస్తత్వం, బాలల ఆలోచనలు, కలలు, కోరికలు ఇంకా వాటి తాలూకూ అనేకానేక అంశాలు మనకు తారసపడతాయి. ఒకటి మాత్రం నేను స్పష్టంగా చెప్పగలను. ఈ కథలు లేదా ఈ కథల్లోని అంశాలతో బాలల రచనలు ఒక్క నీరజ మాత్రమే చేయగలదు. కారణం ఆమె నేపథ్యంతో పాటు, అమెకున్న మాంటిసోరి అనుభవం. అందుకు ఈ కథలు ప్రత్యక్ష ఉదాహరణలు కూడా!

డా.అమరవాది నీరజ కేవలం రచయిత్రిగా పిల్లలకు ఏదో చెప్పాలని రాయడం లేదు. తల్లిగా, మాంటిసోరి టీచర్‌గా తాను నేర్చుకున్నది. ప్రత్యక్షంగా అనుభూతి చెందింది మాత్రమే తన రచనల్లో రాస్తోంది. గతంలో వచ్చిన రెండు కథా సంపుటాలు కావచ్చు, ఇవ్వాళ్ళ నూరొక్క రంగులతో మెరుస్తున్న ఈ 'ఏడు రంగుల (కథల) జెండా' కావచ్చు అందుకు నిదర్శనం. మరో మంచి కథల వయ్యిని తెలుగు బాలల కోసం అందిస్తున్న ఆత్మీయురాలు, మా బాలల కార్యశాలల నిర్వహణ గ్రూపు సభ్యులు, బాల వికాస కార్యక్రమాల్లో ముందువరుసలో నిలుస్తున్న వారిలో ఒకరైన నీరజ వ్రాసిన ఈ కథలకు ఆత్మతో స్వాగతం పలుకుతున్నాను. ఈ 'ఏడురంగుల జెండా'ను మన బాలబాలికల కోసం జెండాగా పట్టుకుని ముందు వరుసలో పరిగెడుతున్నాను.

'రండి! మనందరం కలిసి ఈ కథల జెండాను బాలల మనో ఆకాశంలో ఎగురేద్దాం! చిన్నారి బాల బాలికలను కొత్తలోకంలో విహరింప జేద్దాం.' జయహో! బాల సాహిత్యం.

- డాక్టర్ పత్తిపాక మోహన్
కేంద్ర సాహిత్య అకాడమి బాల సాహిత్య పురస్కార గ్రహీత
9966229548

ఘంటారావం మినీ కవితల సంపుటి ఆవిష్కరణ

గోల్కొండ సాహితీ కళా సమితి, తెలుగు భాషా చైతన్య సమితి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం రాత్రి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయంలోని ఎన్టీఆర్ కళామందిరంలో గంటా మనోహర్‌రెడ్డి రచించిన 'ఘంటా రావం' (మినీ కవిత్వం) పుస్తకావిష్కరణ జరిగింది. గోల్కొండ సాహితీ కళా సమితి అధ్యక్షుడు డా॥ అర్థ చంద్రప్రకాశ్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా హాజరైన పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ సాహిత్యం ఆలోచనామృతం అని అన్నారు. మనోహర్‌రెడ్డి కవిత్వం కొత్త ఆలోచనల్ని రేకెత్తిస్తుందన్నారు. ప్రముఖ సాహితీవేత్త డా॥ ఏనుగు నరసింహారెడ్డి పుస్తకాన్ని సమీక్షిస్తూ. శరీరం సహకరించకపోతే మనసుతో అయినా పోరాటం చేయమని చెప్పిన తీరు బాగుందన్నారు. సభలో తెలంగాణ అధికార భాషా సంఘం అధ్యక్షురాలు మంత్రి శ్రీదేవి, ఐ.ఎ.ఎస్. అధికారి డాక్టర్ టి.కె. శ్రీదేవి, ఓయూ ఆచార్యుడు డా॥ఎన్.రఘు, ప్రముఖ కవి డా॥నాళేశ్వరం శంకరం, ఓయూ తెలుగు శాఖ పూర్వాధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, నేటినిజం పత్రిక సంపాదకులు బైస దేవదాసు, సాహితీవేత్త దోరవేటి చెన్నయ్య తదితరులు మాట్లాడారు. తెలుగు భాషా చైతన్య సమితి అధ్యక్షుడు పి. బడేసాబ్, ప్రముఖ కవి, విమర్శకుడు రామకృష్ణ చంద్రమౌళి సభా సమన్వయం చేశారు. డా॥రాధా కుసుమ నిర్వహణలో కవి సమ్మేళనం ఆకట్టుకుంది.

'ఘంటారావం' పుస్తకావిష్కరణలో దోరవేటి, బైస దేవదాసు, గంటా మనోహర్‌రెడ్డి దంపతులు, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, డా॥టి.కె. శ్రీదేవి, డా॥ఏనుగు నరసింహారెడ్డి, మంత్రి శ్రీదేవి, ఆచార్య కొలకలూరి ఇనాక్, అర్థ చంద్రారెడ్డి, డా॥ నాళేశ్వరం శంకరం, డా॥ ఎస్.రఘు, కోట్ల వెంకటేశ్వర రెడ్డి, బడేసాబ్ తదితరులు.

పుస్తక సమీక్షలు

మనసుకు హాయిని గొలిపే 'సాగర కెరటాలు'...!



ప్రతులకు: డా॥ కడారు అనసూయ
రిడ్జ్ టవర్స్, టవర్-ఎ
ఫ్లాట్ నెం.506, హెచ్.యం.టి.రోడ్
బాలానగర్ టౌన్‌షిప్
గణేష్ నగర్, చింతల్
హైదరాబాద్-500 037.

మల్లెలు జాజులు విరిసిన వేళ
పొన్నలు పొగడలు పూసిన వేళ
సంధ్యామారుతము
మంద గమనమున
సుగంధ పరిమళాల
సువాసనలు వెదజల్లిన వేళ..
భాషకందని భావమేదో
ప్రణయ రాగసుధ మధురిమల
మకరంద సుధామృత ధారలై
ప్రవహించు వేళ.. అంటూ కవయిత్రి డా॥ కడారు అనసూయ కలువ భామలు మురిసే సన్నివేశాన్ని అందంగా ఆవిష్కరిస్తూ.. తమ భావుకతను ప్రకటిస్తూ.. **'సాగర కెరటాలు'** కవితా సంపుటిని వెలువరించారు. ఆయుర్వేద వైద్య రంగంలో ఉన్నత పదవిలో ఉంటూ బోధనను వృత్తిగా చేసుకున్న ఆమె.. కవిత్వ సృజనను ప్రవృత్తిగా మలుచుకోవడం ప్రశంసనీయం. **"సాగర కెరటాలు"** పేరుతో తమ మొదటి గ్రంథాన్ని వెలువరించిన తమ కవితా పటిమను చాటుకునే ప్రయత్నం చేయడం స్వాగతించదగింది. ఆమె కవిత్వంలో రమణీయ భావాలను పొందుపరిచి సరాగమాలికల తోరణాలను అందంగా అల్లడం అభినందనీయం.

ఈ చిన్ని గ్రంథంలో 38 వరకు రచనలు కొలువుదీరాయి. 36 రచన కవితలు, రెండు గేయాలతో రూపుద్దిద్దబడిన ఈ సంపుటిలోని రచనలన్నీ కవయిత్రి యొక్క ఉత్తమ వ్యక్తిత్వాన్ని, సున్నిత మనస్తత్వాన్ని ప్రతిఫలించే విధంగా ఉన్నాయి. వస్తు ఎంపికలో భావ కవిత్వానికి పెద్దపీట వేస్తూనే.. కొన్ని సామాజిక అంశాలకు చోటు కల్పించడంలో కవయిత్రి చూపిన ప్రతిభను ప్రశంసించి తీరుతాం.

ప్రకృతి అందాలు చూసి
పొంగిపోయే..
చదవం బాగుంది..
మేను విడిచి
మైమరిచి..
మనసు తుమ్మెదై ఎగసి
తూగే ఊహలకు
అక్షర రెక్కలు తొడిగి.. ఊరేగేలా..

పదబంధాలను ప్రయోగిస్తూ.. **'కలల ఊయల"** కవితకు కవయిత్రి జీవం పోసి పాఠకులను అలరింపజేశారు.

"కొంటె చూపులు" కవితలో చిలిపి భావాలను చిగురింపజేసే కొంటె కోనంగి కొంటె చూపులను.. వయసు సొగసు అందాలు హరివిల్లుగా విరబూసే దృశ్యాన్ని అందంగా చిత్రించారు. ఇంకా ఈ కవితలో.. ఆకాశవీధిలోని రంగవల్లుల రాగమాలికలను.. ముద్ద మందారంలా అరవిరిసిన అందాలను.. గగన సీమలోని నిండుజాబిలి వెన్నెల కాంతులను.. విరజల్లి ఎదవీణపై నవరసాలు పలికించడానికి కొంటె కోనంగి చూపులను ఆవిష్కరించిన తీరు అభినందనీయంగా ఉంది.

మనసును పరవశింపజేసే తొలి వలపు భావాలు.. మకరంద మనోహర.. స్వప్నరాగ మలికలను.. మోహన రాగాల లోగిల్లలో ఊరేగే విధంగా.. ప్రణయగీతాల పల్లవి పల్లకీలో సేద దీరేలా ఈ కవితలో చక్కని భావుకతతో చిక్కని భావాలకు చోటు కల్పించడంలో కవయిత్రి సఫలీకృతులైనారు.

"ప్రేమ పావురాలు" కవిత లోనూ.. భావ కవిత్వానికే పెద్దపీట వేశారు. తొలి ప్రేమికుల ప్రణయ గీతికలను ఆమని కోయిల రాగాల అనుపల్లవు లను మలయమారుని వలవు తోట లోని సుగంధ పరిమళాలను గుబాళిం పజేస్తూ ప్రేమికుల మధుర భావాలకు పట్టం కట్టారు.

బోసినవ్వుల చిన్ని పాపలు
నేటి ఆనంద బ్రహ్మలంటూ..

'బోసినవ్వుల చిన్నిపాపలు' శీర్షికతో ఓ కవితను రాశారు. ఈ కవితలో ప్రకృతి శోభకు అద్దంపడుతూ కవయిత్రి అనసూయ ప్రయోగించిన పదబంధాలు చక్కగా ఒదిగిపోయాయి. ఈ కవితలో కవయిత్రి కొండకోనలను, తరులుగిరులను, ధరణికి ఎప్పుడు ఆత్మబంధువులని చెప్పడం బాగుంది. ఇంకా ఈ కవితలో జలపాత గమనమున కనిపించే అంద చందాలను, వినిపించే హొరు ధ్వనులను.. జీవనదుల పయన దారులలో మురిసే చెట్టు చేమలను.. పసిడి పైరులను ప్రస్తావిస్తూ.. వాటిని నిత్యసూతన యవ్వన కాంతులుగా వసుధమేని అలంకార భూషణములుగా అభివర్ణిం చడం బాగుంది..

మేను విడిచి
మైమరిచి..
మనసు తుమ్మెదై ఎగసి
తూగే ఊహలకు
అక్షర రెక్కలు తొడిగి.. ఊరేగేలా..

పదబంధాలను ప్రయోగిస్తూ.. **'కలల ఊయల"** కవితకు కవయిత్రి జీవం పోసి పాఠకులను అలరింపజేశారు.

"కొంటె చూపులు" కవితలో చిలిపి భావాలను చిగురింపజేసే కొంటె కోనంగి కొంటె చూపులను.. వయసు సొగసు అందాలు హరివిల్లుగా విరబూసే దృశ్యాన్ని అందంగా చిత్రించారు. ఇంకా ఈ కవితలో.. ఆకాశవీధిలోని రంగవల్లుల రాగమాలికలను.. ముద్ద మందారంలా అరవిరిసిన అందాలను.. గగన సీమలోని నిండుజాబిలి వెన్నెల కాంతులను.. విరజల్లి ఎదవీణపై నవరసాలు పలికించడానికి కొంటె కోనంగి చూపులను ఆవిష్కరించిన తీరు అభినందనీయంగా ఉంది.

మనసును పరవశింపజేసే తొలి వలపు భావాలు.. మకరంద మనోహర.. స్వప్నరాగ మలికలను.. మోహన రాగాల లోగిల్లలో ఊరేగే విధంగా.. ప్రణయగీతాల పల్లవి పల్లకీలో సేద దీరేలా ఈ కవితలో చక్కని భావుకతతో చిక్కని భావాలకు చోటు కల్పించడంలో కవయిత్రి సఫలీకృతులైనారు.

"ప్రేమ పావురాలు" కవిత లోనూ.. భావ కవిత్వానికే పెద్దపీట వేశారు. తొలి ప్రేమికుల ప్రణయ గీతికలను ఆమని కోయిల రాగాల అనుపల్లవు లను మలయమారుని వలవు తోట లోని సుగంధ పరిమళాలను గుబాళిం పజేస్తూ ప్రేమికుల మధుర భావాలకు పట్టం కట్టారు.

భావం నీవైతే..
రూపం నేనవుతా!
రూపం నీవైతే..
మనసు నేనౌతా..
మనసు నీవైతే..
నీ మనోరథం నేనవుతా..
మనోరథం నీవైతే..
విజయపథం నేనౌతానంటూ

'ప్రణయగీతం' కవితకు రూపమిచ్చారు.

"మేఘమాల" కవితలోనూ కవయిత్రి చక్కని భావధారను ప్రకటించి.. రమణీయ దృశ్యాలను చిత్రించారు.

శరత్‌కాలం నిండుపున్నమి చంద్ర కళలను.. విరబూసిన కలువ పుప్పొడి సుగంధాలను.. ప్రస్తావిస్తూ..తొలి ప్రేమికుల హృదయాలను మీటే విధంగా కవిత్వాన్ని పండిస్తూ **"మరుల మంత్రం"** కవితను తీర్చిదిద్దారు. ప్రకృతి అందాలు.. ప్రేమికుల మనో ఫలకంపై పెట్టిన తొలి సంతకంలా ఎలా అజరామరంగా వెలుగొందు తుందో కవయిత్రి ప్రకటించిన తీరు బాగుంది.

ఇంకా.. ఈ గ్రంథంలోని **'పున్నమి వేళ'. 'అమరశిల్పమై' 'జ్ఞాపకాల ఒరవడిలో', 'హరివిల్లు', 'రూపలావణ్యం', 'కలువ కన్నులు',** మొదలగు కవితల్లోనూ కవయిత్రి అనసూయ తమ అంతరంగంలో కదలాడే అందమైన భావాలను చక్కని భావుకతతో అక్షరాల్లో బంధించారు.

మానవీయ విలువలకు పట్టం కడుతూ **'నేటి సమాజం'** కవితకు జీవం పోశారు. భారతీయ విలువలను కాపాడుదామంటూ మంచి ముగింపు నిచ్చారు.

గుండెరాయి చేసుకోవడం మాని.. గుండె దిటవు చేసుకొమ్మంటూ.. ఓ కవితను రాసి ఇందులో పొందుపరిచారు. ఆశయమనే అమృతసుధను ఆస్వాదిస్తూ.. జీవితమనే భావ సాగరంలో ఎదురయ్యే ఆటుపోట్లను తట్టుకుని

నిలబడే విధంగా నీ మనసును మార్చుకొమ్మంటూ హితవు పలికారు.

మనసు విశాలమైతే
విశ్వమే అరచేత
ఇమిడి ఉంటుందని తెలియజెబుతూ.. **'శాంతి సుమం'** కవితకు రూపమిచ్చారు.

'కాల గమనం' కవితలో నేటి సమాజంలోని కొన్ని ఘటనలను.. సంఘటనలను ప్రస్తావించారు.

నేను ఒంటరిననే భావన వీడి..
గమ్యం చేరే వరకు
విశ్రమించక శ్రమించుమంటూ

"మనిషి చిరునామా" కవితను రాసిన తీరు బాగుంది. స్త్రీ అబల కాదంటూ మరో కవితకు ఈ గ్రంథంలో చోటు కల్పించి.. మహిళల గొప్పదనాన్ని చాటి చెప్పారు.

ఇలా ఈ గ్రంథంలో కవయిత్రి అనసూయ ప్రకటించిన ఆలోచనలు రమణీయ భావాల సమాహారంగా, కొలువుదీరాయి. మనసుకు హాయిని గొలిపే విధంగా ఉన్నాయి!

కవయిత్రి ముమ్ముందు మరింత గాఢమైన కవిత్వం రాసేందుకు.. సామాజిక అంశాలను ఎంపిక చేసుకుని.. ఆర్థంగా అభివ్యక్తీకరించడానికి అడుగులు వేస్తారని ఆశిద్దాం. సమాజంలో రుగ్మతలను రూపుమాపడానికి.. జన్నాని జాగృత పరచడానికి.. సామాజిక చైతన్యమే పరమావధిగా తమ రచనలను అందించాలని కోరుకుందాం.

- దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544

తెలంగాణ కీర్తి పతాక, తెలుగు భాష ప్రేమ ప్రతీక కాళోజీ
కన్నడ మరాఠీల మేలు కలయికఐ తెలుగులో ఇమిడిపోయిన కాళోజీ
మాతృభాష పితృభాష కాని మన భాషపై అపార ప్రేమ కురిపించిన కాళోజీ
తన జీవితమంతా తెలుగాణకై తెలుగు భాషకై ధారపోసిన కాళోజీ
విద్యాలయాల్లో బడి పలుకుల భాష బదులు పలుకు బడుల భాషకై పోట్లాడిన కాళోజీ
పోరునే తన జీవితాశయం చేసుకొని జనం గొడవ తనదిగా చేసుకొన్న కాళోజీ
ఆర్య సమాజంతో మొదలై, ఆంధ్ర మహాసభకు పాకిన గ్రంథాలయోద్యమం కాళోజీ
ఉస్మానియా విశ్వ విద్యాలయం సత్యాగ్రాహి, స్వాతంత్ర్య సమరయోధుడు కాళోజీ
నిజాం నిరంకుశ పాలనను ఎదిరించి కటకటాలను కౌగిలించుకున్న కాళోజీ
ఎన్నికలో గెలిచి శాసన సభలో అడుగు పెట్టినా అధికార అహం ఒంటబట్టని కాళోజీ
ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి సాహిత్యాన్ని ఆలంబనగా చేసుకొన్న కాళోజీ
తెలుగుతో పాటు మరాఠీ, ఉర్దూ, హిందీ భాషల్లో కూడా సాహితీ సృజన చేసిన కాళోజీ
కాకతీయ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ఇచ్చినా ఎప్పుడూ తన పేరుకు చేర్చని కాళోజీ
ఎంత ప్రసిద్ధి పొందినా పద్మవిభూషణ్ తో పాటు ఎన్నో పదవులు వరించినా తొణకని కాళోజీ
జీవితమంతా ప్రజా సేవకై వెచ్చించి తన పార్థివ దేహాన్ని కూడా
వైద్య కళాశాలకు అర్పించిన కాళోజీ
తెలంగాణ ప్రజల ఉత్తేజం, ఉద్వేగం, ఉత్సాహం, అభిమానం, గౌరవం కాళోజీ
తెలంగాణ లోని ఒక వైద్య విద్యాలయానికి తన పేరును పొందిన కాళోజీ
మన భాషను, యాసను ఏగతాళి చేసిన నోళ్ళే మన భాషను పలికేలా చేసిన కాళోజీ
తన జన్మదినం తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకునేలా చేసిన ఘనుడు కాళోజీ

తెలంగాణ నిప్పు కణిక -కాళోజీ

పుస్తక సమీక్ష

'నాగేటి గోడు'ను వినిపించిన దీర్ఘ కవిత...

రైతే రాజు కావాలని.. శాంతి హింసల సాంగత్యంతో దేశం స్వస్తత పొందే రోజు రావాలని ఆకాంక్షిస్తూ విమర్శకుడు, కవి, రచయిత, చిత్రకారుడు, బహుగ్రంథకర్త కొండ్రెడ్డి వెంకటేశ్వర రెడ్డిగారు **"నాగేటి గోడు"** పేరుతో ఓ రైతు కావ్యాన్ని వెలువ రించి రైతన్నల పట్ల తమ శ్రద్ధాభక్తుల ను చాటుకున్నారు. వృత్తిరీత్య మండల విద్యాధికారిగా ఉద్యోగ విరమణ చేసిన కొండ్రెడ్డిగారు రచనా వ్యాసంగాన్ని ప్రవృత్తిగా మలచుకుని అనేక గ్రంథాలు వివిధ ప్రక్రియల్లో వెలువరించి బహుగ్రంథకర్తగా భాసిల్లుతున్నారు. 1999లో **'మట్టితడి బంధాల్లో'** గ్రంథాల్లో సాహితీ లోకానికి కవిగా పరిచయమైన కొండ్రెడ్డిగారు 7 కవితా సంపుటాలను రెండు దీర్ఘ కవితలను, రెండు వ్యాస సంపుటాలను, విలక్షణ నేత్రం పేరుతో ఛందోబద్ధ పద్య కావ్యాన్ని వెలువరించిన అనుభవం ఆయనకు ఉంది. పన్నెండు వరకు విమర్శ గ్రంథాలను, రెండు జీవిత చరిత్ర గ్రంథాలను, చిత్ర లేఖనంపై మరో గ్రంథాలను వెలువరించిన ఆయన **"నాగేటి గోడు"** పేరుతో ఓ రైతు కావ్యాన్ని మరో దీర్ఘ కవిత రూపంలో సాహితీ ప్రపంచానికి అం దించడం ఆహ్వానింపదగింది. **రైతు క్షేమమే/రాజ్యానికి క్షేమమని భావించే కవి కొండ్రెడ్డిగారు మట్టి మనిషిని బతకనివ్వండం**టూ అన్నదాతకూ ఆత్మఉందనీ.. ఆలోచనలున్నాయనీ.. సుఖ దుఃఖాల స్పర్శ ఉందనీ..ఆత్మాను రాగాల ఆరాటముందనీ తెలియ జెబు తూ.. రైతును సైతాన్‌లా చూడవద్దని హితవు పలుకుతూ కవి ఈ దీర్ఘ కవితకు జీవం పోశారు. **కష్టజీవి, కష్టార్జితం చేతికందీ అందనట్లు/పరుల పాలై పోతూ/ దళారీల ఎదుగుదలకు తోడ్పాడై నిలుస్తోందని..** ఇకనైనా అన్న దాతల అనుభవాల్ని గుణపాఠాలుగా స్వీకరించాలి కవి హితవు పలికారు. **పాలకుల వంచన/ హోలికుణ్ణి హతం చేస్తున్న తీరు.. కంచే చేను మేసినట్లుగా ఉ ంటుందని** వాపోయారు. **కాపాడా ల్సిన వాడే/ కాటేసినట్లుందని రైతన్నల వెతలకు అద్దంపడుతూ** కవి తమ భావాలను ఆర్థంగా ఆవిష్కరించారు. దీర్ఘ కవిత లో రైతన్నల స్థితిగతులను.. కష్టన ష్టాలను.. ఎదుర్కొంటున్న సమస్యల ను.. ఏకరువు పెడుతూ ఆరు ఖండి కల్లో ఎక్కడా సీక్వెన్స్ దెబ్బతి నకుండా దీర్ఘ కవితను నడిపించడంలో కవి కొండ్రెడ్డి నఫలీకృతులైనారు. రైతన్న బతుకులను అక్షరాల్లో ఆవిష్కరించే క్రమంలో కవి వ్యవసాయంపై వ్యవ సాయాన్నే నమ్మి జీవనం కొనసాగిస్తున్న కర్షకులపై విశ్లేషణాత్మకంగా.. అటు పాలకులకు ఇటు సమాజానికి.. రైతన్నలకు అవసరమైన సలహాలు, సూచనలు చేసి అందరినీ చైతన్య పరచడం అభినందనీయం. రైతుల పక్షాన నిలిచి కొండ్రెడ్డిగారు.. వారి జీవితాల్లో వెలుగులు నింపాలన్న ఆకాంక్షతో.. దీర్ఘ కవితను రాసి పఠితులను మెప్పించారు. **మనిషికి జీవధాతులై/ మట్టిని నమ్మినవాడు/ మానవీయ విలువలను నమ్ముతూ.. సృజనాత్మకు చుక్కానై నిలిచే రైతన్నను బతకనివ్వాలని** పిలుపునిచ్చారు. సేద్య గాణ్ణి చుట్టేస్తున్న తిమిరాన్ని తరిమే యాలని, విముక్త పోరాటంతో విజయ దుందుభి మ్రోగించాలని ఆకాంక్షిం చారు.

ఈ భూమ్మీద సేద్యగాడు అంత రిస్తే.. సూర్యుడు అస్తమించినట్టేనని తేల్చిచెప్పారు. రైతు బతుకును బజారు పాలు చేయవద్దని కోరుతూ.. ఇకనైనా ఆయన కష్టాలను, కన్నీళ్లను ఓపిగ్గా వినండని.. పరిష్కార మార్గం చూపం డని పాలకులను కోరారు.

ఈ గ్రంథంలోని మొదటి ఖండి కలో **ఒకనాడు పల్లెలు/ కులమతాల కులాసాలతో/ సమైకృతా రాగమై సాగుతూ/ సౌభ్రాతృత్వం సొంపులతో సోయగాలు పోతున్న పల్లెల్లో ఏ రాజకీయం రంకు రగిలిందో.. రైత న్నల పెదవులపై చిరునవ్వులు కరువై నాయని** ఆవేదనను ప్రకటించారు.

రెండో ఖండికలో.. చట్ట సభల్లో అవినీతి ఖద్దరు చీకటి ముసుగుల్లో, ప్రజాస్వామ్యాన్ని నెత్తురోడిస్తూనే జనం గుండెల్లో కొత్త గాయాలను రూపుతు న్నాయని వాపోయారు.

రైతు రుణాలు దయ్యపు పిల్లల్ని పెడుతూ మరణాలై ఎదురొస్తున్నాయ్ అంటూ వ్యాఖ్యానించారు. **కష్టాల్ని కన్నీటితో ప్రక్షాలన చేసుకుంటూ/ దుఃఖాన్ని కంఠధ్వనితో కరిగించు కుంటూ/ నీరు గారి పోకుండా/ బతుకును బతికించికోవడమే/ బతుక్కి మనమిచ్చే బహుమానమని** చెప్పిన తీరుబాగుంది.

మూడో ఖండికలో.. **మానవతా దృష్టితో/ మట్టి చేతులతో/ ఈ భూమికి పచ్చ పచ్చని రంగులద్దే కృషీవలుని మించిన కళాకారుడెవరు? అంటూ ప్రశ్నించారు. మట్టి లాలనలో రక్తాన్ని స్వేదంగా మార్చి/ మొలకెత్తే విత్తుకు సేవలందించే సేద్యగాణ్ణి మించిన సేవకుడెవరు?** అంటూ నిలదీశారు.

రుతువులందించే/క్రమైక జీవనా నందాన్ని/ సమాజానికి అందించే ప్రజ్ఞాశాలి రైతు అనీ.. సూర్యుడు భూమితో నెరపే రహస్య సంభాషణకు అనువాదకుడు అన్నదాత అని చెబుతూ కవి కొండ్రెడ్డిగారు నాలుగో ఖండికను రూపుదిద్దారు.

ఈనేల/ఈ నింగి/ రైతు కలలు పండించుకునే మూల ధాతువులకు నిలయాలని.. స్వేద పూజితాలయ లని.. ఐదో ఖండికను ప్రారంభించిన తీరు బాగుంది. ఆరో ఖండికలో అమృతమూర్తిగా ఆత్మీయ బంధువుగా అన్నదాతను భావించే రోజులు రావా లని.. ఇకనైన పాలకులు నియంతృత్వ ధోరణులు మాని **"నాగేటిగోడు"** వినా లని ఆకాంక్షించారు. వారి సంక్షేమా నికి పాలకులు పాటుపడాలని కోరారు.

ఇలా కవి కొండ్రెడ్డి వెంకటేశ్వర రెడ్డిగారు ఆరు ఖండికల్లో.. వస్తువు వెలుగులో ఎక్కడా సీక్వెన్స్ దెబ్బతిన కుండా రైతన్నలను ఇకనైనా పాల కులతో పాటు అందరం పట్టించు కోవాలని హితవు పలికారు. కర్షకుల్లో చైతన్యాన్ని నూరిపోసే దీర్ఘకావ్యమిది! రైతు విముక్తి కోసం కొండ్రెడ్డి అద్భుతమైన విశ్లేషణతో రాసిన రైతు కావ్యమిది! **'నాగేటి గోడు'** దీర్ఘ కావ్యం తప్పకుండా రైతు కావ్యాలలో మరో కలికితురాయిగా నిలువగలదన్న విశ్వాసముంది.

రైతుల పట్ల ఎంతో శ్రద్ధవ హించి.. దీర్ఘ కవితకు రూపమిచ్చిన కవి కొండ్రెడ్డిగారికి అభినందనలు తెలియజేద్దాం.

ప్రతులకు: కొండ్రెడ్డి వెంకటేశ్వర రెడ్డి, 8-150, కొత్తపేట్
కనిగిరి-523 230.
సెల్:99487 74243



ప్రతులకు:
కొండ్రెడ్డి
వెంకటేశ్వర రెడ్డి
డో.నెం.8-150, కొత్తపేట్
కనిగిరి,ప్రకాశం జిల్లా-523 230
సెల్: 99487 74243

– దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544

మణిపూసలు

జనం కొరకు హలంపట్టి
పొలమునంత దున్నినట్టి
రైతన్నల కష్టానికి
జైకొట్టుము వెన్నుతట్టి!

రంగువెలిసెటి జెండాలు
పార్టీలవి ఎజెండాలు
గద్దెనెక్కుటకు వంచన
నంగనాచుల దందాలు!

ఖర్చులతో ఏంటి గొప్ప
పొదుపే తీపి చూడుమప్ప
చెడుకలవాటు పడితే
చేతికొచ్చు పెద్దచిప్ప!

భవిష్యత్తు నిధికి మధుపు
చెయ్యాలి కోర్కెల పొదుపు
నియమ రహిత ఖర్చులు
కాదెప్పుడు గొప్పగెలుపు!

మనస్సులోని భేదాలు
కలిగిస్తాయి ఖేదాలు
మలినాలన్ని కడిగి
కలగల్పాలిక చేతులు!

తెలంగాణా కథనాలు
రాజిలేని ఉద్యమాలు
సాధించి తెచ్చుకున్న
విజయమను సోపానాలు!

రాజకీయ విభేదాలు
రాయలేనివి కథనాలు
క్షణ క్షణం మారిపోయె
ఊసరెల్లి విధానాలు!

తెలుసుకో సృష్టిచక్రము
తెరమరుగౌ నజ్ఞానము
విలువైన జీవితానికి
ఉత్తమమ సత్యమార్గము!

నిత్యం మురళిని వినడము
పరివర్తన కాధారము
పరమాత్ముడే స్వయంగా
ప్రభోదించె గీతార్థము!

చెట్లే పర్యావరణం
కాలుష్య పాపహరణం
విస్మరించినట్లైతే
నాశనాని కాహ్వానం!

పేరుకున్న లోనికుళ్ళు
అవినీతికి ఆనవాళ్లు
నిర్మూళన మరిస్తే
అవి మృత్యువుకు కౌగిళ్ళు!

అమ్మభాష సుమధురం
అన్యభాష కలవరం
ప్రగతిదారి చూపేటి
చక్కనగు ఆధారం!

గుచ్చుకున్న కంటకాలు
గుండె భాదకానవాళ్ళు
ఆచితూచి అడుగేస్తే
ధరిరావు ఆటంకాలు!

వెలుగులనీను మన తెలుగు
జ్ఞాన దీప్తులునై వెలుగు
పలికినంతనే మదిలో
ఆనందమెంతో కలుగు!

కంటికేమో కునుకురాదు
మనసుభాద తీరిపోదు
మరుపన్నది లేకుంటే
శాంతి నీ సొంతం కాదు!

మొలకలైతె పెరిగెటట్టు
కలుపునైతె పెరికెటట్టు
గమనముంచు కోవాలి
వనము వృద్ధి జరిగెటట్టు!

నిరాశకివ్వు వాయిదా
శ్రమించుటలో ఫాయిదా
చైతన్యమై అడుగేస్తె
సొంతమౌను శాంతి సదా!

మంచి మిత్రుల మరువకు
మంచి చెలిమిని విడువకు
సృష్టిలోన తియ్యనైన
బంధాన్ని నీవు చెరపకు!

ఎందుకిలా చేసినావు
మనస్సెలా దోచినావు
సర్వస్వము అర్పించే
సారమెలా కూర్చినావు!

జీవితము పోరాటమే
గెలుపునకు ఆరాటమే
వ్యథలకు వెరువకెపుడు
ధైర్యంగా నిలవటమే!

కరచాలనం చెయ్యాలి
సహకారమును ఇవ్వాలి
కాలమెలా మారినా
ధీరగుణంబు ఉండాలి!

అందమైన గాజుకళ్ళు
అరమరికలు లేనివాళ్ళు
కష్టకాలమందైనా
తెరిచేరు ఎదవాకిళ్ళు!

రాలితే చెమట చుక్కలు
తొలగి పోవును కష్టాలు
బ్రతుకు పురోగతి వైపు
నడిపించె వెలుగు రెక్కలు!

మధ్యానికి బానిసలై
కామానికి దాసులునై
గడిపేటి యువతరం
మారాలి మంచికొరకై!

వ్యతిరేకంగా నడవకు
అసమర్థంగా గడపకు
సమయము నీకై ఆగదు
సరిదిద్దుక పో ముందుకు!

నిదుర మత్తును కడిగెయ్యి
అలసత్వమును చెరిపెయ్యి
చైతన్యమును నింపుకొని
బానిసత్వము వదిలెయ్యి!

కాసుకు చేయి చాపడు
నమ్మికకు వమ్ముకాడు
ధీరగుణం గలవాడు
ఎవరికీ తలవంచడు!

అయిష్టతను పెంచుకోకు
అదృష్టమును తుంచుకోకు
ఆశయాలు కుంటుపడే
ఆలోచన ఎంచుకోకు!

–యన్.వి.రఘువీర్ ప్రతాప్
సెల్:9440551552.

గుండెనింపేది మాట! గుండెకోసేదీ మాటే!

కథ

"జీవితంలో పెనుమార్పు సంభవించడానికి ఏదో చాలా పెద్ద కారణం ఉండాల్సిన ఆవశ్యకత లేదు. ఒక చిన్న మాట గానీ, చిన్న సందర్భంగానీ, ఏదో అతిమామూలు సంఘటన గానీ జీవితాన్ని మారిస్తే ఆశ్చర్యపోనక్కర్లేదు" విరల్ గొంతులో సన్నని జీర ధ్వనించింది.

ఆ మాటలకి కాశీపతి వింతగా చూశాడు. పాణి మాత్రం స్నేహితుడు ఏం చెప్పబోతున్నాడో చెప్పనీ అన్నట్టుగా తల తిప్పకుండా చేతిలో ఉన్న దినపత్రికలోకి చూస్తూ కూర్చున్నాడు.

స్నేహితులు ముగ్గురూ పార్కులో కలుసుకున్నారు ఎప్పటిలాగే, ఒకప్పుడు అక్కడే ఏర్పడ్డ స్నేహి వారిది. అలాగే కొనసాగుతోంది.

ఒకరి గురించి ఒకరికి పెద్దగా ఏమీ తెలియదు. కూర్చున్న కాసేపూ రాష్ట్ర రాజకీయాలూ, దేశ రాజకీయాలూ మాట్లాడుకుని ఇళ్ళకి వెళ్ళిపోతుంటారు. కుటుంబ విషయాల గురించి ఆరాలు తీసే ఆసక్తి ఎవరికీ లేదు.

ఒక్క క్షణమాగి కాశీపతి అడగకుండా ఉండలేకపోయాడు. "నువ్వన్నదానికి కారణం ఎవరి జీవితంలోనో నువ్వు చూసి ఉంటావు కదా?"

ఔను అన్నట్టుగా తల ఊపాడు విరల్.

బడికి సెలవురోజు అయినప్పుడల్లా తల్లితో కూడా వెంటపడి ఆమె పనిచేసే ఇళ్ళకి తనూ వెళ్ళేవాడు రంగడు. అక్కడికీ "నువ్వు పోయి ఆడుకోరా పో" అంటూనే ఉంటుంది సత్తెమ్మ. వినిపించుకోడు. ఇంట్లోనూ ఇంకెవరూ లేరు. తండ్రి పోయి చాలా రోజులయ్యింది. తోడబుట్టినవాళ్లూ లేరు. వేరే పిల్లలతో ఆడుకుంటూనే ఉండేవాడుగానీ తల్లి పనిలోకి వెళ్ళే సమయాల్లో ఆమెతో కూడా తిరగడం ఇష్టం.

ఒక రోజు కాంతమ్మగారింట్లో పని పూర్తి అయిపోయాక "అత్యవసరంగా ఓ యాభై రూపాయిలు కావాలి ఇవ్వండమ్మా. ఒకటో తేదీ జీతంలో ఆ యాభయ్యీ తగ్గించుకోండని" తల్లి ఆవిడని బతిమాలుతుంటే పక్కనే ఉన్నాడు రంగడు.

"ఇప్పుడు నా దగ్గిరెక్కడున్నాయి సత్తెమ్మా? మా ఆయన్ని అడిగానంటే ఇంతెత్తున లేస్తారిప్పుడు. నెలాఖరు రోజుల్లో మూసుక్కూర్చో మంటారు. రాత్రి నించీ తలనొప్పిగా ఉంది నాకు. భరించలేకపోతున్నాను. ఓ తలనొప్పి మాత్రకొని వేసుకుందామంటే చేతిలో ఒక్క రూపాయి లేదు నా దగ్గిర. నేనెవరితో చెప్పుకోను. ఆయనగారి సంగతి నీకు తెలియనిదా? ముక్కుమీదుంటుంది కోపం. నీకు నెలాఖరులోనే వస్తాయి ఎక్కడ లేని రోగాలూ అంటూ విసుక్కున్నారు నెల్లాళ్ళ కిందట ఒకసారి."

"నిజమే అమ్మగారూ! మీరు మాత్రం ఏం చేస్తారు?" బయటకి నడిచింది సత్తెమ్మ.

"అమ్మా! నువ్వు పో ఇంటికి. నేను కాస్తయినాక వొస్తా. ఆ ఎదురుగా బడి దగ్గిర రాములు వాళ్ళతో ఆడుకునొస్తా" అంటూ అక్కడే ఆగిపోయాడు రంగడు. సరేనంటూ చకచకా వెనకవీధిలో తను పనిచేయాల్సిన ఇంటికి దారి తీసింది సత్తెమ్మ.

మెల్లిగా లోపలికి వెళ్ళి వంటింట్లో ఏదో పనిలో ఉన్న కాంతమ్మగారిని పిలిచాడు రంగడు.

"ఏవిట్రా మళ్ళీ పంపించిందా మీ అమ్మ? నా దగ్గిర లేదని చెప్పానుగా!"

"కాదమ్మా! నిన్న పొద్దున్న మా పిన్నమ్మ వచ్చినప్పుడు చాకిలేట్ కొనుక్కోమని రూపాయి చ్చింది నాకు. మీరు తలనొప్పి మాత్ర కొనుక్కోండమ్మా!" జేబులోంచి రూపాయి బిళ్ల తీసి ఇవ్వబోయాడు.

తెల్లబోయి చూసింది కాంతమ్మ. మొదట అసలు తన కళ్ళని, తన చెవులని తనే నమ్మలేకపోయింది. కళ్ళు చెమ్మగిల్లాయి.

రంగడు కూడా చాలా మనోవేదన అనుభవిస్తున్నాడు తన తప్పు తెలుసుకుని. కానీ ఎలా క్షమాపణ కోరుకోవాలో తెలియట్లేదు.

చటుక్కున రంగడి చెయ్యి పుచ్చుకుని దగ్గిరకి తీసుకుంది. ఈసారి తెల్లబోవటం రంగడి వంతయ్యింది.

"మా అమ్మకోసారి తలనొప్పి వచ్చినప్పుడు సాయంత్రానికి జరం కూడా వచ్చేసింది. మీక్కూడా అలా అవుతుందేమో అని" భయం భయంగా చూశాడు ఆవిడ వంక.

వాడి మొహంలోకి చూస్తూ ఉండిపోయిన కాంతమ్మకి ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి మనసులో. ఎంత మంచి పిల్లాడు వీడు. తనకే పిల్లలుంటే ఈపాటికి ఈ వయసు మనవడో మనవరాలో ఉండేవారు కదా! నాకు భగవంతుడిచ్చిన మనవడు వీడు. ఆ తలంపుతో ఆనందం నిండిపోయింది గుండెనిండా.

రెండు మూడు రోజులు ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చి అప్పుడు భర్తతో చెప్పింది తన ఆలోచన.

ఏ కళనున్నాడో గానీ ఒప్పుకున్నాడు సంజీవరావు. తనని ఒప్పించేందుకు భార్య చెప్పిన విధానం నచ్చింది.

రంగడిని మంచి బడిలో చేర్పించి పెద్ద చదువులు చెప్పించి వాడిని వృద్ధిలోకి తీసుకొచ్చే బాధ్యత స్వీకరించారు దంపతులు.

రంగడు అన్న ఒక్క మాట "తన దగ్గిరున్న రూపాయి తీసుకుని తలనొప్పి మాత్ర కొనుక్కోమని" అన్న ఆ మాట వినడానికి చిన్నమాటే కానీ రంగడి జీవితానికి వన్నె తెచ్చింది.

రంగుల స్వప్నాలు నిజం చేసింది. రంగడి మనసులో ఆనందాలు నింపింది. ఇంజనీర్ అయ్యాడు.

ఉద్యోగం దొరికిన ఊరు వచ్చి చేరాడు. స్థిరపడ్డాడు బాగానే.

'వాడికి పెళ్ళి చెయ్యాలి సత్తెమ్మా! ఘనంగా జరిపిస్తాను. మంచి సంబంధం చూస్తాను" అంటూ మురిసిపోయే కాంతమ్మని చూస్తే కళ్ళముందు దేవత తిరుగాడుతున్నట్టే అనిపించేది సత్తెమ్మకి.

"కన్నతల్లికంటే పెంచిన తల్లి ప్రేమ గొప్పదంటారు. మిమ్మల్ని చూస్తే అది నిజమని ఎవరైనా ఒప్పుకుంటారమ్మా. మనవడిలా కన్నకొడుకులా రెండు రకాలుగానూ ప్రేమ చూపిస్తూ పెంచి పెద్దచేసి వాడిమీదే ప్రాణమంతా పెట్టుకున్నారు. మీరు" అంటూ మనస్ఫూర్తిగా చేతులు జోడిస్తూ ఉంటే సత్తెమ్మని వారిస్తూ ఉ ంటుంది కాంతమ్మ తనని ఆకాశానికి ఎత్తెయ్యద్దని.

ఒక చిన్నమాట గుండెని నింపగలిగినట్టే ఒక చిన్నమాట గుండెకోత కొయ్యగలదు. అదే విధి ఆడే వింత నాటకం.

అసలు అలాంటి రోజొకటి వస్తుందని గానీ అలాంటి మాట తను వినవలసి వస్తుందని గానీ కల్లో కూడా ఊహించలేని కాంతమ్మ గుండెకోతకి గురి అయ్యింది.

నాలుగు రోజులు సెలవుల్లో వచ్చిన రంగడికి నవకాయపిండివంటలతో భోజనం తినిపించింది కాంతమ్మ.

ఆ మాటా ఈ మాటా చెప్పుకుంటున్నప్పుడు "అమ్మగారికి నేను జీవితాంతం రుణపడి ఉ ంటానురా రంగడూ!" అంది సత్తెమ్మ. అంతకంటే కృతజ్ఞత ఎలా చెప్పుకోవాలో తెలియక.

"ఆ అమ్మగారికి పిల్లలు లేరు కాబట్టి కదా? ఉంటే నన్ను పెంచి పెద్ద చేసేవారా?"

వెంటనే రంగడి నోటినించి వచ్చిన ఆ మాట అనుకోకుండా వచ్చినదా, కావాలనే అనాలని అన్నదా మనసులో ఏ మూలో ఆ రకమైన ఆలోచన లేకపోతే అంటాడా అంతమాట?

ఆ వ్యాఖ్యలో నిజం దాగి ఉండచ్చు కానీ పిల్లలు లేని దంపతులందరూ ఈ రకంగా చూస్తున్నారా? అది ఎందుకు ఆలోచించలేక పోయాడు?

మనసనే అద్దం ముక్కలవడానికి ఒక బండరాయితో పనిలేదు. ఒక్క చిన్నమాట చాలు. ఆ మాట కాంతమ్మని మూగదాన్ని చేసింది. ఆ రోజునించీ ఆవిడకి ఏకాంతమే స్నేహ పాత్రమైంది.

రంగడు కూడా చాలా మనోవేదన అనుభవిస్తున్నాడు తన తప్పు తెలుసుకుని. కానీ ఎలా క్షమాపణ కోరుకోవాలో తెలియట్లేదు.

"అంతా విన్నాక నాకు ఏమనిపిస్తోందంటే ఆ రంగడిని కాంతమ్మగారి దగ్గిరకి తీసుకెళ్లి మనందరం కూడా రంగడిని క్షమించమని ఆవిడని వేడుకుందామా అనిపిస్తోంది. ఆవిడ మనస్తాపాన్ని మనం పోగొట్టే ప్రయత్నం చేద్దామా అనిపిస్తోంది." పాణి తన అభిప్రాయం చెప్పాడు. ఔనన్నాడు కాశీపతి.

విరల్ కళ్ళల్లో మెరుపు, మొహంలో ఆనందం కొట్టవచ్చినట్టు కనిపించాయి. వెంటనే అన్నాడు. "అయితే పదండి మా ఊరెళ్దాం."

"అక్కడున్నాడా రంగడు?" అడిగాడు పాణి.

"రంగడు మీ ఎదురుగానే ఉన్నాడు. కాంతమ్మగారు నా పెంపుడుతల్లి అక్కడున్నాడు. నా పూర్తి పేరు పాండురంగ విరల్. ఆ పేరు మా తాత పెట్టాడు. మా ఊళ్ళో నన్ను అందరూ రంగడనే అంటారు."

–తమిరిశ జానకి
9441187182

ఏకాగ్రత

బాలయ్య ఊరగాయలు వ్యాపారం చేసేవాడు.అతనికి శర్వాణి కూతురు, సుజయ్ కొడుకు. శర్వాణి ఇంజనీరింగ్ చదువుతోంది.చదువులో ముందంజ లో ఉంటుంది. సుజయ్ చురుకైన పిల్లాడు.ప్రయివేట్ పాఠశాల లో ఎనిమిదవ తరగతి చదువు తున్నాడు. కాని చదువులో వెనుక బడి పోయాడు. సుజయ్ చదువులో వెనుక పడడటంతో తండ్రి బాలయ్య మదన పడి పోయేవాడు.పాఠశాల ప్రధానో పాధ్యాయుడుతో చాలా సార్లు

మాట్లాడాడు,సుజయ్ పై శ్రద్ధ చూపమని. ప్రతిరోజు క్రమం తప్పకుండా సుజయ్ పాఠశాలకువెళ్ళేవాడు.

అయినా ఎందుకో చదువు పై ఏకాగ్రత పెట్టేవాడు కాదు.కొన్నిరోజులు బాలు సుజయ్ మానసిక పరిస్థితిని గమనించి

ఓ నిర్ణయానికి వచ్చాడు.తను చదివే ప్రయివేట్ పాఠశాల ఇరుకు గదుల్లో కిక్కిరిసి ఉండటం,ఆడుకోడానికి విశాలమైన ఆటస్థలం లేకపోవడం,

పాఠశాల పనిగంటలు మొత్తం చదువు పేరుతో మానసికంగా యంత్రంలా తయారై శారీరక వ్యాయామం లేకపోవడం అని గ్రహించి ప్రభుత్వ పాఠశాలల్లో సుజయ్ ని చేర్పించాడు. అక్కడ విశాలమైన తరగతి గదులు, ఆడుకోవడానికి ఆటస్థలం ,వ్యక్తిగత శ్రద్ధ చూపే ఉపాధ్యాయులు ఉన్నారు.ఆరు నెలల్లో సుజయ్ లో మార్పు వచ్చింది. పాటలతో చదువుతూ ఉల్లాసంగా తన చదువును కొనసాగించి మంచి మార్కులు తెచ్చుకోవడం ప్రారంభించాడు.పదవ తరగతిలో పాఠశాలకు ప్రథమ స్థాయిలో నిలిచి,ఆటల పోటీల్లో అనేక పతకాలు సాధించాడు.పిల్లలని నిత్యం చదువు

పేరుతో బంధించి మానసిక ఉల్లాసాన్ని సృజనాత్మకతను ఇవ్వకపోతే దేనిపైనా ఏకాగ్రత ను ఉంచలేరని బాలయ్య

గ్రహించాడు.సుజయ్ చదువుపై ఏకాగ్రత పెట్టి గాడిలో పడినందుకు తండ్రి బాలయ్య ఊపిరి పీల్చుకున్నాడు.

–కయ్యూరు బాలసుబ్రమణ్యం
9441791239

విసిరేయలనిపిస్తోంది?

చీటికి ప్రయాణలో
దారులు లేని దారులలో
దారులు వెతుక్కుంటూ
రేపటి కోసం రేపటి భవిత కోసం
బ్రతుకులో వెలుగు కోసనీనడుస్తున్న
దళిత చరిత్రలను
తలుసుకొంటు తడుముకుంటు పయనిస్తున్న
మరో ప్రపంచపు తీరంలోకి!!!
ఈసుమంతైన జాలిలేని లోకమిది
దారి పొడుగునా దగా పడ్డ
బ్రతుకులే అన్ని అందుకే!! అందుకే!!
నటిస్తున్న జీవితాల్ని
ఈ నటన ప్రపంచాన్ని
చూపుకు అందని చేతికి అందని
ఈ మాయ లోకపు తీరుని
దూరంగ విసిరేయలనిపిస్తోంది..
నడి రోడ్డున నగ్నంగా
తగల బెట్టాలనిపిస్తోంది!!
మొకం నిండ తెల్లటి నవ్వు
నోటి నిండ తియ్యటి మాట
చూపు నిండ చల్లని దీవెన
అందరి మీద కురుస్తున్నట్టుంటుంది
అదే క్షణంలో ఎవరో గుండెను
చేత్తో పట్టుకుని లాగినట్టు ఉంటుంది
నమ్మకాన్ని నమ్మిన సిద్ధాంతాన్ని
బజారులో
తాకట్టు పెట్టినట్టు అనిపిస్తోంది
అందుకే!! అందుకే!!
దూరంగ విసిరేయలనిపిస్తోంది..
న్యాయాన్ని నమ్మని మనిషిని
న్యాయం వైపు అడుగు వేయని మనిషిని
నడి రోడ్డులో
న్యాయ దేవతకు బలివ్వాలనిపిస్తోంది!!
సంఘంలో సగం కూడా
సక్రమంగా లేరు
ఒకరి కొకరు
ఒకే బాటలో నడిచే వాళ్ళు లేరు
ఎట్ట ఎగరేయలి న్యాయ పతాకాన్ని
ఎట్ట నిలబెట్టాలి పేదింటి గౌరవాన్ని
ఎట్ట కాపాడాలి సమానత్వాన్ని
అడుగడుగున ఎదో ఒక చిక్కుముల్లు
తగులుతూనే ఉంటుంది
వేటగాడు అడవిలో వలలు వేస్తుంటే
మోసగాడు ఊరిలో
మాయ వలలు వేస్తున్నాడు
అందుకే!! అందుకే!!
దూరంగ విసిరేయలనిపిస్తోంది..
విసిరేయడం కంటే చితి మంటల్లో వేసి
శాశ్వతంగా భస్మం చేయాలనిపిస్తోంది
మాయగాళ్ళ మోసకారితనాన్ని....

–లక్ష్మీ శ్రీనివాస్,
9676601192

జన్మదాతా లైన అమ్మా నాన్నలు

అమ్మా నను కన్న తల్లీ
నీ ప్రేమను వర్ణించలేను
నాన్న నా హీరో నాన్నా
నీ కష్టాన్ని మరువలేను
పేదరికం పైన పోరాటం చేసారు
బీదరికాన్ని ఓడించి తీరారు
గంపెడు పిల్లల కని పెంచినారమ్మ
గుంపెడు బలగాన్ని చూసుకున్నారయ్య ॥అమ్మా॥

కష్టాలకు ఎప్పుడు కలత చెందలేదు
ఇష్టంగ సంసార సాగరం ఈదారు
కౌలు చేసినారు కైకిలి చేసారు
బండిని తోలారు బండల మోసారు
కడుపు నిండ మాకు తిండి పెట్టినారు
కంటికి రెప్పోలే పెంచుకున్నారమ్మ ॥అమ్మా॥

పండగొస్తె మీరు పాత బట్టలు తొడ్డి
మాకు మాత్రం కొత్త బట్టలు కొన్నారు
కోడి కూర వండి ముక్కలన్ని పెట్టి
పులుసుతో మీరు ముర్సిపొయ్ తింటిరి
తల్లి ప్రేమకు సాటి లేనేలేదు
నాన్న త్యాగానికి పోటి లేనేలేదు ॥అమ్మా॥

చదువు లేని తనము కండ్లార చూసారు
బడిలోన మమ్మేసి చదువుకొమ్మన్నారు
అక్షరాలు దిద్ది లక్షణంగా చదివి
ఒక్కొక్క క్లాసు ఎదిగిపోతువుంటె
చదువు విలువను చెప్పినరమ్మ
బతుకు పాఠాలను నేర్పెను నాన్న ॥అమ్మా॥

మీరు చెప్పిన మాటలు గుర్తుండె
మీరు నేర్పిన పనులన్ని యాదుండె
మీరు పడిన కష్టాలు గుర్తుండె
మీరు నేర్పిన నడకలు యాదుండె
మీ ప్రేమల ప్రతి రూపాలము మేము
మీ అడుగు జాడల నీడలం మేము ॥అమ్మా॥

జన్మదాతా లైన అమ్మా నాన్నల
రుణం తీరిపోదు త్యాగాలు తరగవు
అవని అమ్మ ఐతె పుఢమి నాన్నర
ఎనక ముందు అంటు తేడాలు ఎందుకు
అమ్మను వర్ణించ ఎవరి వసము కాదు
నాన్న నావిష్కరించ ఎవరి తరము కా

–ఉప్పెన
8106073661

వివేక వాణి



మసి గుడ్డ

అందరి చేతిలో నలిగే...
మైలపడ్డ మసిగుడ్డను!!...
వంటగదిలో ఓ మూలన కూర్చోని...
జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ...
నా పాత్రకు
నేనే ప్రాణం పోసుకుంటాను!!...
సక్రమంగా నా కర్తవ్యాన్ని
నేనే నిర్వహిస్తుంటాను!!...

ఆడవారి చేతులో
అందంగా అగుపిస్తా!
చూపులకు మసి గుడ్డనే కానీ..
చేసే పనులలో అందరినీ మెప్పిస్తా!!
అందరికీ అనుకూలంగా మెదిలి...
వేడితాపాన్ని భరిస్తూ...
నిలువెల్లా గాయాలను మోస్తుంటా!!

ఒక్కప్పుడు దర్జాగా బతికిన దానిని!!
కొత్తలో నా అందమే అందం!!
నన్ను ధరించి ఎందరెందరో
మురిసిపోయేవారు!!
అన్నీపండుగల్లో అపురూపంగా
దాచుకొని వాడుకొనేవారు!!
నా కొత్త దేహం మీద
ఎన్ని రంగులో..ఎన్ని పొంగులో!!
ఆకుప్పనిపూలతో అందంగాఉండేదాన్ని
ఇప్పుడు అన్నీ జీర్ణమైపోయి...
జ్ఞాపకాలు రాలిపోయి...
పేగులన్నీ చిట్లిపోయి...
బతుకంతా జారిపోయి...
ఓ మసిగుడ్డగా మారిపోయా

మాయదారి మూక

మని కథ

'చాల దారుణం ఇది! ప్రతి సీట్లోని ప్రయాణీకులు అంటున్నారేగానీ వాళ్ళని ఎదురించడం లేదు. కొంతమందికి మాత్రం ఇది నవ్వులాగ ఉంది. 'డబ్బులు లాక్కొని దిక్కుమాలిన దీవెనలొ కటి! అసలు రైల్వే అధికారులు వీళ్ళను ఎందుకు భోగీలలోకి అనుమతిస్తారో!!

ఈ రైలు తీరువుగా ఏమీ లేదు. తీతువు పిట్టలాగ అన్పిస్తూ ఉంది. అసలు పాసింజర్ రైళ్ళనయం. ఇదిమాత్రం ఉండుండి కూత పెడుతూ ఆపసోపాలు పడుస్తూ నడుస్తోంది.

ఫోన్‌రింగ్ అవుతోంది. చూస్తే కూతురు మాళవిక నుండి ఫోన్ కాల్.

'డాడీ'! ఇందాక మీ మేనేజర్ సార్‌ని కలిశాను. వారం రోజులు టైమ్ ఇస్తున్నాను. కాలేజి ఫీజు కట్టాల్సిందే. లేకపోతే టీసి ఇచ్చి పంపించేస్తానని వార్నింగ్ ఇచ్చినారు.

సరే కాసేపట్లో నీ దగ్గరకు వస్తున్నాను. ప్రస్తుతం ట్రైన్‌లో ఉన్నాను. వచ్చి అన్నీ మాట్లాడతాను. బొగ్గురాజు మనసు భగ్గుమంటోంది. తన లేమితనం అసహ్యంగా అన్పిస్తూ ఉంది. జేబులోకి చూసుకున్నాడు. ఐదువందల నోటుకుమించి పైసా లేదు.

రైలులో జనరల్ భోగీ బాగా రద్దీగా ఉంది. చింతలూరు స్టేషన్‌లో పది మందికి పైగా కొజ్జా వాళ్ళ మూక బిలబిలమంటూ ఎక్కేసింది. అదేపనిగా సందడి చేస్తున్నారు. చిటికెల చప్పుళ్ళు చేస్తూ, మొటికలు విరుస్తూ వినూత్నంగా అందర్నీ అడుక్కుంటున్నారు. ఇచ్చినవాళ్ళు ధర్మం చేస్తున్నారు. లేని వాళ్ళు కాదు పొమ్మంటున్నారు. వాళ్ళు మాత్రం వదలడం లేదు. నిలదీస్తున్నారు. ఇవ్వకపోతే నోటికొచ్చినట్లు తిట్టిపోస్తూ ఉన్నారు.

బొగ్గురాజును అడిగి చూశారు. పలకలేదు. కళ్ళు మూసుకున్నా వదలలేదు. బలవంతంగా జేబులోని ఐదువందల రూపాయిల నోటు లాక్కోనిపోయారు. వెళ్తూ తమదైన శైలిలో దీవించిపోయారు. ఆయనగారికి కోపంతో బాటు ఆవేశం ఎసను దోసుకొచ్చేసింది. కానీ ఏమీ చేయలేక ఉడుక్కున్నాడు. ఇప్పుడు బొగ్గురాజు చేతిలో చిల్లిగవ్వలేదు.

'చాల దారుణం ఇది! ప్రక్క సీట్లోని ప్రయాణీకులు అంటున్నారేగానీ వాళ్ళని ఎదురించడం లేదు. కొంతమందికి మాత్రం ఇది నవ్వులాటలాగ ఉంది.

'డబ్బులు లాక్కొని దిక్కుమాలిన దీవెనలొకటి! అసలు రైల్వే అధికారులు వీళ్ళను ఎందుకు భోగీలోకి అనుమతిస్తారో!!' బొగ్గురాజుకి జుగుప్స అన్పిస్తూ ఉంది.

'విజయవాడ రైల్వేస్టేషన్ మరో అరగంటలో వచ్చేసింది. మరోమారు ఆ కొజ్జామూక గోల ప్రారంభమయిపోయింది. అదేపనిగా అడుక్కుంటున్నారు. ఇక లాక్కోవడానికి తన దగ్గర ఇంకేముందట! వాళ్ళు చిటికెలు విరుస్తూ బలవంతాన అడుక్కోవడం మాత్రం మానడం లేదు.

'లోకానికి పనికిరాని వాళ్ళం! ప్రజలకు నచ్చనివాళ్ళం!! అయినా మా దీవెనలు మీకు శ్రీరామ రక్ష. విజయవాడ స్టేషన్ వస్తూ ఉంది. ఇంతలో ఏమయిందో ఆ కొజ్జాల మూకలోని ఓ ముదురు మనిషి కదలబోతూ వెనక్కి వచ్చాడు.

'సల్లగుండయ్యా! మా కొజ్జాలు నిన్ను నీ కుటుంబాన్ని సల్లగా సూత్తారు! నమ్మకముంచు. తన జాకెట్లో దోపుకున్న రూపాయిల కాగితాలు కొన్నింటిని తీసి బొగ్గురాజు చేతిలో పెట్టి ముందుకు కదిలిపోయాడు. ఆశ్చర్యంగా ఉంది. వింతగా అన్పిస్తోంది. లెక్క చూస్తే వెయ్యి రూపాయిల పైచిలుకు ఉన్నాయి.

కను కొనల్లో ఉబికిన కన్నీటి చారికల కావల అలా త్రొంగి చూశాడు. లోకం గేలిచేస్తున్నా నిర్వేదనా భరితమైన మనుషుల మూక తన ముందు శేషముందు శేష ప్రశ్నగా నిలుస్తూ ఉంది. రైలు దిగి బయటకు నడుస్తున్నాడు.

'మా పనికి మా నోళ్ల దీవెనలు నీకు శ్రీరామరక్ష! అని మొటిమలు విరిచి తనను ఒక్కసారిగా హత్తుకుని ఉన్న కాసింత డబ్బును ఇచ్చి పోయిన ఓ మనిషి తాలూకు ఔదార్యం బొగ్గరాజును తీవ్రంగా చలింపజేస్తూ ఉంది. బయటకు కదులుతుంటే జేబులోని సెల్‌ఫోన్ రింగ్ అవుతూ ఉంది.

'మేమండీ! చీరాల బత్తుల సర్వీస్ ట్రస్ట్ ఆఫీసు నుండి మాట్లాడుతున్నాము. మీరు విద్యార్థిని మాళవికగారి తండ్రిగారేనా! మొన్న మా అమ్మాయి చదువు నిమిత్తం స్కాలర్‌షిప్‌కి అప్లై చేసి ఉన్నారు. అప్పట్లో ఫ్రెండ్స్ లేక ఈ అమ్మాయి అప్లికేషన్‌ను పెండింగ్‌లో ఉంచాము. ఇప్పుడు చదువు ఫీజుల నిమిత్తం ఏడాదికి లక్షరూపాయిల వరకు మంచి స్కాలర్‌షిప్‌ను మంజూరు చేస్తున్నాము. దీని నిమిత్తం మీరు చీరాల రావాల్సి ఉంటుంది.

చల్లని మలయ మారుతంలాంటి వార్త బొగ్గరాజును విచలితుణ్ణి చేస్తూ ఉంది. అదే పనిగా పొంగిపోతున్నాడు. జేబులోకి వచ్చి చేరిన పదివందల కాగితాలు తనకు భరోసాగా నిలుస్తున్నాయి. మనసు చిన్నగా వణుకుతుంటే అలా చూస్తూ ఉన్నాడు.

దూరాన ప్లాట్‌ఫాం మీద ఇందాకటి సమూహం అదే తరహాలో అడుక్కుంటున్నారు. ఇది ఇప్పుడు వల్లమాలిన మూకలాగ అన్పించడం లేదు. ఈ ప్రపంచాన విప్పారిన మానవీయ నైజాలు.. అలా అనుకుంటున్న బొగ్గురాజు చేతులు రెండు అప్రయత్నంగా దగ్గరయి వాళ్ళకు నమస్కరిస్తూ ఉన్నాయి.

-వడలి రాధాకృష్ణ
సెల్: 9985336444

"రావు నుడువు మాట రాచ బాట"

-డాక్టర్ కాసర్ల రంగారావు,
9866837741

జ్ఞానమార్గమేవిజ్ఞానమొసగునురా
వేమనేగెతాను వీలు కొలది
వేల నుడువు లిచ్చె విశ్వమోచకములు
రావు నుడువు బాట రాచ బాట.

కాంత కనకములతొ కమ్మివేసినవాడు
కాంచ లేడు తాను కాంతి నిలను
భ్రాంతి విడిన తానె బట్ట బయలు జేయు
రావు నుడువు మాట రాచ బాటఎ

భక్తి మార్గ మంత భుక్తిమార్గమయ్యె
రక్తి లోన మునిగె రంజు గాను
భక్తి రక్తి మోక్ష పథము గానున్నవో
రావు నుడువు మాట రాచ బాట.

ఇష్టమైన చదువు కష్టమేయదుసుంత
కష్టమైన పనితొ నష్ట మగును.
ఇష్టమైన తీరు యిలలోన సాగును.
రావు నుడువు మాట రాచబాట.

యిల్లు విడిచి పోవ యిక్కట్లు తప్పవు.
యింటి నొనరు జేయ ఈర్ష్య లొచ్చు
కష్ట సుఖము లెరుగు గడపలో తప్పవు.
రావు నుడువు మాట రాచబాట.

కలిమి జేయ నెంచి కార్యమ్ము సమకట్ట
ముంచి వేయ నెంత్రు మోస కార్లు
పట్టు బట్టి నీవె బావుటా యెగరేయి.
రావు నుడువు మాట రాచబాట.

గంజి తోటి గడుపు గతిలేని కాలాన
పనులు చేయ మీకు పాట్లు తొలుగు
గౌరవములు పొందు కార్య సాధనతోడ
రావు నుడువు మాట రాచబాట.

తత్వ శాస్త్ర మంత తరచిచూ చినగాని
ధర్మ నిరతు లెల్ల దారి చూపు
తత్వ మంత విడిచి తన్లాట పడెదరు
రావు నుడువు మాట రాచబాట.

కామితములుయిచ్చు కరదీపి కయ్యెను.
సంపదలొనగూర్చు సరసిజము
అత్తకోడలనఘ ఆరితినుండును.
రావు నుడువు మాట రాచబాట.

తార్కికములుసాగి తలుపులు గొళ్ళాలు
యంత్ర శాస్త్ర మంత యిదియె గాదె
జీవ శాస్త్ర మంత జేగంట మ్రోగించె
రావు నుడువు మాట రాచబాట

ఆధునిక విజ్ఞాన మెంతపెరిగినాను
రోబొ టిక్సు స్పేసు రూట్సు గాదె
వాసముమరి యాయువర్థితములకేగా
రావు నుడువు మాట రాచబాట.

పట్టణాలుపెరిగి కట్టలు కరిగెపో
ఊరువాడ మునిగి మురుగు మిగిలె
కలుషితములు సాగి కాలుష్యమాయెనో
రావు నుడువు మాట రాచబాట.

గ్రామ మైన నేమి గ్రామీణులుండరా
కలుపు గొనెడి తనము కష్ట సుఖము
పైరగాలి మనసు బెరుకులే పోగొట్టు
రావు నుడువు మాట రాచబాట.

రాడికల్సు మరియు రాష్ట్రసంఘముకల్సి
నీవు చెప్పి నట్లె నెనరు తోడ
పోరిగెలిచినారు భూరిశ్రవునితోనే
రావు నుడువు మాట రాచ బాట.

జయము జయమనియెను జయశంకరుడె గాధ
తపన చెంది నిలిపె తల్లి నతడు
ఉద్యమాలుచేసి ఉదయింపజేసెను.
రావు నుడువు మాట రాచ బాట.

పెద్దలందరిసభ బిగువుసడలనీక
బలము గళమునిచ్చి పటుత పెంచె
తిరుగులేని రీతి తెలగాణ తెచ్చెను.
రావు నుడువు మాట రాచ బాట.

ముఖ్య శిష్యుడింక ముఖ్యమంత్రి యెగాగ
పనులు చక్కబెట్టు పథకములతొ
పాడి యైన దారి పయనించే పదిలాన
రావు నుడువు మాట రాచ బాట.

పూర్తి గాని పనులు భుగభుగలెగయగా
నాణ్యమైన పనులు నవసి నపుడె
నరుని ఆశ తుంచ నారాజు పెరుగును.
రావు నుడువు మాట రాచ బాట.

జయము నిచ్చు శంక జయశంకరుడవీవు
వేల్పు లేల యింక వెలసి తీవు
స్వార్థ త్యాగ మైన సార్థక జీవివి
రావు నుడువు మాట రాచ బాట.

వస్తువులకు వాస్తవవిలువ గణనాల
తెలియ జెప్పె తానుధీటుగాను
మార్పు భావ నలతొమంచిమార్పులవచ్చె
రావు నుడువు మాట రాచ బాట.

కూలి చేయు వారి కీలకసమయాలు
అష్ట గంటలుగను అవని యందు
నిర్ణయాలుచేసెనెనరుమీరగ మార్పు
రావు నుడువు మాట రాచ బాట
శ్రామిక యుగ కర్త శౌర్యోద్ధతినుతింప
సార్థకముగ నడిచె సహచరిగను
బాధలెన్నొ యోర్చె భార్యగా గమనించి
రావు నుడువు మాట రాచ బాట.

నూట యాభ యేళ్ళనుద్యమనిరసనలు
సత్యమన్నిదిశల సాగి నిలువ
ప్రేరణకలిగించె ప్రియతము లొప్పగా
రావు నుడువు మాట రాచ బాట.

గిల్లి కజ్జ తోడ గేలిచేసినిలువ
ట్రంపరితనమెల్ల ఠాంఠ ఠామె
అందరెదుట మిగిలె అవమాన భారము
రావు నుడువు మాట రాచ బాట.

మతము రాజకీయ మతముఒరసుకోగ
మారు చుండె చేయి మనసు బట్టి
మతము మత్తు మందు మార్పు చెప్పెనుముందు
రావు నుడువు మాట రాచ బాట.

అనుసరించునవియె ఆచారములునాయె
శాస్త్ర సమ్మతములె సంఘమందు
నిలిచి యుండు నవియె నీతినియమముగా
రావు నుడువు మాట రాచ బాట.

రాచరికము వలన రాజులే ఎదుగగా
ఓటు వలన జనుల కొనరు మేలు
జరుగుతున్న దాని జారత్వ మెరుగరే
రావు నుడువు మాట రాచ బాట.

సామ్యవాద మంతసాగినిలుచునని
చెప్పి నారు బుధులు చింత తీర
మిశ్రమముగసాగు మేలుదార్లు నిలిచె
రావు నుడువు మాట రాచ బాట.

వేల దార్లు వెతక వేసారి పోదురు
మంచి దారి నొకటి మార్చ వద్దు
లోపములను వదల లోకమే కీర్తించు
రావు నుడువు మాట రాచ బాట.

భారమతనిదనకు బరువుమోయినీవే
కనిన వారి నంత కష్ట మనకు
ఉద్ధరించనీవె యోగ్యతలు పెంచూ
రావు నుడువు మాట రాచ బాట.

దైవమనుచునెపుడు దాటవేయతగదు.
బాధ్యతలను తలప పారి పోకు
నీవు చూపు దారి నిత్యమై వెలగాలి
రావు నుడువు మాట రాచ బాట
జనుల కొరకు మంచి శాసనమైనిల్చు
ఆచరించనదియె హాయి గొల్పు
జనులు కొల్తు నిన్ను జాతర గామార
రావు నుడువు మాట రాచ బాట.

ఒరులమేలుగాంచి ఒనగూర్చు పనులెల్ల
నీకె చేరు నవియె నెనరు గాను
విత్తనములు నాట విత్తమైనట్లుగా
రావు నుడువు మాట రాచ బాట.

ఓటు మహిమ నెరిగి ఓటరు నడువగా
జనుల స్థాయి పెరిగి జన్మ ఫలము
సఫల వంత మగును జనస్వామ్యమదియే
రావు నుడువు మాట రాచ బాట.

డబ్బు మందు పంచి డాంబికములతోడ
ఎన్న గాను కాదు ఎన్ని కిలను
నెనరు తోడ గెలుపు నిస్పాక్షికతగాను
రావు నుడువు మాట రాచ బాట.

ఆస్థి కూడ బెట్టి అదనుజూసిపంచే
స్వార్థ పరుల వల్ల చేవ జచ్చు
పరిణితిగనలేని పరిహాస మగునుగా
రావు నుడువు మాట రాచ బాట.

ఐదు యేళ్ళ కొక్క ఎన్నికల క్రతువ్
ఏరి కోరి నీవె ఎన్ను కొనుము.
అయిదు ఏండ్లు నీకు ఆధారమైనిల్చు
రావు నుడువు మాట రాచ బాట.

మంచి వారి కోరి మార్చరాదు సభల
మంచి వారి తోటి మంచి జరుగు
మంచి పరిధవిల్ల మారాకు వేయదా
రావు నుడువు మాట రాచ బాట.

ఎన్నికల సమయము ఏమరకనిలువు
ప్రజల సొమ్ము చేటు పాలు గాక
జనుల కొనర మేలు జాగృతం బొనుగా
రావు నుడువు మాట రాచ బాట.

బహుళ పార్టి వల్లభావుకత పెరుగు
నాణ్యమైన దానినెన్నె దరులు
ప్రజల మేలు కొరకు భావాలు విరజిమ్ము.
రావు నుడువు మాట రాచ బాట.

ప్రజల క్షేమ మునకు పార్టీలు యందురే
అంద రెప్పు డొను సమము గాను
కాసు గల్ల వాడు గల్లంతు జేయడా
రావు నుడువు మాట రాచ బాట.

పౌర హక్కు లనిన పరిపక్వత పెరుగు
రాజ కీయ హక్కు హద్దు నుండు
రాసుకున్న విలువ రాజ్యాంగ బద్ధమే
రావు నుడువు మాట రాచ బాట.

తిరుగు బాట్లు పెరుగ దేశంబుచేజారు
విలువ లేని రూక వెతలు చేర్చు
వస్తువులను నిలుపు వసుధమెరయగాను.
రావు నుడువు మాట రాచ బాట.

అడవులందుగలరు అడవిపుత్రులంద్రూ
గిరి సీమ నుండు గిరిజనులు
ఆది మానవులకు అండగా నిలువుము.
రావు నుడువు మాట రాచ బాట.

కులముగుణముకొరకుకొట్లాటతగదురా
అమరు నవియె నీకు అవసరముగ
డబ్బు లేని వాడు దుబ్బుకు కొరగాడు
రావు నుడువు మాట రాచ బాట.

జ్ఞాన జ్యోతి నిలుపు జాణలే మారగా
కాంతి వంతముగను జాతి వెలుగ
శక్తి బుద్ధి రెండు సమపాళ్లు సాగగా.
రావు నుడువు మాట రాచ బాట.

దేశ ఘనత పెంచ తేటతెల్లమగును.
కలము హలము రెండు కలసి సాగ
అన్న వస్త్ర మీయ అణ్వస్త్రములముందు
రావు నుడువు మాట రాచ బాట.

స్త్రీని చిన్న బుచ్చ శ్రీలుతొలుగుచూడు
మహిళ సహచరిగను మారి పోయె
పాత కాల మంత భావిలో తొలగును.
రావు నుడువు మాట రాచ బాట.

అయ్య గారి బడులు ఆర్యుల చేయును
బడుగు బడులయందు బౌద్ధులుంద్రు
రెంటి మేళవింపు రూపు కట్టెను చూడు
రావు నుడువు మాట రాచబాట.

శ్లోక శాస్త్రమంత శోక శాస్త్రమునాయె
అర్థమెరిగినోడు అవని లేడు
అర్థమెరిగిచూడు ఎదురుండదిగనీకు
రావు నుడువు మాట రాచబాట.

ఇంటి దాన్ని నమ్మి ఇంపైనోడు ఎవడు
అన్నదమ్ము లయిరి అడవిపాలు
ఐకమత్యముంటె ఐకనై నిలుచును
రావు నుడువు మాట రాచబాట.

గోగినేనిబాబు గూఢార్థమేతెల్ప
గోల చేయు వారి గోచి లూడె
తెలియ దగినదంత తేట తెల్లమవగ.
రావు నుడువు మాట రాచబాట.

హేతువాదదృష్టిహితముచేయునటంచు
పసి వయసున పాడు భయము లేక
ద్విదశ వయసు నందెతెలివితేటలుపెంచె
రావు నుడువు మాట రాచబాట.

ఫ్రెంచి వాటికనుల ఫాయిదాలనుతేల్చి
నిజము ఎరుక పరచె నిగ్గు దేర
మనుజ హక్కు లెల్ల మాయగాకననెనిల్వ
రావు నుడువు మాట రాచబాటఘ

తప్రిమానుతాము తరిమివేయను తల్చ
మూర్ఖ జనుల మాడు మూఢునట్లు
పాకు బంగ్ల పాప పంకిలములు కూల్చె
రావు నుడువు మాట రాచబాట.

అమెరికాను చట్ట హరణము తగదన్న
వినకపోయి వాడు విర్రవీగె
చేటు కలిగి నాంక పాట్లు తప్పదవని
రావు నుడువు మాట రాచబాట.

మూర్ఖ జాతి తోడ ముద్దుముచ్చటలెల్ల
తగనిదన్నవాడు తగవు పెంచె
ఇంగిలీషు వారి వెకిలి చేష్టలివియె
రావు నుడువు మాట రాచబాట.

తెంపరోడువాడు దీర్ఘమతియుగాదు.
చెవిని పెట్టకున్న చేటు వచ్చె
కాంచు మోయి నీవు కడుమ యాపదలెల్ల.
రావు నుడువు మాట రాచబాట.

పేద జనుల తెలివి బెదిరించ తగదురా
వేచి వేచి వారు వేటు వేయ
నీరు గారి పోయె నియంతృత్వమెల్లా.
రావు నుడువు మాట రాచబాట.

ఊడ్చి వేయ జనులు ఓట్లదెబ్బలతోడ
ముఖ్యనాయకులనె మొసలు మర్ల
తిరుగు బాట్ల పటిమ తేటతెల్లమవగ
రావు నుడువు మాట రాచబాట.

సత్య నిష్ట తోడ సంచరించినయంత
మేలు నొసగు దారి మీరకుండ
జనుల చేతి లోన జండాగ నిలుచును.
రావు నుడువు మాట రాచబాట.

పార్టి మారుటెల్ల పాతివ్రత్యమ్మాయె
చూడచూడ విసుగు డోకు వచ్చు
పార్టి మారుటంటె పల్టీలు కొట్టటా!!??
రావు నుడువు మాట రాచబాట.

పాదయాత్ర తోటి పలుకుబడి పెంచి
పాలనముకు సూటి బాటయయ్యె
ప్రజలమనసుగెలువు విజయాన్నిదెసులువు
రావు నుడువు మాట రాచబాట.

నాయకులకువేయు నకిలివేషాలకు
కొర్రు కాల్చ జనులు కూత పెట్టు
వాత వాతలకును వారివాతముదిగు
రావు నుడువు మాట రాచబాట.

ప్రజల కొరకు ఒనరుబాటలేయుటకును
పాత పద్ధతులకు పాతరేసి
క్రొత్త విధము లెన్నొ కూర్చినారిటచూడు.
రావు నుడువు మాట రాచబాట.

మానవాళి కొరకుమంచిచేయుటకును
తీర్చిదిద్దినారు దేశమంత
చక్కదిద్ది చూపె సర్దారు ధృఢముగ.
రావు నుడువు మాట రాచబాట.

ఎంత వారలైన కాంతదాసులనియు
గేలిచేయువారి గీర పోవ
ఏకపత్నివ్రతము ఏర్పాటు చేసిరి.
రావు నుడువు మాట రాచబాట.

వ్యాసభీష్ములెంత వగచిచెప్పినగాని
పాడుబుద్ధిచేత పంత మెంచి
కాలగర్భమందె గాంధారి కొడుకులు.
రావు నుడువు మాట రాచబాట.

హేతువాద పటిమ హితము కూర్చును చూడు
నాస్తికములు కూడ స్వస్థి లేక
మూర్ఖతములు పోవ మొదటి మెట్టు కలుగు
రావు నుడువు మాట రాచబాట.

శాస్త్ర విషయములను చక్కగా నేర్చుచూ
భారతీయ మపుడు భవ్య మయ్యె
మధ్య వచ్చి నట్టి మాంద్యము పోగొట్టు
రావు నుడువు మాట రాచబాట.

మునులు ఋషులు నాడు మొక్కుబడులు గాక
కృతకములను గూల్చి కృతులు వ్రాయ
జ్ఞాన భాండ గరిమ జ్ఞాపక ముంచుకో.
రావు నుడువు మాట రాచబాట.

ఎడ్డి కాల మంత ఇంకసాగదు సుంత
మేలు అయిన దారి మేలుకొలుప.
జాతి జీవితముకు జవసత్వములుయివ్వు.
రావు నుడువు మాట రాచబాట

రాజ్యతంత్రమంత రాజ్యాంగ సాక్షిగా
రగలు పొగలు చేరి రచ్చ జేయ
ప్రజల నేత కెపుడు ప్రాప్తమౌ పరిణితే
రావు నుడువు మాట రాచబాట.

గొప్ప వారి దీక్ష కూర్చునెపుడు భిక్ష
మంచి చేయు వారి మనుగ దంత
స్వార్థమించుకేని సాగద పుడుచూడు
రావు నుడువు మాట రాచబాట.

నాయ కత్వ గణము నెనరుజూపినగాని
అంతరించిపోవు అవకతవక.
స్వార్థరహితజగతి సాగునటులనేగ
రావు నుడువు మాట రాచబాట.

అంతరించిపోయె అవనిలో న్యాయమ్ము
చిగురు తొడుగ నదియె చింత తీరు
న్యాయ వర్త నమున నాణ్యతే పెరుగదా
రావు నుడువు మాట రాచబాట.

గొప్ప చెప్పుకొనగ గురివింద రీతిగా
జగతి నవ్వి పోద జాడ్య మిదియె
గొప్ప చేరు నీకు గుణములమరగానె
రావు నుడువు మాట రాచబాట.

బహుళజనులునేడుబాధలుపడుచుండ
కొద్ది మంది సుఖము కులుకు తుంద్రు
తారతమ్యమంత తల్లఢిల్లగాజేయు.
రావు నుడువు మాట రాచబాట.

తద్దినాలుపెట్టి తన్నుకు చావడం
విశ్వమంతపాకె వింత గాను
భారతీయమైన బాధ్యత పెరుగదా
రావు నుడువు మాట రాచబాట.

తల్లి దండ్రి కింత తలెలోన వేయక
గర్వమెంతొపాకె గతులు దప్ప
పరిపరివిధములుగ పాట్లు సంస్కృతి చేటు
రావు నుడువు మాట రాచబాట.

మంచి ఆలోచనలు మంట్లెకలిసిపోవ
చెడును చేర దీయ చేటు వచ్చె
చేయి జారి నాంక చీకటే మిగులురా
రావు నుడువు మాట రాచబాట.

జాషువాను నీవు జాగ్రత్తగా చదువ్
విశ్వ నరుడు గాను వినుతి కెక్కె
భారతీయమతని భావన గామ్రోగె
రావు నుడువు మాట రాచబాట.

కృష్ణ దేవ రాయ కీర్తిమంతు డవగ
తెలుగు జేసె నట్లు తుళువ వంశు
భాష సంస్కృతులవి భాసింప జేయురా.
రావు నుడువు మాట రాచబాట.

పాట పనులు రెండు పారవశ్యము చెంది
జానపదము ఎరుగు జాను తెనుగు
జ్ఞాన పథము నిండి జానపథము జూపె
రావు నుడువు మాట రాచబాట.

జానపదము నిలిచె జ్ఞాన భాండములుగా
అన్నమయ్య నిలిచె ఆకళింపు
గద్దరన్నపాట ఘనమైన మ్రోతరా
రావు నుడువు మాట రాచబాట.

జాణనేర్పరులవి జంకక నిలిచెగా
జఢత వీడుటకును జడతొ దెబ్బ
పల్లె పాటలందు పాఠము లాయెగా
రావు నుడువు మాట రాచబాట.

గద్దరుండు పలుకు గరముగరముగాను
ఘంటసాల పలుకు ఘనముగాను
సహజ సాధనమునసాధ్యమౌ ప్రతిభయే
రావు నుడువు మాట రాచబాట.

అందె శ్రీల బాట అంది వచ్చెను చూడు
అన్నమయ్యరీతి అమరె గరిమ
చదువు రాని వాడి సహజ ప్రతిభయేగ
రావు నుడువు మాట రాచబాట.

తలపు తెచ్చినాడు తెలగాణ గీతము
దీటుగాను చరిత తేటపరచ
అందే శ్రీదె గళము ఆత్మవిశ్వాసమే.
రావు నుడువు మాట రాచబాట.

నాట్య కళకె యతడు నటరాజ గానిల్చె
రవళి కొసగె దీక్ష రామకృష్ణ
పిలుపు తోడ పలికె పేరిణీ తాండవం.
రావు నుడువు మాట రాచబాట.

ఆంధ్ర నాట్య రీతి అవనిపొగడగాను
బాలి ద్వీపమందు బహుళ దీక్ష
తేల్చి చెప్పినాడు తీయని సత్యము
రావు నుడువు మాట రాచబాట
రావిపూడి యందు రాటుతేలినదేది
వేంకటాద్రి పేర వెలసినాడు
హేతువాద మునిగ హితముపేర్చినవాడు
రావు నుడువు మాట రాచబాట.

కత్తి పద్మరావు కాచివడపోసే
హేతువాదమతని హితము చేయ
దళిత జనుల కొరకు దారియేర్పాటాయె.
రావు నుడువు మాట రాచబాట.

మౌన మునిగ యతడు మంత్రాంగ మేచేసి
సాధ్య మైన రీతి సఫల మవగ
చాటిచెప్పిరంత చాణుక్య రీతిగా
రావు నుడువు మాట రాచబాట.

జడలు కట్టి యున్న జాడ్యతే పోవగా
కుడుపు కుదిపి నాడు గెలుపు చేత
ఓర్వలేనివారు ఓంద్ర పెట్టనదేల
రావు నుడువు మాట రాచబాట.

కుడుప పెట్టి కుడుప ఘోరమై పోవగా
పరువు పోయి నగువ పాత రేగ
పరువునిలిపియతడె పసిడితెచ్చెనుజూడు
రావు నుడువు మాట రాచబాట.

పారమార్థికంబు ఫలితవిలువలీయ
నిలిపి చూపె రదిగొ నేతలట్లు
విలువ లేర్ప రచిన విత్తమీయుగదరా
రావు నుడువు మాట రాచబాట

నాయకత్వమనిన న్యాయవర్తనములే
కీడు చేయ తొలుగు కీర్తి కాంత
పరువు బాసి నాంక ప్రాణములుండునా
రావు నుడువు మాట రాచబాట

పాలనమును చొరవ పారదర్శకముగ
జనుల మేలు కొరకు జాగృతవగ
ప్రబలమవుతు నిలిచె ప్రజాస్వామ్యపథము
రావు నుడువు మాట రాచబాట.

గెలిచి ఓడి గెలువ గీటురాయిగమారె
ఓటునిలిచి చూపె ఓటి కాక
ముఖ్యనేతలంత మునిగితేలిరిచూడు
రావు నుడువు మాట రాచబాట.

నేతలెప్పుడైన నియంతృత్వ పథము
సాగినప్పుడెల్ల సమర మగును
ప్రజలమెప్పుపొందె ప్రజాస్వామ్యమవని
రావు నుడువు మాట రాచబాట.

అధిక బరువు చేత అధిష్టానముగాగ
నాయకత్వసరళి నాటిరదిగొ
నేలమట్టమవగ నియంతృత్వ సరళి
రావు నుడువు మాట రాచబాట.

తీరు తీర్లుచూడ తీటతిమ్మిరి బాసె
వాసి కెక్కె జూడు వక్రగతులు
సంస్కరణల పేర సంస్కృతి నెడబాయ
రావు నుడువు మాట రాచబాట.

ఐకమత్యములుగ ఏకత్వభావన
భిన్న సంస్కృతులన్ని భేదమనక
ఆదరించె గాదె అవనిలో భారతే
రావు నుడువు మాట రాచబాట

నాలుగవశతకము నేడు పూర్తి యయ్యే
నాణ్యత తెలుపుటకు నేరుగాను
పఠితులంత చదివి పరవశములుచెంద
రావు నుడువు మాట రాచబాట.

ఆటవెలదులందు అర్థముప్పతిల్లా
శతకరచనయందు సాహసించి
కృషిని చేసినాను క్రాంతి కొరకునేడు
రావు నుడువు మాట రాచబాట

రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి రాసిన "మల్లియలు" గజళ్ళు పుస్తకానికి సీనియర్ జర్నలిస్టు వల్లూరి రాఘవరావు రాసిన ముందు మాట ఇది.

ఇదో.. మల్లెల సునామీ

గజల్ మౌలికంగా ప్రక్రియ అయినప్పటికీ సారూప్యంగా శిల్పం, రచనా సంవిధానం, పదాల ఎన్నిక కలిసి గజలియత్‌ని ఆవిష్కరిస్తుంది. ఇది లేని రచన ఒట్టి లలిత గేయమే అవుతుంది.

స్వప్నం సత్యమయ్యే క్షణాలను శాశ్వతం చేసే ప్రక్రియ గజల్. దాన్ని రాయడానికి పాండిత్యం కన్నా హృదయం ముఖ్యం. హృదయం మాత్రమే వున్న కవయిత్రి రాజా వాసిరెడ్డి మల్లీశ్వరిగారు.

ఎడారిలో పూలు పూయవనే విషయం అందరికీ తెలుసు. కానీ గజల్ అనే వాడని పువ్వు పూసింది మాత్రం అరేబియా ఎడారి లోనే. ఆత్మగతాను భూతుల స్పర్శలో ఆనంద భాష్పాలుపోసి పెంచినట్టు ఉంటాయి ఈ కవయిత్రి గజళ్ళు.

ప్రేమ రుతువులో పూల ఉక్రపోత ఈమెకు మాత్రమే తెలుసు! నింగి చుక్కలు వేసే పూల పక్కలపై ఆమె అక్షరాలు గడుసుగా వెన్నెల ధూపం వేయగలవు!

ఈ మల్లియల గజళ్లలోని అందమెంతో..

హృదయం క్రమరమైతే తప్ప ఇలాంటి గజళ్ళను రాయలేరు. ఈ సంపుటిలో ప్రతి గజల్ ప్రకృతిలోకి విహారమే. పూల తోటలో తప్పిపోయిన అందమైన అనుభూతే. తెమ్మెదల తుమ్మెరల నడుమ విచ్చుకున్న మల్లియలే ఈ అక్షరాలన్నీ. నింగి ముంగిట ముగ్గేసే దమ్మున్న కవయిత్రి ఈ కవయిత్రి అని నాకు అనిపించింది. నది ఒక గీతం కావడం కోసం ప్రాణాన్ని గానం చేసిన గజల్ ఈమె.

సున్నితమైన ఈ గజళ్ళలో వాసచుక్క వాత్సల్యం జోల పాటకు మాత్రమే తెలుసన్నది మీరు తెలుసుకుంటారు.

చెంగల్వల చెంత జారిపోయే వెన్నెలను చూసి మీరు ఆశ్చర్య పోతారు ఓ గజల్‌లో!

ఈ పుస్తకం చదువుతుంటే పూలదండలో ఒదిగిన దారమైపో తాడు పాఠకుడు. కలల వెన్నెలలో కాలిపోయే వెచ్చదనం ఫీల్ అవ్వా లంటే ఈ సంపుటిలోని ప్రతి గజల్‌ను మనసు పెట్టి చదవాల్సిం దే. చాలా చోట్ల మీకు మీ అందమైన హృదయం కనపడి ఆశ్చర్యపోతారు. అందం



అందరి దీ. అదే అర్థమవుతుంది ఇది చదువుతుంటే! అందం ఉండేది తొడిమలోనే అని రాయగల తాత్వికత ఈ కవయిత్రికే సొంతం. అడుగు జాడలలో కోల్పోయిన దారులు ఎన్నో ప్రతి గజల్‌లో నేను వెతుక్కున్నాను. చూసుకున్నాను. పూలతోటను సింగారించే చిత్రలిపి కాబట్టే ఈమె గజల్ సొగసుల మొగసాలగా నిలబడి వెన్నెల భాషలో మాట్లాడుతుంది. ఇవన్నీ ఈమె పదాలే.. వేకువ రేఖలై తిమిరాన్ని తరిమేసే అనుభూతి కొన్నిచోట్ల కళ్లారా చూస్తాం. నింగికి రంగుపూసిన కనకాంబరాలను ఎన్ని ఏరుకున్నానో ఈ సంపుటి భూమిలో.. తపస్విని, పగటి వెలుగు అందం ఇక్కడే చూశాను. తపస్విని చుట్టూ ఆవరించిన చీకటిలో ఎన్నో సత్యాలు చూశాను. ఆక్రోశపు అంచున నిలిచి అగాధాల అడవిలో పూల క్రతువునై ఎంత విలపించానో ఒకచోట..

అసలు ఈమెకు ఇంత శక్తి ఎక్కడిది? ఎన్ని దృశ్యాలు చూపిందో.. ఎన్ని అనుభూతుల్ని పంచిందో.. ఎంతగా హృదయాన్ని స్పృశించిందో.. ఈమె గజల్ బాణి!!

దొరికినంత ఆనందం, కనపడనంత మాతృత్వం, శపించలేనంత దైవత్వం.. అన్నింటినీ గుదిగుచ్చి మాటలు మాటలుగా మల్లెలన్నీ గుచ్చి ఆ దండ

భువన మోహనం

'భువన మోహనం' – ఎంత చక్కని పేరు. ఇది నగునూరి రాజన్న రాసిన గేయసంపుటి. ఇందులో 'భువన మోహనా' శీర్షికతో ఓ పాట ఉంది. అందులో కృష్ణలీలలు వర్ణింపబడ్డాయి. **"బుల్లి బుల్లి పాదాల భువన మోహనా / మా చిన్ని కృష్ణయ్యా మము చేరగ రావయ్యా"** అంటూ ప్రారంభమౌతుంది. ఈ సంపుటిలో భక్తి, దేశభక్తి, ప్రకృతి, పర్యావరణం, జీవితం, జానపదం, ఆధ్యాత్మికత, బాలగేయాలు, బతుకమ్మ పాటలు, ప్రణయ గీతాలు ఉన్నాయి. ఈ పుస్తకమనే భువనానికి ఇవన్నీ ఉన్నందుకు కూడ ఇది "భువన మోహనం" అయింది.

ఈ గ్రంథం 'గణపతి గీతం'తో ఆరంభం. కాబట్టి మొదట భక్తిగీతాలనే పరిశీలిద్దాం. ఈ గీతంలో వ్యాసునికి లేఖకునిగా ఉండి మహాభారతం రాసిన గణపతిని గుర్తు చేశాడు. 'ఇనవంశపు ధీరుడా' కవితలో – పట్టాభిషేకం చేస్తామన్నప్పుడు రాముడు ఎంత ప్రసన్నంగా ఉన్నాడో, కానల కేగుమన్నప్పుడు కూడా అంతే ప్రసన్నంగా ఉన్నాడు. భరతుడు బతిమాలినా ఆడినమాట తప్పలేదు. గుహుడిని గుండెకు హత్తుకున్నాడు. భక్తితో శబరి ఇచ్చిన ఎంగిలి పండ్లు తిన్నాడు. నాటికీ నేటికీ రామాయణం ఆదర్శం. 'శ్రీరామ పట్టాభిషేకం' పాటలో 13 చరణాలలో మొత్తం రామాయణమంతా దించాడు. తన అమ్మ నరసమ్మ పల్లవికి చరణాలు జోడించి 'పార్వతీదేవికి మంగళం' పాట రాశాడు. ఈ కవికి ఆంజనేయుడు ఎంత ఇష్టమైతే మాత్రం 'దశావతార భజనగీతం'లో కూడా చివరి చరణంలో ఆంజనేయుని గురించి రాస్తాడా?

ఇక దేశభక్తి పాటల్ని అవలోకిద్దాం. ఇటీవలే మన దేశ స్వాతంత్ర్య వజ్రోత్సవ సంబరాలు జరుపుకున్నాం. **"అణువణువూ పులకరించ తనువంతా మయూరమై – అంబరాల తేలేటి స్వర్ణోత్సవ సంబరం".** మువ్వన్నెల మనజెండా – మురిపించును మదినిండా. **"వందేమాతర మంటూ వరుసకలిపె గొంతులు / జనగణమని పాడెనే జగాన భారతీయులు / నరనరాన దేశభక్తి నగారా మోగించగ / ప్రతివారి గుండెనిండ పండగై నిలిచింది".** ఝాన్సీ లక్ష్మీబాయి – అతివలైనా ఘటికులేనని, మహిళలు మహారాణులని ఆచరించి చూపింది. మాతృ భూమి ఆమెకు మమతల తోరణం. స్వాతంత్ర్యం కోసమని సర్వాన్ని సమర్పించింది. ఆమె సాహసాల మననమే రోమాంచితం అని పేర్కొంటాడు రాజన్న. **"పిట్ట కొంచెం కూత ఘనంలా / పెద్ద కలలనే మీరు కనండి / కార్యదక్షులై కదలిరండి / కలాములాగా ఎదగండి"** అని బాలలకూ నూరిపోశాడు. **"పరాయిదేదీ మనకెపుడొద్దు – మనదన్నది మనం వీడవద్దు"** అని మన దేశ ఉద్దేశాన్నీ స్పష్టపరిచాడు. మనలో నరనరాన దేశభక్తి ఉంది. **"భారతాన కొదువలేదు మహనీయుల ప్రతిభలకు"** అనడానికి చంద్రయాన్ విజయమే తార్కాణం.

ప్రకృతి కవిత్వాన్ని పరికిద్దాం. 'ఏం గొప్ప నీవని' కవితలో – **"అంబరం గొడుగయ్యి ఆదరించేను / సూర్యుడే నిను తట్టి నిద్రలేపేను / చంద్రుడే నీ కొరకు జోలపాడేను / కొండకోనలు దండి దాపుగ నిలువ / నదులన్ని నడిచొచ్చి దాహాలు తీర్చంగ / పశులు పక్షులు నీ పక్షమే చేరంగ / ప్రాణికోటిలో నీకు ఆధిపత్యము నీయ".** నువ్వు మాత్రం సాటి మనిషిని సన్నతించవు అని తెగడుతాడు. పర్యావరణ కాలుష్యాన్ని గూర్చి రాస్తాడు. రసాయనాలు రంగరిస్తున్నాం. ధాన్యరాశి పెరిగిందని చిందులేస్తున్నాం. పిచ్చుకలు ఎందుకు అంతరిస్తున్నాయో ఆలోచిస్తున్నామా? పాలిథిన్‌లతో అవనిని చిందరవందర చేస్తున్నాం. కాలుష్యంతో నీరు విషతుల్యమౌతున్నది. నీళ్ళైనా కడుపునిండా కమ్మగా తాగగలుగుతున్నామా? కల్తీలను పెంచి పోషించే కాలుష్యపు పనులను **"కనిపెట్టుము సోదరా – పనిపట్టుము నిదురపోక" "ఓ మనిషీ మేలుకో / నీ తప్పును దిద్దుకో / పవి త్రంగ భావించు / ప్రకృతిని పూజించు"** అని వేడుకుంటాడు.

ఈ కవిత్వంలోని ఇతర అంశాలు చూద్దాం. రైతును 'ఎవరైనా నీ ముందు దిగదుడుపే నిఖార్సుగా' అని చెప్తడు. పిల్లలకు **'వ్యవసాయమును గమనించండి / రైతు క్షేమమును కోరండి / జవాను వీరుల మరువొద్దు / భరతమాతకు ప్రణమిల్లండి"** అని బోధ చేస్తడు. హోళీ రోజున **"సహజమైన రంగులతో సరదాలు తీర్చుకుంటూ/ గగనపు హరివిల్లును అవనిపైన పూయిద్దాం"** అని, సంక్రాంతి రోజున **"ముత్యాల ముగ్గులు అతివల చేతుల నుండి అమృతమై"** వర్ణిస్తాయని అంటాడు. ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యంను **"పలు భాషల పాటలను / నవరసాలు రంగరించి / అలవోకగ ఆలపించి / మాధుర్యం పంచిన మహనీయు"**డని కొనియాడుతాడు. టీవి సీరియళ్ళు అత్తలకు పెత్తనం ఇస్తాయి, కోడండ్లతో కొట్లాటలు పెట్టిస్తాయి, ఇద్దరేసి భార్యలతో ఇల్లు పీకి పందిరేస్తాయి, ఆడోళ్లకు ఆడోళ్లనే విలన్లుగ చూపిస్తాయి అని ఏవగించుకుంటడు. 'శ్రమ' గురించి రాస్తడు. పేపరేసే బాలుడైనా, పాలు తెచ్చే గోపాలుడైనా **"నీ సౌకర్యం తపనగా తమ స్వేదం చిందిస్తరు".** ప్రత్యక్షంగా కొందరు, పరోక్షంగా ఎందరో మన ఉన్నతికి కారకులు. **"జనమంతకు తిండిపెట్టే తపోధనులు హోలికులు, కన్నోళ్లకు కట్టుకున్నోళ్లకు దూరంగా దేశరక్షణలో తల మునకలయ్యే సైనికులు"** మరి మనమేం చేద్దాం. **"స్వార్థాలను వీడుదాం / సౌభ్రాత్రం నింపుదాం / మనమంతా ఒకటేనని / జగతిలోన చాటుదాం"** అని పిలుపునిస్తడు. 'జీవనసత్యం'లో బాల్యం కౌమారం యౌవనం వార్ధక్యం దశలలో మనిషి జీవితాన్ని వివరిస్తడు. అమ్మ గురించి ఎంత ఆర్ద్రంగా చెప్తాడో చూడండి. **"ప్రాణమైన పోసుకోని పసిగుడ్డను పదిలపరచ / పరుస్తుంది కడుపులోనె కడుమెత్తని పొత్తిళ్లను".** రుధిరం స్తన్యం చేసి శిశువుకు అందిస్తుంది. మాటరాని వయసులో మనసెరిగి కడుపు నింపుతుంది. **"అమ్మంటే దేవుడికి ప్రతిరూపము / అమ్మంటే నీ ఉనికికి నిజరూపము / అందరిని ఆదరించ దేవుడే అమ్మ ఆయె / పరంధాముడే అమ్మై పరవశించి పోయె".** భార్య ఎంత అద్భుతమో, ఎంత ఘనతరమో చెప్తాడు. పుట్టినింట మహరాణిగా వెలుగొంది, ఆదరణ దొరుకుతుందని నిండైన ఆశతో మెట్టినింట అడుగు మోపుతుంది. సతిగా వెలుగులు పంచుతూనే పతిని సదా కనిపెట్టుకుంటుంది.

ఇందులోని ప్రేమపాటలు పాడుకుందాం. ప్రేమ అంకురించగనే పెదవులపై నర్తిస్తుంది. **"ప్రేమంటే ఇదేనేమో – ఇలాగే ఉంటుందేమో / మత్తు ఏదో ఆవరించి మధురిమలను పంచుతూ / సెలయేటి గలగలల జలతారులు మీటుతుందా / అద్దంలో చూసుకొని నాకు నేను మురుస్తానా / ఎవరు ఎవరినో పిలిచినా కోయిలలా పలుకుతానా".** ఊహాసుందరి గురించి పసందైన పాటలు పాడుకుంటాడు. **"కొండ వాలున నిలిచిందా – కొంటెచూపులే విసిరిందా – కనులు మూసినా తన రూపం – కంట నిలి చెనే ఆనందం".** కొన్ని భావగీతాలూ పాడుతాడు. **"పిల్లె తెమ్మెర వీచింది / కొంటె మనసు ఊగింది / మోముపైన ముంగురులు / ముద్దులొలికి నాట్యమాడె / ఇనుమడించిన అందమేదో / చిన్నదాని సొంతమాయె".**

ఇంకా ఈ గ్రంథంలో – కశ్మీర్ అందాలు, హిమాలయాల సొగసులు, పాపికొండల దృశ్యాలు, గోదావరి గలగలలు, కృష్ణవేణీ తరం గాలు, సింధు నదీ విశేషాలు, ఎన్నో దేవాల యాలు ఉంటాయి. ఇందులో ఉన్నవి కొన్ని మామూలు కవితలు, కొన్ని మహత్తర కవితలు. ఎన్‌టిపిసిలో ఉద్యోగం చేసిన వ్యక్తి ఇవన్నీ రాయడం విశేషమే. తనకు కవిత్వంలో మార్గనిర్దేశం చేసిన దాస్యం సేనాధిపతికి ఈ గ్రంథం అంకితమివ్వడం అత్యంత సముచితంగా ఉంది. ముందుముందు రాయబోయే గొప్ప కవితలకు ఈ పుస్తకం నాంది. నగునూరి రాజన్నకు అభినందనలు.



ప్రతులకు : నగునూరి రాజన్న
301, ధరణి టవర్స్, విజేత గ్రీన్ సిటీ, తీగలగుట్టపల్లి
కరీంనగర్–505 001.
ఫోన్ :8332963129

– ఎ. గజేందర్ రెడ్డి,
9848894086

పుస్తక సమీక్షలు

పిల్లలు మెచ్చిన "బడి బువ్వ"

ఏదైన ఒక కథ చదివితే అందులోని పాత్రలు మన చుట్టూనే ఉన్నట్లు అనిపించాలి. అందులోని విషయం పాఠకునికి దగ్గరగా ఉన్నట్లు అందులో లీనమై, కథనంతో మనసు ప్రయాణిస్తూ అరె ఇది నేను చూశానే... ఇది నాకూ జరిగిందే... అనేట్లు ఉండాలి. ఇవన్నీ కలిగి, పిల్లలు చదివి సర్... మన బడిలో కూడా ఇలాంటి అమ్మాయి ఉంది కదా! అని ముచ్చటించుకునే విధంగా, ప్రతి ప్రభుత్వ పాఠశాలలో జరిగిన, జరుగుతున్న విషయాలను, వారి అనుభవంలోకి వచ్చిన అంశాలను తీసుకొని పిల్లలు, పెద్దలు మెచ్చే విధంగా, మనసుకు హత్తుకునే పసందైన పది కథలతో "బడి బువ్వ" పుస్తకాన్ని ఆవిష్కరించారు. బాల సాహిత్య కృషీవలుడు శ్రీ గరిపల్లి అశోక్.

రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏ మారుమూల పాఠశాలలో బాల సాహిత్య కృషి జరుగుచున్నదో తెలుసుకొని, వారిని ముందుతరం పెద్దలకు పరిచయం చేస్తూ వారి సాహిత్యాన్ని అందరికీ పరిచయం చేస్తూ, ప్రోత్సహిస్తున్న పెద్దలు గరిపల్లి అశోక్‌గారు ఎన్నో కార్యక్రమాల నిర్వహణలో తెర వెనుక వారి పాత్ర అభినందనీయం. ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయుడిగా వారి అనుభవాలను కథలుగా మార్చి, నీతి చెబుతున్నట్లుగా కాకుండా, చదివిన ప్రతి విద్యార్థి ఆలోచించే విధంగా, పద్మ పాత్ర తమ చుట్టూనే తిరుగుతున్నట్లుగా ఉపాధ్యాయులు, పిల్లలు తప్పక భావిస్తారు. ఇందులో ఎలాంటి అతిశయోక్తి లేదు.

ఈ పుస్తకంలో ఉన్న పది కథల్లో పెద్దక్క (పద్మ) పాత్ర ముఖ్య భూమికను పోషిస్తూ మనందరిని తన చుట్టూ తిప్పుకుంటూ పెద్దక్క చెప్పింది నిజమే కదా అనిపిస్తుంది. "ఒకరి కోసం అందరు నిలిచే, అందరి కోసం ఒకరు నడిచే" అని శ్రీశ్రీ అన్నట్లు పెద్దక్క పాత్ర ఉంటుంది. నిజంగా ఈ పాత్రలాంటి పిల్లలు ప్రభుత్వ బడుల్లో ఉన్నారా? ప్రతి పాఠశాలలో ఒక్కరైన తప్పక ఉంటారని చెప్పగలను.

"బడి బువ్వ" పుస్తకంలోని కథల్లో భాష నేటి విద్యార్థులు, ఉపాధ్యాయులు మాట్లాడుకునే భాషను సహజంగా ఉండేట్లు రాసారు. "ఎవరు ఏం అనుకుంటారో అని భయపడక, ఎవనికి అర్థమై తదో కాదో అని వెనకడు వేయక, ఏ యాస కోసం, ఏ భాష కోసం పోరాటం చేసి తెలంగాణ రాష్ట్రం తెచ్చుకున్నామో, ఆ తెలంగాణ యాసలోనే రాయడం, నాలాంటి వర్తమాన రచయితలకు మార్గదర్శనం చేశారని చెప్పవచ్చు. కథలు చదువుతున్నప్పుడు గరిపల్లి అశోక్ గారు చెబుతుంటే మనం వింటు న్నామా అన్నట్లుంటది. వారి మాటలే అక్షర పుష్పాలై వాక్యాల మాలలైనాయి. ఆంగ్ల పదాలు కూడా నేటి విద్యార్థుల మాటల్లాగే విరివిగా వాడారు. అందుకే సహజత్వా నికి దగ్గరగా ఉన్నాయి.

డా. నలిమెల భాస్కర్, డా. వి.ఆర్. శర్మ గార్ల ముందుమాటలు చదివితే పుస్తకంలోని కథలన్నీ ఆపకుండా ఒకేసారి చదవాలనిపి స్తుంది. అలా చదివిస్తాయి కూడా ఇందులోని కథలు...

"తొక్కు రాసిన మక్క రొట్టె" కథలో పద్మ పాత్ర మన మనస్సుల్లో చిరస్థాయిగా ఉంటుంది. కవిత తల్లి ఇచ్చిన మక్క రొట్టెలకు తొక్కురాసి స్నేహితులతో పాటు కవిత కూడ ఇస్తుంది. కాని అవి కవిత ఇంటి నుండే తెచ్చినవని ఆమెకు తెలియదు" తొక్కు రాసిన మక్క రొట్టే బాగుంది. చాలా బాగుంది.

ఇలాంటివి మా ఇంట్లో ఎప్పుడు చెయ్యరు. దీని రుచి ముందు ఏవీ పనికిరావు" అంటూ లొట్టలేసు కుంటూ తింటుంది. ఇది ఎలా సాధ్యం అన్నది కథ చదివి మీరే తెలుసుకోవాలి. అదే పెద్దక్క ప్రత్యేకత.

కవిత షర్టుకు గుండీలు పోతయి. వాళ్ళమ్మ గుండీల కోసం వెతుకుద్ది కాని ఎక్కడ లేవు ఎలా అని బాధ పడుతుంటే అక్కడే ఉన్న పెద్దక్క "ఆంటీ నేను తెస్తాను ఉండండి" అని ఇంటికెళ్ళి తన షర్ట్‌కు కాంట పెట్టుకుంటుంది. గుండీలు తీసుకెళ్ళి కవిత తల్లికిస్తుంది. అవి పెద్దక్క షర్ట్ గుండీలన్న సంగతి కవిత తల్లి గమనించదు. పరుల సంతోషమే తన సంతోషం అని పద్మ పాత్ర భలేగా చెబుతుంది. అంటే ఇలాంటివి మనం చేసి ఉన్నాం అని పెద్దలు, పిల్లలు వెనక్కు వెళ్ళి జరిగిన సంఘటనలను గుర్తుకు తెచ్చుకుంటూ నన్ను చూసే రాశారేమో గరిపల్లి అశోక్ సర్ అని ప్రతి ఒక్కరూ అనుకుంటారు.

"పప్పన్నం" కథలో పదవ తరగతి చదివే రమ్య వివాహం జరుగుతుంటే ఉపాధ్యాయులు, పెద్దక్క ఎవరికీ తెలియకుండా ఆ పెండ్లి ఆగేలా చేసి తిరిగి రమ్య చదువుకునేలా చేస్తారు. 'ఆన్నపు కాయ' కథ మనం ప్రతి విద్యా సంవత్సరంలో రెండు మూడుసార్లైనా చూసే సంఘటనలకు అక్షరరూపం అని చెప్పవచ్చు. "బంద్" జరిగినప్పుడు "బడి బువ్వ" లేక విద్యార్థులు పడే ఇబ్బందులను, దూరం నుండి బస్‌పాస్‌ల ద్వారా బడికి వచ్చే విద్యార్థులు 'బంద్' రోజు తిరిగి ఎలా వెళ్ళాలో తెలియకపడే అవస్థలు కళ్ళకు కట్టినట్లు రాసారు. ఇది తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పిల్లల అనుభవాలకు అక్షరరూపం ఇస్తూ, పెద్దక్క ఏం చేసిందో చదివితే మనస్సు ఆనందంతో నిండిపోతుంది. ఈసారి మనం కూడా ఇలాగే చేయాలని నిశ్చయించుకుంటారు.

"కారం కంకులు – తియ్యటి కంకులు" విద్యార్థులు ఖాళీ సమయంలో తల్లిదండ్రులకు ఎలా ఆసరా అవుతున్నారో మనం చూసిన ఎన్నో సంఘటనల్లో ఒక సంఘటనలా ఉంటుంది. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల మానసిక పరిపక్వతను తెలుపుతూ మార్గం చూపుతుంది.

"బత్తాయి పండ్లు" శ్రమ విలువను తెలిపే కథ. "బడిని ఊడ్చి శుభ్రం చేస్తున్న పిల్లల్ని పెద్దలు చదువుకోవడానికి వచ్చి ఈ చెత్త పనులేంటి అన్నప్పుడు పెద్దక్క మాటలు పెద్దల్ని కూడా ఆలోచింపజేస్తాయి.

"ఆపిల్స్" కథలో తన తల్లితో పాటు అందరూ ఉండి ఎవరూలేని అనాథగా హాస్పిటల్ లో ఉన్న అవ్వకు చేసిన సేవలు తోటి వారికి మనవంతు సహాయం చేయ మని చెబుతుంది. "పలకా బలపాలు" ఒక విద్యార్థి కోసం 30 మంది విద్యార్థులకు అన్యాయం చేయలేక సహాయం చేసిన పెద్దలను కూడా కాదం టుంది. అందుకు కారణం చెప్పి ఒప్పిస్తుంది. "పల్లీలు బఠాణీలు" కథలో 'అరేయి ఎంకటి కాకెంగిలా? చేపెంగిలా?' అని చదివేటప్పుడు పెద్దలు కూడ వారి బాల్యంలోకి వెళ్ళి ఆనందిస్తారు. పిల్లలు మళ్ళీ మళ్ళీ చదువుతారు. తరగతుల వారిగా ఏం జరుగుతుందో చెప్పడం భలే బాగుంది.

పిల్లలను, పెద్దలను ఆలోచింపజేస్తూ ఆనందింపజేస్తాయి "బడి బువ్వ'' కథలు. ''మాసార్లు జరమొచ్చినా బడికి వస్తరు. సెలవులు పెట్టడానికి ఇష్టపడరు. రోజూ బడి ఉండాలని కోరుకుంటారు" అంటూ పెద్దక్క మాటలతో గురువుల బాధ్యతను మరింత పెంచారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ''బడి బువ్వ'' ఎంత అవసరమో చెబుతూ రాసిన కథలు పిల్లలు మెచ్చేవిగా, మళ్ళీ మళ్ళీ చదివేలా ఉన్నాయి. నీతిని, మంచిమాటను వెన్నముద్దలా మార్చి తినిపించిన గరిపల్లి అశోక్ గారికి అభినందనలు.

ప్రతులకు:
గరిపల్లి అశోక్
సెల్:98496 49101

– సయ్యద్ షఫీ
9949273063

సామాజిక అంశాలతో "కైరవ శతకము'

నీతి అనేది నిత్యం మారుతుంటుంది. మనకు ఎదురయ్యే పరిస్థితుల దృష్ట్యా, ఆ సమయంలో ఉన్న అనుకూలతల దృష్ట్యా నీతి తన స్వరూపాన్ని మార్చుకుంటూ ఉంటుంది. కానీ నిజాయితీ అనేది మనతో పాటు పుట్టి, మనతో పాటే మరణిస్తుంది. శరీరానికి అంటుకుని ఉన్న చర్మమైనా వయోరీత్యా మారిపోతుంది. కానీ నిజాయితీ అనేది నరనరాన ప్రవహించే నెత్తురులాంటిది. సమాజాన్ని అనుసరించి నీతి, స్వభావాన్ని అనుసరించి నిజాయితీ రెండూ మనకు దివ్యజ్యోతుల్లా మనల్ని కావలి కాస్తుంటాయి. అవి కోల్పోయిన నాడు మనిషి అంధకారంలో శాశ్వతంగా ఉన్నట్లే..

శతకాలలో ఎందరో మహాకవులు, పండితులు నీతులను బోధించారు. వాటినే కాలానుగుణంగా పరిస్థితులను, పాఠకుల మనోవిజ్ఞానాలను దృష్టిలో పెట్టుకుని మళ్ళీ మళ్ళీ చెబుతూ శతకాలు వర్ధమానులు, ప్రముఖులు రచిస్తూనే ఉన్నారు. కారణం ఎప్పుడూ చదవని వ్యక్తి కనీసం ఒక్కసారైనా చదివితే తమ ఆలోచనా విధానంలో ఏదయినా లోపం ఉంటే మార్చుకుంటాడేమోననే ఆశ కవులకు అంతే.. సమస్యను బట్టి కవి స్పందన ఉంటుంది. కాకుంటే కవి నిర్మొహమాటంగా చెప్పడంలోనే పాఠకులకు ఆకర్షితమవుతుంది. కవి వేణుశ్రీ రచనా శైలి కాస్తంత భిన్నంగా సాగింది. సమాజంలోని అసమానతల్ని రూపుమాపాలని, మాయమాటలు, అబద్ధాలు లేని సమాజం కావాలని, నిత్యం ఏవేవో గొడవలు సృష్టించుకుని, దాన్ని రూపుమాపాలని కూడా వారే తిరగబడుతున్న తీరు మారాలని ఆశించే సమాజం కావాలని, బాధ్యతలను మరచిన యువతరం తమ బాధ్యతను ఎరిగి ప్రవర్తించాలని తమ రచన ద్వారా ఆకాంక్షించారు. ప్రపంచంలో ప్రతి సమస్య కవిత్వంతో రూపుమాపవచ్చని అభిలషించారు.

ప్రతి మనిషి తనతో ఈ సమాజం సమసిపోదనే విషయం గ్రహించాలని, తర తరాలకు మంచి సమాజాన్ని అందించాల్సిన బాధ్యత మనపై ఉందని వివరించి చెప్పారు. సమాజంలోని సూక్ష్మ విషయాలన్నీ వెలికి తీసి వాటిని తూర్పార పట్టడంలో తమ నైపుణ్యత కనబరిచారు. అగస్త్యుని కథ, బలిచక్రవర్తి కథ, వాలి కథ, ఋష్యశృంగుని కథ, గయోపాఖ్యానం, సీతా వనవాసం, వంటి పౌరాణిక ఘట్టాలను వివరిస్తూ వాటితో సమాజంలో జరిగే దుస్సంఘటనల్ని పోల్చుతూ రచించిన తీరు ఎంతో ప్రశంసనీయం. వీటితో పాటు ప్రకృతి సహజంగా దొరికే నీరు, ఉప్పు, నూనెలు కల్తీలలో పడి సమాజంలో అనేక రోగాల బారిన పడి ఎంతగా దుస్తితికి చేరుకుంటున్నాయో వివరించారు. వీటితో పాటు పెద్ద కంపెనీల పేర్లతో వారు చేసే మోసాలు, ఎందుకు కొరగాని వ్యవసాయ చట్టాలు, పత్రికా రచయితల స్వార్థం, సోషియల్ నెట్‌వర్క్ చేసే దారుణాలు వంటి విషయాలన్నీ వీరి శతకంలో ప్రస్తావించబడ్డాయి. కనుమరుగై పోతున్న కులవృత్తులు, నిర్లజ్జగా సాగుతున్న మారణ హోమాలు వంటివి కూడా ప్రస్తావించడమే కాదు ఎలా చేస్తే ప్రజలకు మేలు జరుగుతుందో అనేది కూడా వివరించడం ఎంతో సమంజసంగా ఉంది. అందరూ చదవదగిన గ్రంథం ఇది. కవి వేణుశ్రీకి అభినందనలు.



ప్రతులకు: వేణుశ్రీ
83280 67855

–శైలజామిత్ర
9290900879

అదే సాయంత్రం

ఊరిబైట
దినకరుడు చెరువులో దిగితే
క్షణంలో బంగారుకాంతి వెలుగులో
సాయంత్రం బాగుందని
దారిమీద
ఇరువైపుల దీపాలు వెలిగితే
నిమిషంలో నియానకాంతి జిలుగులో
సాయంత్రం బాగుందని
రిటైర్డ్ మిత్రులు
ఫ్యాక్టరీ నుండి
చెమటగంధం పూసుకొని
విడుదలైన ఉద్యోగ మిత్రులు
వీక్షణలో ఆశారేఖలు లేక
లోపల
మాటసాయం
చేతిసాయం చెబద్లుసాయం
దొరక్క నిరాశలో నిలబడ్డ
అదే సాయంత్రాన్ని ఆస్వాదించలేదు
వాళ్లకి
తెరల సాయంత్రం
చెరల సాయంత్రం
సమిష్టి శ్రేయస్సు కోరని
దొరల సాయంత్రం

– కోటం చంద్రశేఖర్
9492043348

రెక్కలు విరిగినా..!

రెక్కలు విరిగినా...
పయనం ఆపని కాలం
అల్లంత దూరాల ఆశయాలపై
ఆశలు పెంచుకుంటూనే ఉంటుంది..
రెక్కలు విరిగినా..
శ్రమను మరువని భుజాలు
ఆకలి కేకల ఆపుదలకై
చెమట చుక్కలు
చిందిస్తూనే ఉంటాయి...
రెక్కలు విరిగినా..
అన్యాయాలు సహించని గొంతుకలు
అక్రమాలపై ఆయుధమెత్తి
ఉద్యమాల బాట
పడుతూనే ఉంటాయి...
రెక్కలు విరిగినా..
కాల చక్రంలో బంధింపబడ్డ ధర్మం
ధైర్యం కూడగట్టుకొని
జయ కేతమెగరేస్తూనే ఉంటుంది..
రెక్కలు విరిగినా..
నెమరు వేసుకోలేని జ్ఞాపకాలు
పాత గాయాలకు మరుపు ఔషధం
పూసి
అచేతనంలోకి నెట్టేస్తూనే ఉంటాయి..!

–యర్రాబత్తిన మునీంద్ర (చైత్రశ్రీ)
8331844527

అన్నదాత

భూమి నుండి
బువ్వను సృష్టించేవాడు
పచ్చదనంతో
ప్రాణవాయువు పంచేవాడు
మట్టిని నమ్ము కున్నవాడు
మనిషిని నమ్మి చెడుతున్నాడు.
నకిలి విత్తనాలతో నలిగి పోతున్నాడు
కల్తీ ఎరువులతో కలవర పడుతున్నాడు
బాధల గాధల మయం
అన్నదాత జీవితం
ఎప్పుడు మారుతుందో అన్నదాత జీవితం
ధరణి నుండి
ధాన్యం సృష్టించేది రైతులు
ధరలను నిర్ణయించేది
అధికారులు దళారులు
ఇదెక్కడి న్యాయమో అర్థం కాదు
ఏ వృత్తిలోను
ఈ విధానం కానరాదు.
అన్నదాతల ఆక్రందన
అవుతున్నది అరణ్య రోదన
సమస్యల మయం అన్నదాత జీవితం
పరిష్కరించే ప్రభుత్వం కోసం
నిరీక్షణం
అన్నదాత క్షోభిస్తే
దేశం దుర్భిక్షం
అన్నదాత సంతసిస్తే
దేశం సుభిక్షం

– బూర దేవానందం
8143589789

సందడి చేద్దాం..!

పూల వనంలో పువ్వుల్లా
రండోయ్..సందడి చేద్దాం.
నాట్యం చేసే నెమళ్ళుల్లా
రండోయ్.. సందడి చేద్దాం.
గానం చేసే కోయిలులా
రండోయ్.. సందడి చేద్దాం.
మాటలు నేర్చిన చిలుకల్లా
రండోయ్..సందడి చేద్దాం
పూల పై వాలే తుమ్మెదలు లా
రండోయ్.. సందడి చేద్దాం.
చిటపట కురిసే చినుకుల్లా
రండోయ్..సందడి చేద్దాం.
మిలమిల మెరిసే తారల్లా
రండోయ్..సందడి చేద్దాం.
గలగల పారే సెలయేరుల్లా
రండోయ్..సందడి చేద్దాం.
గబగబ బడికెళ్ళే పిల్లల్లా
రండోయ్..సందడి చేద్దాం

–కయ్యూరు బాలసుబ్రమణ్యం
7780277240

నాటి మేటి పాట

కృషికి నిలువెత్తు నిర్వచనం 'దువ్వూరి'

'దండము శాస్త్రధీమతికిన్ దండము కావ్య కళావిభూతికిన్' ఈ పద్య పాదం ఒక్కటే మిగతా మూడు పాదాలు ఎవ్వరూ రాయలేదు. ఇదొక విచిత్ర సంఘటన. ఒక గ్రంథాలయం లో ఒక శతావధాని చుట్టూ కొంత మంది యువకులు చేరివున్నారు. అందులో కొందరు కవిత్వం ఎలా రాయాలని ఆ పండితున్ని ప్రశ్నిస్తున్నారు. సమాధానంగా అతడు ఇలా అన్నాడు – కవిత్వం మీరను కున్నంత సులభం కాదు. అది జన్మ సంస్కారం వలన వసుంది. అంద రూ రాయలేరు.' అని. పాపం ఆ యవకులు నిరుత్సాహ పడిపో యారు. ఇదంతా ఓ మూల కూ ర్చొని వింటున్న 19 ఏళ్ళ యువ కుడు నేరుగా ఆ పండితుని దగ్గరకు వచ్చి ' మీరు చెప్పింది నిజం కాదు. పట్టుదల , కృషి వుంటే ఎవరైనా కవిత్వం రాయవచ్చు. అని ఏవేవో వాగుతున్న ఆ యువకుని చూసి అవధానికి కోపం వచ్చింది. నన్నే అవమానిస్తాడా అన్న ఆక్రోషం తో. 'ఇన్నిమాటలంటున్నావు నీవు రాసి చూపించు చేతనైతే. ఢాంబికాలెందుకూ అని కోప్పడాడు. ఆ కుర్రాడికి నిజానికి ఏమి రాదు. బెంబేలెత్తి పోయాడు. నోట మాట రాలేదు. అవమానమనిపించి ఒక మూలకు వెళ్ళి పోయి ఎలాగైనా పద్యం రాయాలని భీష్మించుకొని తను చిన్నప్పుడు చదువుకున్న గజేంద్ర మోక్షం, రుక్మిణీ కళ్యాణం లాంటివి గుర్తుకుదెచ్చుకొని నానా తిప్పలు పడి పట్టుదల విడవకుండా పై ఒక్క పాదాన్ని రాసి ఆ పండితునికి చూపించాడా పిల్లవాడు. అది చదివిన అవధాని అవాక్కయ్యాడు. ఆ పాదంలో వున్న పద లాలిత్యం, శబ్దసౌమ్యత పండి తున్ని ఆశ్చర్య పరిచాయి. వెంటనే ఆ అబ్బాయిని కౌగిలించుకుని నీవు బాగా ప్రయత్నించు భవిష్యత్తు లో గొప్ప కవిగా రాణించ గలవు అని ఆశీస్సులు అందించారు ఆ అవధాని. అదే సాధనా మంత్రమై భవిష్యకాలంలో గొప్పకవిని చేసింది. ఆ కుర్రాడు ఎవరో కాదు 'కవి కోకిల' దువ్వూరి రామిరెడ్డి. ఇంతకూ అతడు చదివింది 8వ తరగతి మాత్రమే. అతడే అత్యల్పకాలంలో నమ్మశక్యం కానంత ఉన్నత శిఖరాలను అందుకొని తెలుగు సాహిత్యానికి ఎనలేని కీర్తినార్జించి పెట్టినాడు. దువ్వూరి రామిరెడ్డి నెల్లూరు జిల్లాలోని గూడూరు సమీపంలోని పెమ్మపాలెంలో 09 నవంబర్ 1895 న వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. అందుకే వ్యవసాయ వ్యవహారం కూడా కొంత కాలం చూసుకొన్నాడు. దాని ఫలితమే 1924లో 'కృషీవలుడు' పద్యకావ్య రచన. ఇది రైతు జీవనాన్ని వ్యవసాయ స్థితిగతులను, తెలియజేసే కృషి ప్రధానమైన మొట్టమొదటి పద్యకావ్యం. అదే ఏడాది సరస్వతీ భాండారము వారిచే కొన్ని పదాలు సవరించి మరి కొన్ని కొత్త పదాలను కూర్చి ద్వితీయ ముద్ర గా ప్రచురింపబ డింది. ఈ కావ్యాన్ని తన మిత్రుడైన మన్నెము శేషరెడ్డికి అంకితమిచ్చాడు. ఇదే కావ్యానికి ప్రముఖ విమర్శకులు కట్టమంచి రామలింగారెడ్డి గారు గొప్ప ఉపోద్ఘాతము వ్రాసినారు. తన 19 వ ఏట నే ఆరంభించిన కవితా వ్యాసం

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1003వ రోజు "పత్రికలు" అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. "పత్రికలు" అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా...
-సంపాదకులు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం
ఏకాంశ కవిత్వం నిర్వహణ:
-డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839

ఆల్ ఇన్ వన్

రంగు రంగుల ముగ్గులు
చేతిలో చిక్కే సింగిడీలు
చూడగానే కళ్ళల్లో
కోటి కాంతుల తళతళలు
మెదడులో విచ్చుకునే
శాస్త్ర సాంకేతిక రంగాల పొరలు
పరమాణువు మొదలు
పరమాత్మ దాకా
కళ్ళముందు దర్శింప జేసే పత్రికలు
ప్రతీ ఇంటా
ఆప్యాయంగా పలకరించే పుత్రికలు
పాఠకుల చేతుల్లో ఒదిగిపోయి
చేస్తారు ఉపన్యాసాలు.
మిత్రులకన్నా మిన్న
ఆత్మీయతను పెంచే
అలసటను పోగొట్టే
వినోదాల హరివిల్లు
ఒంటరితనం దూరం దూరం
కార్టూన్లు జోకులు
చిన్న పెద్దల
హా..హా..హా.నవ్వుల్తో ఇల్లంతా
మతాబులు
రవ్వలు
పదవినోదం
పజిళ్లు
పెడతాయి పదును బుర్రకు
హాస్య వ్యంగ్య చిత్రాలు
రచనల్తో చురకలు.
చిన్నారుల భావాలకి
చిట్టిచేతుల చిత్రాలకి అవకాశాలు
గృహ వైద్యం చిట్కాలతో
చిటికి మాటికి
వైద్యుల దగ్గరకు
పరుగులకి అడుకట్టలు.
ఒంటరితనం పోగొట్టి
ఓదార్పు సలహాలు ఇచ్చే
మంచిమిత్రులు పత్రికలు
ప్రతిబడిలో చదివించాలి
భాషపై అక్షరాలకూర్పు
భావాల మార్పుకై పత్రికలు
ప్రతి ఇంటా పత్రికలు
పలకరింపులతో ఆప్యాయత
ఆనందం పంచే పుత్రికలు.
-ఎ.రాజ్యశ్రీ

దివిటీలు

రేడియోలు కూడా
లేని కాలంలో ఈ పత్రికలే
టీవీలు కూడా రాని కాలంలోనూ
అదే పత్రికలే
రాతలు బహు రంజింప చేసిన
బంగారు కాలమే
తెలుపు నలుపు నుంచి
మారిన రంగు పత్రికలు
కాల గమనంలో గమనం తప్పిన
మన పత్రికలు
పార్టీలకు మద్దతుగా
మారిపోయిన మన పత్రికలే
చరవాణి తాకిడికి
ఎంతమాత్రం బెదరని పత్రికలు
సాంకేతిక యుగంలో
ఎన్ని సాధనాలున్నా
విజ్ఞాన కేంద్రంలా ఉంటూ
వినోదం పెంచిన పత్రికలే
పత్రికలు మాత్రమే
అప్పుడు ఇప్పుడు ఎప్పుడూ
దేశ ప్రగతికి మార్గం నిర్దేశించి
దర్శకత్వం వహించి
నాయకుల నక్క జిత్తులను
నిగ్గు తేల్చాలీ పత్రికలే
స్వార్థ రాజకీయాలు కొంత మాని
దేశ కీర్తిని చేతబూని
గట్టి మేలు తలపెట్టి
నమ్మకాన్ని మమ్మ చేయకుండా
మధ్యవర్తిత్వం వాస్తవత తీసుకుని
ఆదర్శ ప్రాయంగా
దేశ ఆర్థిక పురోగతికి
ధివిటీలై వెలగాలి
జనవిజ్ఞాన వేదికలా నిర్మితమై
జన రంజకంగా మారాలి
నైతికత నింపుకొని
ధర్మాన్ని సదా కాపాడాలి.
-బొల్లి రామస్వామి రఘుపతి

మెదడుకు పదును

విజ్ఞానాన్ని అందించేవి
ప్రపంచంలోని
వార్తలన్నీ తెలియజేసేవి
భాషా పరిజ్ఞానాన్ని పెంచేవి
ఒకరికొకరు
పరస్పర పరిచయాన్ని
పెంపొందించేవి పత్రికలు.
విజ్ఞానం తో పాటు
వినోదాన్నిఅందినీచేవి
మాస, వార పత్రికలు,
ఉపయోగించుకోవాలి మనం మరచిక
టూరిస్ట్ పెట్టాలి
చిట్ ప్రచారాలు.
ఒంటరితనాన్ని పోగొట్టి,
స్నేహం పంచుతాయి పత్రికలు
టెలివిజన్, చరవాణి లాంటివెన్ని ఉన్నా
మెదడుకు వ్యాయామం పత్రికలే!.
రోజుకొక్క పేజీ చదివినా చాలు,
విజ్ఞానం, వినోదంతోపాటు,
మెదడుకు, మనసుకు
వ్యాయామం చేసినట్టయి
మానసిక వికాసం పొనీదవచ్చు.
-అరుణ కోదాటి

సర్వాంతర్యామి?

పదహారవ శతాబ్దం నుండే
పయనం రాతప్రతులుగా
పలురకాలుగా ఫరిడవిల్లి
విశ్వంలో పంచుతున్నవి విజ్ఞాన వీచికలు.
ప్రజాస్వామ్య పాలనలకు పట్టుగొమ్మలై
ప్రజల గొంతుకగా ప్రతిధ్వనిస్తూ
ప్రశ్నలను సంధిస్తూ
ఎప్పటికప్పుడు
పట్టాలు తప్పకుండా
పాటుపడుతుంటాయి.
నిత్యత్ర ఉలకరిరిచే దినపత్రికలు
వారం వారం ముచ్చటించే వారపత్రికలు
మాసానికో చుట్టమయ్యే మాసపత్రికలు
మహిళలకు మాత్రమే ప్రత్యేకం
మహిళాపత్రికలు
అన్నీ ఆ హంసవాహిణి
మానసపుత్రికలే.
చదువు సంధ్యల జాడలతో
ఉద్యోగావకాశాల సుడులతో
మానసికోల్లాస కథలతో
పదవినోదాల పందిళ్ళతో
పెళ్లి పేరంటాలకు పెద్దమనిషిగా
న్యాయసలహాల సంప్రదింపులకు
ఆరోగ్య రక్షణ సిద్ధులకు
ఆహార్యాల ఖరీదాలకు
అది ఇది తేడా లేకుండా అన్నింటినీ
మోసుకొచ్చే విజ్ఞాన భాండాగారం
చీకటి వెలుగుల సంధికాలంలా
ఓ వెలుగు వెలిగిన పత్రికలు
పూటపూటకు పూరించిన శంఖంలా
దృశ్య శ్రవణ దూరవాణిలతో
గంటగంటకు నవీకరణలతో
నెట్టు ప్రపంచంలో పిట్టగోడలా
అరచేతిలో అస్త్రమైన చరవాణిలతో
కొంత కష్టకాలాల నిష్ఠూరమే నేడు.
-నగుమూరి రాజన్న

పదునైన వ్యవస్థ

ప్రపంచంలో ఎన్నో
వింతలు విడ్డూరాలు
నేరాలు ఘోరాలు
ప్రపంచంలో జరిగే సమస్త సమాచారాన్ని
క్షణాలలో మోసుకొచ్చే అక్షరవ్యవస్థ
విశ్వంలో విజ్ఞాన వీచికలే
అక్షరాలు కవితలు కూడా
అందుబాటులో
చెరుని
ఎండగట్టగల సామర్థ్యం
రాజకీయ నాయకులకి
దడ పుట్టించే పత్రిక లు
సమాజంలో ప్రధాన పాత్ర
అందర్నీ చైతన్య పరిచే పత్రిక

విశ్వదర్శిని

ఉషోదయం తోనే
వాకిటవాలే బుర్రుపిట్ట పత్రిక
వార్తల కువకువలూ
కాలక్షేపం కబుర్లు
వ్యాపారప్రకటనల జిమ్మిక్కులు, చిత్రాలు
మహానుభావుల ప్రతిభలూ
జ్ఞాపకాలు!
సామాన్యుల మనో దర్పణం పత్రిక!.
ముఖ్యావసరాల గురించి అప్రమత్తత
ప్రపంచం చిత్రపటం ఆవిష్కరణ
క్రీడా విశేషాలు
వైద్యసలహాలు
సంక్షేమ సౌకర్యాలు
ఒకటేమిటీ...
ఒద్దికగా వొళ్ళుపరుచుకునే పత్రికలు!
మంచిచెడుల బేరీజు శక్తినిచ్చిన
కాశీనాథుని నాగేశ్వరరావు
అమృతానీ'జనం'
ఆంధ్రపత్రికా వరం!
ప్రతి పౌరుడు
ప్రతి విషయం
నాకు తెలియాలి, తెలియాలి అనుకునేలా
ఒక్క రోజు పేపర్ చదవడం లేకుంటే
రోజంతా అసంతృప్తి సెగ!.
చిరిగిన పత్రికలు సైతం
చిత్తుకాగితనీ వ్యాపారం గా
ఇంట్లో గృహిణికి
కాగితం ముక్కలతో
మెంతులు నానేసి
రుబ్బి చెంబు మౌల్ట్ తో
బుట్ట చేసే సంప్రదాయ చాకచక్యం!.
పొర్కు, సముద్రం, గుడి, సంత
ఎక్కడైనా..
పళ్లి, సమోసాల వ్యాపారం సాగే
కాగితం పొట్లం!
చిరు వ్యాపారికి చిన్ననవ్వుగా
టిఫిన్ సెంటర్ టికానా పాత పేపర్లు!!.
- ఎం. వి. ఉమాదేవి

వాస్తవాల ప్రతిరూపం

పత్రికలు
సకల సమాచారాన్ని
సమకూర్చి అందిస్తాయి జనావళికి
విజ్ఞానాన్ని అందిస్తూనే
వినోదాలకు తావు
దినపత్రిక కోసం
చేతువజామునే
ఎదురు చూపులు
పత్రిక కనబడిందంటే పట్టుపట్టుడే
మొదటి పేజి నుండి
చివరి పేజి వరకు
అక్షరం విడవక చదువడమే
వార్తలపై నిత్యం
వార్తా మిత్రులతో చర్చించడమే
కాలక్షేపానికి సైతం ఉపయోగం
ఒంటరి ఛారికి జంటగా
నేటి వార్తాపత్రిక
రేపటి చిత్తు పత్రిక అయినా
పేపర్ కవర్ తయారికి
ఉపయోగం
చాటలు గంపల పూతలకు
ఉపయోగం నాడు
పేపరు చదివేందుకు, చావడి కాడ
పోగయ్యేవారు జనం అనాడు
పేపరు చదివిన వారు
ఇతరులతో చర్చ చేసే విధానం
చూడ ముచ్చటగా
విన సొంపుగా ఉండేది
దినపత్రికలతో పాటు
వార మాసపత్రికలు
విజ్ఞానంతో పాటు
వినోద సాధనాలు
వార్తాపత్రిక వర్ధిల్లాలి కలకాలం.
విజ్ఞాన వినోదాల కేంద్రం కావాలి
వాస్తవాలకే ప్రతిరూపంగా నిలవాలి
అభూత కల్పనలు కనబడొద్దెక్కడా
అద్దంలో ముఖం కనపడ్డట్టు
వార్తాపత్రికలో వాస్తవాలే కనబడాలి.
-గుండం మోహన్ రెడ్డి

తెల్ల వార కుండానే
ఇంటి ముంగిట్ల దర్శనం
చదువు చదువు అంటూ ఊరిస్తూ...
-మోటూరి శాంతకుమారి

బాలల నుండి పెద్దల దాకా

అక్షరాలు
కాగితంపై పరుచుకొని!
వార్తా పత్రికై
ప్రతి ఇంట
పాఠకులకు
ఉదయ చైతన్య.
లోక జ్ఞాన వీచికై
మనో వికాసం పరిపుష్టం.
పుట్టెడు సాహిత్యం
కథలు
కథానికలు,
నాటికలు
గీతికలు
నవరస అంశాలు!
పత్రికలో సుశోభితం
బాలల నుండి
పెద్దల దాకా
జనరంజకం.
-జాలిగామ నరసింహారావు

బ్యాండు మేళాలు

గతకాలపు చరిత్రను
నిక్షిప్తం చేస్తూ
నిన్నటి ప్రపంచాన్ని
ఈరోజు చూపిస్తూ
చూడలేని ప్రాంతాలను
కళ్ళముందుంచుతూ
రాబోయే భవిష్యత్తుని ఊహించి
మధ్యలోని భావాలకు అద్దం పట్టేవి.
వేగంగా వచ్చి
సూర్యుడికళ్ళు తెరిపించి
ఆతృతపడే కళ్ళకు
స్వాంతన చేకూర్చేవి.
చీమచిటుక్కుమన్నా
గాలి స్తంభించినా
సముద్రాలు ఉప్పొంగినా
ప్రకృతి ప్రకోపించినా
ప్రమాదాలు సూచిస్తూ
పరిణామాలను అందించేవి.
ఏదేశంలోనైనా
ఏమూలకైనా
ఏం జరిగినా
ఏమరుపాటన్నది ఎరుగక
గాలితో పోటీపడి
భూగోళం చుట్టేసి
విజ్ఞానంతో పాటు
విషయాలను తెలిపేవి.
ప్రపంచంలోని పండుగలను
ఆచారవ్యవహారాలనూ
ఆడుకునే ఆటలనూ
పాడుకునే స్వరాలను
గంతులేసే నాట్యాలను
ఏరి కూర్చి మోసేవి
అందరి కళ్ళకు అందించి
సంతోషం పంచేవి.
నిన్నటివరకవి,
ఫక్షపాతమెరుగక
కుడిన్ని కుడిగానే
చూపే అక్షర దర్పణాలవి.
నేడవే
నిస్వార్థం కనుమరుగయ్యి
భావాలు కుంచించుకు పోయి
మనిషికీ మనసుకూ
అడ్డుగోడ ఏర్పడి
నికార్సైన పనికి బదులు
నిజాలను తొక్కేస్తూ.
తామరాకు నీడు
దూది దుప్పటై
ముట్టుకునేందుకు
భయమయ్యే స్థాయికి దిగజారి
బాకాలూదే
బ్యాండుమేళాలయ్యాయి.
-గుర్రాల వేంకటేశ్వర్లు

మంచి వార్త తెచ్చు మహనీయ పత్రిక

తే.గీ. జ్ఞానమందించు పత్రిక ఘనము ఘనము
అప్పుడప్పుడు చదవాలి నార్తితోడ
విశ్వమంతట చేరును వినుము తమ్మి
ఆదరించుము వానిని నాదరముగ!.
తే.గీ. మారుమూలన జరిగిన మంచివార్త
ఇంటివరకును తెచ్చును నీదుకొనుచు
చదువువారలు శ్రేష్టులు సంబరంబు
గడుపుచుండురు కాలంబు ఘనముగాను!.
-జక్కని గంగాధర్

నాగన్న పదాలు

తరుల వల్లె జలము
జలము వలనే జనము
జనముంటేనే జగము
ఓరి! నాగన్న.

అందమైనది బొమ్మ
గృహ అధిపతి గుమ్మ
తనువు నిచ్చెను అమ్మ
ఓరి నాగన్న.

సాగు చట్టాల హోరు
కర్షకులతో పోరు
సర్కారుకు బేజారు
ఓరి నాగన్న.

పుతిన్ నిజ ఆక్రోశం
ఉక్రెయిన్ విధ్వంసం
నియంతల క్రౌర్యం
ఓరి! నాగన్న.

నిలువదురు ఈ ఘరం
చేయ బోకుర హటం
నీవు చేరర మఠం
ఓరి! నాగన్న.

పండగ చేరె దరికి
చెల్లె కట్టె రాఖీ
నేను సదా బాకి
ఓరి! నాగన్న.

పనిలో అహంకారం
గుండెలో మమకారం
"మనిషి"కి శ్రీకారం
ఓరి! నాగన్న.

మామిడికాయ చెక్కు
వక్క కాయల తొక్కు
అన్నంల కలిపి మెక్కు
ఓరి! నాగన్న.

పెంట వలన పంట
పంట వలనే వంట
వంట తీర్చెను మంట
ఓరి! నాగన్న.

అందమైనది ముగ్ధ
సమత కోరె స్నిగ్ధ
మమత కరువై దుగ్ధ
ఓరి! నాగన్న.

చెట్లు పెట్టెను ఇగురు
కోకిల మెక్కె చిగురు
పొలతి కేల పొగరు
ఓరి! నాగన్న.

నింగినందు చుక్కలు
నేలపైన మొక్కలు
విరిసి మురిసి దిక్కులు
ఓరి! నాగన్న.

రోజు రోజుకు ధరలు
పెరుగు చుండెను గిరులు
ప్రాక లేరుర ప్రజలు
ఓరి! నాగన్న.

గొల్లకొండ కోట
తనీషా ఎలెనట
రామదాసు చెఱనట
ఓరి! నాగన్న.

ఉస్మాన్ అలీఖాన్
విశ్వ విద్యలభవన్
యూనివర్సిటీ నిర్మాన్
ఓరి! నాగన్న.

ఘర్ మే పాన్ ధాన్
దక్కన్ ఖాన్ దాన్
విశ్వానికేర షాన్.
ఓరి! నాగన్న.

కాళేశ్వర నీళ్లు
కర్షకుల పరవళ్లు
పొలాలలో నాగళ్లు
ఓరి! నాగన్న.

అందమే సుగంధము
పలకే మకరందము
జీవితమొక పందెము
ఓరి! నాగన్న.
-నెమలికొండ నాగేశ్వర్ రావు
8688553470

అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక వికారాబాద్ వారం వారం నిర్వహిస్తున్న వాట్సప్ కవిసమ్మేళనంలో భాగంగా ఈ వారం 'కార్తీక పౌర్ణమి' శీర్షికలో వచ్చిన కవితల్లో మేలైనవి కొన్ని..
నిర్వాహకులు -కమలేశ్
-దోరవేటి, అనంత వ్యవస్థాపకులు

ఓం నమః శివాయ !!!

శరదిందుప్రభలన్ జగంబునకు
ప్రాశస్త్యంబుగా నీయ న
క్షర రూపంబుగ గానిపించెడి
సురక్షానంద సంధాయకా!
నిరతంబున్ కృషి సల్పు
సత్కవుల హృన్నీధిన్ కళాత్మప్రభన్
స్థిర గాంభీర్యము నిల్పు శక్తివి
శివా! శ్రీకంధరా! సుందరా !!!.

చలిమల యల్లుడా! యనుచు,
చల్లని మానస వీధి పంచు ని
శ్చల మతులై భజింతురు
విచారధురీణులు భక్తిశక్తి పెం
పిల్లగ ముగ్ధ మానసులు
ప్రేమగ వారిని జూచి దీవెనల్
వెల్లువగా నొసంగు దయ
వెల్లగ చంద్ర కళాధరా! శివా !!!.

నీవు సమస్త రూపమవు నీ
దయజూడ యనంత దీప్తి నా
కేవి యొసంగగా దగునొ యేర్పడ
జెప్పెడివాడ గాను నీ
దీవెన దేది యయ్యిన నదే
పరమామృతమయ్య, నన్ను నీ
వేవిధి సాగనిచ్చిన సమీప్సిత
మంచు ధరింతు శంకరా!!!.

సర్వాలంకృత సర్వభూత హిత
విశ్వానంద సంబంధమే
శర్వా ! నీ స్థితి, నీదె పోషణ,
లయించన్ నీదె వాల్లభ్య మీ
నిర్వాణంబుకు నీదె బాధ్యత గదా,
నీ యాజ్ఞ తోనే మహిన్
గర్వంబందక నేగు శక్తి నిడు
గంగాధారి ! కైమోడ్చెదన్ !!!

లింగ రూపుడ వంచు నిన్ను
వరించి పూజ నొనర్తు; రే
యంగమే గనరాని శూన్యము
వంచు నిన్ను దలంతు; రా
శృంగమౌ హిమవత్సుతా పతి,
శ్రీకరా నిను గాంతు; రో
సంగమేశ్వర! యేమెరుంగని
సావధానిని నేనయా !!!
-దోరవేటి
8978871961

కార్తీక పౌర్ణమి

భూలోకాన దీపాలు
మిలమిల మెరుస్తున్న వేళ
ఆకాశాన తారలు
వెలవెలబోతుంటాయి చాలా
అది
కార్తీక పౌర్ణమి రోజే
కనిపించే లీల
భక్తులు పరవశించే ఆ రోజు
వాయువులు పవిత్రమవుతాయి
హరిహరులకు ప్రీతికరమైన
ఈ మాసం
భక్త జనులకు
వరాలనిచ్చే మందహాసం
భక్తేశ్వర వ్రతం స్త్రీలకు సౌభాగ్యం
భగినీ హస్తభోజనం
సోదరీ సోదరుల
అనురాగ కారకం.
త్రిపురాసురసంహారం
త్రిపుర పూర్ణిమ ప్రత్యేకం
కార్తీక పౌర్ణమి స్నానాలు
కల్గించు ఆరోగ్య శుభఫలితాలు.
కార్తీక పౌర్ణమి రోజున
భక్తులు మదిలో చేసే
దేవుడి స్మరణ
దీపాల వెలుగుల్తో చేసే
పాపాల హరణ
శివరాత్రిని తలపించే
కార్తీక పౌర్ణమి
హరిహరులను
మురిపించే దీపాల పున్నమి
-సంజి.మల్లేష్
9542628014

కార్తీక వైభవం!

ఎడ్డునెక్కియు లోకాల నేలునొకడు
గ్రద్దనెక్కియు జీవాల గాయునొకడు
నిద్దరికి యిష్టమగుమాస మేదియనిన
యిద్ధరణి కార్తికంబన యింపుగాను!!

మంగళముల నిమ్మనుచును
పొంగిన సద్భక్తితోడ పూజలొనర్పన్
రంగని లింగని గొల్చుచు
అంగనమణులెల్ల దల్లు రానందముగన్!!.

భవభయము లెల్లదొలుగగ
అవిరళముగ జపతపముల నభిషేకములన్
సవినయముగ జేయుదురీ
భువి కార్తికమాసమందు పుణ్యముకొరకై!!

పండువెన్నెల వెలుగులో ప్రజ్వరిల్లు
దీపశోభయే సౌఖ్యమ్ము దెచ్చిపెట్టు
మాటలకు నందలేని యీ మహితశక్తి
నొసగు నరిహరులనిషంబు నుర్వితికి!!
-సుప్పని సత్యనారాయణ.

నిత్యపూజ ఫలము

కార్తిక మాసాన మూర్తీ భవించిన
భక్తి తోడ జనులు యుక్తి జేసి
వివిధ వృక్షాలున్న విపిన దేవతజేరి
యుసిరి వృక్షపు నీడ మిసిమి గాంచి
సాలగ్రామమదున్న స్వామిని సేవించి
కథలు వినగ శ్రద్ధ కనబరిచియు
శివకేశవస్తవ మొనరించి యటుపైన
పుణ్యము సిద్ధింప పూజజేసి.

పిండి వంటకంబు ప్రియముగా నర్పించి
విపిన భోజనంపు విడిది జేసి
దీపము వెలిగించి దిరిగి వచ్చినఁజాలు
నిత్యపూజ ఫలము నిన్ను జేరు
-కమలేశ్
9160396596

హరిహరారాధన

భువిలో కార్తీకమ్మున
శివకేశవులిద్దరకును శ్రేష్టమ్మనుచున్!
ప్రవిమల భక్తిగ పూజలు
సవినయముగ జేసిరేని సౌఖ్యము కలుగున్.

హరి హరులను సద్భక్తిగ
మరువక కార్తీక మాస మందున గొలువన్!
నెరవేర్తురన్ని కోర్కెలు
వరమిత్తురు భక్త కోటి బాధలు తొలగన్ !.

కారుణ్యమ్మున భక్తుల
కోరికలను దీర్చి యశము,కూరిమి నొసగే!
వారికి ప్రియమగు మాసము
ధారుణి కార్తీక మదియె ధన్యల జేయున్ !

పాలాక్షుని చంద్రధరుని
శ్రీ లక్ష్మీ వల్లభుడిని చిత్తము నందున్!
మేలని కార్తీకమ్మను
కాలమ్మున పూజసేయు కామ్యము లబ్బున్

హరి హరులను పూజించిన
తరతరముల పాప భరము తప్పక తొలుగున్!
మరువక కార్తీకమ్మున
స్మరియించిన మానవులకు సద్గతి గలుగున్ !
-మహ్మద్ షరీఫ్
9866560527

కార్తీక మాసం

జవ్వని కాంతుల నవ్వుల పువ్వులు
విరబూసి నట్లుగ విరిసె నేడు
తేటైన ముత్యాల తేజస్సు వర్షించి
పుడమెల్ల పులిమిన పులకరించి
కొంగలన్నియు కోరి గుంపులుగా జేరి
వ్యాపించి నట్లుగ వన్నెమీరి
మల్లెల కుప్పలు జల్లెను విందుగ
యాకాశ వీథుల యాత్మలలర.

మబ్బు తునక లన్ని మంచున కదలాడి
రంగరించు కొనెను రంగుదేలి
గగన తలము నందు కాంతుల జాతర
వైభవముగ జరిగి వాసికెక్కి.

మణిపూసలు

హరిహరులకు ప్రీతికరం
ఈ జగతికి శుభంకరం
కార్తీక మాసము మన
హిందువులకు గొప్పవరం!

ఆనందము ఆరోగ్యము
మానవులకు సౌభాగ్యము
పొందుటకు కార్తీక
మాసమేను అనుకూలము!

మాసాలు పన్నెండు
అందులో బహుమెందు
మాసమే కార్తీకం
శుభమని తెల్పుకొందు!

నోములకును వ్రతాలకు
ఇల దీపారాధనకు
పవిత్ర మాసంబాయే
"కార్తీకం" భక్తులకు!

అనురాగాల బంధనం
భగినీ హస్తభోజనం
కార్తీక మాసములో
మంచిదియనే పురాణం!

పవిత్రతకు మారు పేరు
ప్రఖ్యాతికి మారు పేరు
కార్తీక మాసమే
పరమేశుకు మారుపేరు!
-వడిచర్ల సత్యం
7989511543

కార్తీక పౌర్ణమి

పరమ పవిత్రమైన
హరిహరాదుల
సన్నిదినే సరస్సుయందు
తిరుగాడే హంస
శుక్లపక్ష కార్తీక పౌర్ణమి.

సూర్యుని కిరణాలతో కలిసి
జలకాలడినట్టుగా భావిస్తూ
పొద్దున్నే నరులు
నదీస్నానాలు చేసి
తమలో తామే
మురిసిపోతుంటారు.

మనషి యొక్క మరో రూపం,
ఆత్మకు ప్రతిబింబం
దీపం పరబ్రహ్మ స్వరూపమని
మనస్సులోని చీకట్లు
తొలగిపోవాలని వెలిగించేరు.

వనభోజనం పేరిట
రమణీయమైన ప్రకృతిని
ఆస్వాదించడానికి
కుటుంబ సమేతంగా
పయనమౌతారు
సంతోషాంతరంగులౌతారు
అదంతా...
నదీస్నానాల పుణ్యం
దీపకాంతుల కారుణ్యం
అటువంటి
కార్తిక పౌర్ణమితో మా జన్మదన్యం
-ఐ.రెడ్డ్యా రాథోడ్
బాషోపాధ్యాయుడు

శ్వేతాశ్వములు వేగ చిందులు వేయుచు
యంబరమంత విహారమేగ
క్షీరంపు వెల్లువ కోరంగ గోవులే
పితికిన రీతిగ ప్రియమునివ్వ
రత్నాల కాంతుల రాసులు జగమెల్ల
కమ్మిన విధముగ కమ్ముకొనెను
హిమగిరి వరుసలు యింపుగ తీర్చగ
మెరుగులీనెను మిన్ను తరుగులేక.

వెన్నెలమ్మజిగులు కన్నుల పండుగై
రాలిపడెను మనము వాలిపోగ
స్వచ్ఛదనములూరు చంద్రుని చంద్రిక
విచ్చుకునెను విప్పివిభవమెల్ల
-ఆకుల మల్లికార్జున్
7416067335

కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక
నిర్వహిస్తున్న
'బుధవారం బాద్షా'
పోటీ ఫలితాలు
అడ్మిన్: రమాదేవి కులకర్ణి
8985613123
(ప్రథమ)
నిర్వహణ:
శ్రీమతి సత్య నీలిమ

సెల్లుతో తంట.

సెల్ ఫోన్ ది ఎంత పెద్దపొట్టో.
అంతర్జాలాన్ని తాలింపువేసి..
అవనినిండా సాంకేతికత గుప్పుమనిపిస్తూ.
మనిషికాలాన్ని హాయిగా అరగిస్తుంది...
జేబులోని కాసులను
రీఛార్జి పేరుతో ఆబాగా మింగుతూ..
ముఖచిత్ర వింతలను
మురిపెంగా చూపెడుతుంది..
అరచేతిలో ఇమిడిపోతూ మనలో
ఓ అవయవమై పోయింది...
టీవీలోని వార్తలన్ని
ఓ మాయగా చూపెడుతూ
ఛార్జింగ్ దిగుకుంటూ
యమ సిగ్గుపడుతుంది...
సెల్లులోన ముఖంపెట్టి ముందుకు నువ్వు
నడుచువేళా బండకాలికి తగిలించి
పల్లు రాలగొడుతుంది...
మునివేళ్ళతో సందేశాలు పంపి
మువ్వల నవ్వుతుంది..
దూరంగాఉన్న వాళ్ళను
దగ్గరేగా చూపించి నాకు
దయఉంది అంటుంది...
చెవికిబంక పూసినట్టు
భుజం సెల్లు కు ఆనించి
బండి నువ్వు నడుపువేళా
నీ ప్రాణం తీసేసే పనినాదే అంటుంది...
అనవసరంగా వాడుకుంటే
అవసరమేపోతుంది
నువ్వు వదిలి
ఉండలేని బంధమై పోతుంది..
మనకు తెలియని వాళ్లను మిత్రులుగా
చేసేస్తూ తిప్పలెన్నో పెడుతుంది
గొప్పనేను అంటుంది....
మరచిపోనంతగా మనతోనే ఉంటుంది
విడదీయనిబంధమై
మనమే తానంటుంది...
-దూడపాక శ్రీధర్ ..

చరవాణి చెరలో బందీ కాకు

కరోనా మహమ్మారి రాజ్యమేలుతున్న వేళ
కాలక్షేపం అంతా చరవాణిలోనే
మాటల్లేవు మాట్లాడుకోడాలు లేవు
ఇంట్లో విసిరేసినట్లు
తలా మూల కూచుని
ఎవరి సెల్ లో వారు బిజీ బిజీ!!.
అరచేతిలో వైకుంఠం
సబ్ దునియా
ముట్టి మే
పట్టుకుంటే వీడని నేస్తం!!.
బువ్వ తినాలంటే
చందమామ రావే పాటకు దూరమై
సెల్లు పాటలకు చేరువైన చిన్నారులు
సర్వప్రపంచాన్ని గుప్పిట్లో ఉంచుకుని
రాజ్యమేలుతున్న మహారాణి!!
ప్రత్యక్ష సభలు సమావేశాలు
నిషిద్ధమైన వేళ
అంతర్జాల జూము సమావేశాలకు
ప్రత్యక్ష ప్రసారాలకు
ప్రత్యక్ష సాక్షి చరవాణి!!.
ఒకప్పుడు పిల్లలకు
సెల్ ఇవ్వడం పెద్దతప్పు
పిల్లల ఆన్లైన్ పాఠాలకు
అదే ఇప్పుడు పెద్ద దిక్కు
అవసరానికి అమ్మ లాగా ఆదుకున్నా
చరవాణి చేతిలో చిక్కి
చెరలో పడకుండా చూసుకోవాలి!!.
చరవాణి చేతిలో మనిషి బందీ అయ్యాడా
మనిషి చెరలో
చరవాణి చిక్కిందా
అంతుపట్టని ప్రశ్న!!
అంతర్జాలం అదో మాయాజాలం
జాగరూకతతో ఉంటే
అందలం ఎక్కొచ్చు
తేడాగా వాడితే అదే నిన్ను
పాతాళానికి తొక్కుచ్చు!!
-పరిమి వెంకట సత్యమూర్తి
9440720324

కార్తీక పౌర్ణమి

కార్తీక మాసం
జవ్వని కాంతుల నవ్వుల పువ్వులు
విరబూసి నట్లుగ విరిసె నేడు
తేటైన ముత్యాల తేజస్సు వర్షించి
పుడమెల్ల పులిమిన పులకరించి
కొంగలన్నియు కోరి గుంపులుగా జేరి
వ్యాపించి నట్లుగ వన్నెమీరి
మల్లెల కుప్పలు జల్లెను విందుగ
యాకాశ వీథుల యాత్మలలర.

మబ్బు తునక లన్ని మంచున కదలాడి
రంగరించు కొనెను రంగుదేలి
గగన తలము నందు కాంతుల జాతర
వైభవముగ జరిగి వాసికెక్కి.

ఆహ్వానం

కరిపె రాజ్‌కుమార్ కవితా సంపుటి
ఆజాదీ

ఆవిష్కరణసభ
ముఖ్య అతిథి, ఆవిష్కర్త
శ్రీ కె. ఆనందాచారి
సభాధ్యక్షులు
డా. రూప్‌కుమార్ డబ్బీకార్
విశిష్ట అతిథి
డా. కాంచనపల్లి గోవర్ధన్ రాజు
ఆత్మీయ అతిథులు
శ్రీ కొమ్మవరపు విల్సన్ రావు
శ్రీ ఎం. నారాయణశర్మ
వేదిక: సుందరయ్య విజ్ఞాన కేంద్రం షోయబ్ హాల్
బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్
తేదీ: ఆదివారం, 26 నవంబర్ 2023
ఉదయం 10.30 గంటలకు
- పాలపిట్ట బుక్స్

అక్షరాల తోవ 6వ వార్షికోత్సవం సందర్భంగా....
అక్షరాల తోవ పురస్కారం-2024
మూడు ఉత్తమ కథలకు సమాన బహుమతులు :
ఒక్కొక్క కథకు 2000/- నగదు మరియు అక్షరాల తోవ పురస్కారం
ప్రతి సంచికలో జరిగే ఈ కథల పోటీల్లో....
నిబంధనలు :
- నవ్యత, సృజనాత్మక కలిగిన కథలు మాత్రమే ఈ పోటీకి తీసుకోబడును.
- సామాజిక అంశమేదైనా వస్తువుగా స్వీకరించవచ్చు.
- కథను డీటీపీ చేసి పంపించాలి. (A4 పైజీలో 5 పేజీలు రాయాలి) (వేరే రాత కథలు తిరస్కరించబడును.)
- ఇంతకు ముందు ఎక్కడా ప్రచురితం అయిన కథలు కాకుండా ఈ పోటీ కోసం ప్రత్యేకంగా రాసినవై ఉండాలి.
- ఒక రచయిత ఒక్క కథ మాత్రమే పంపించాలి.
- రచన వేరికీ అనుకరణ, అనువరణ కాదని హామీపత్రం జత చేయాలి. రచయిత వివరాలు హామీపత్రంలోనే పేర్కొనాలి.
- ఈ పోటీకి సంబంధించి న్యాయ నిర్ణేతదే తుది నిర్ణయం. ఎటువంటి ఉత్తర, ప్రత్యుత్తరాలకు తావు లేదు.
- మీ కథలను 30 నవంబర్ 2023వ తేదీ లోపు క్రింద తెలిపిన చిరునామాకు పోస్ట్/ కొరియర్ ద్వారా మాత్రమే పంపించాలి.
మనసును తాకాలి
మధురానుభూతిని కలిగించాలి
నాలుగు కాలాల పాటు
పాఠకుల హృదయాల్లో నిలిచే
నలికొత్త కథలకు మాత్రమే ప్రాధాన్యత.
సదా సాహిత్య సేవలో...
అక్షరాల తోవ ఖమ్మం
ఐ.నెం. 339/2018
నామా పురుషోత్తం - 9866645218
దాసరోజు శ్రీనివాస్ - 9010972169
రాచమల్ల టపేందర్ - 9849277968
మీ కథలను పంపాల్సిన చిరునామా :
రాచమల్ల టపేందర్, స్టేట్ అఫ్‌సెట్ ప్రింటర్స్, శాంతిలాడ్జి ఎదురుగా, స్టేషన్‌రోడ్, ఖమ్మం - 507001.
సెల్ : 9849277968

మస్తిష్క వికాస సాధనాలు పుస్తక బాంధాగారాలు

(14-20 నవంబర్ 'జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు" శుభ సందర్భంగా)

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

భారత గ్రంథాలయ సంఘం, ఐఎల్ఏ చొరవతో 1968 నుంచి ప్రతి